www.visalaandhra.com

స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

మంగళవారం 09-12-2025 | హైదరాబాద్ ప్రచురణ | Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam | సంపుటి : 10, సంచిక : 78 పేజీలు : 8, వెల: రూ.5.00

సీపీఐ అభ్యర్థుల గెలుపు.. అభివృద్ధికి మలుపు...

విశాలాంధ్ర-బోనకల్ : నేతాజీ గెలుపుతో నేరడ గ్రామ పంచాయతీ అభివృద్ధికి మలుపు తిరుగుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందినీ విక్రమార్క పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ మద్దతుతో నేరడ గ్రామపంచాయతీ సీపీఐ అభ్యర్థి దూసరి నేతాజీ విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం నేరడ గ్రామంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, డిప్యూటీ సీఎం భట్టి సతీమణి మల్లు నందినీ విక్రమార్క ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన రోడ్ షోలో కూనంనేని మాట్లాడుతూ నేతాజీ గెలుపుతోనే నేరడ అభివృద్ధి చెందుతుందని గ్రామాభివృద్ధే ధ్యేయంగా పనిచేసే నేతాజీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. దాదాపు నేతాజీ గెలుపు ఖాయమైందని మంచి మెజార్టీ కోసం ఈ మూడు రోజులు అవిశ్రాంతంగా పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. మల్లు నందిని మాట్లాడుతూ. అధికార పార్టీ బలపర్చిన సిపిఐ అభ్యర్థి నేతాజీ ని గెలిపిస్తే ప్రభుత్వం నుండి రావాల్సిన అన్ని రకాల సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన అందరికీ అందిస్తామని ఆమె హామీ ఇచ్చారు. నేరడ గ్రామంతో తమకు ప్రత్యేక అనుభంధం ఉందని నేతాజీ మా ఇంటి బిడ్డ అని నేతాజీని భారీ మెజార్టీతో గెలిపిస్తే నేరడ అభివృద్ధి భాధ్యత తనదేనని వాగ్దానం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు పావులూరి మల్లిఖార్జునరావు, మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంబటి వెంకటేశ్వర్లు, మహిళా అధ్యక్షురాలు తోటకూరి ప్రగతి, నాయకులు మదుపల్లి భాస్కర్, మంకెన నాగేశ్వం రావు, మేడ నర్సయ్య కాంగ్రెస్, సిపిఐ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఐ అభ్యర్థి మందడపు రాణిని గెలిపించండి

మండల పరిధిలోని మల్లారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సీపీఐ అభ్యర్థిని మందడపు రాణిని అఖండ మెజార్టీతో గెలిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రజలను అభ్యర్థించారు. సోమ వారం గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, జిల్లా నేతలతో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటి ప్రచారంలో పాల్గొని మందడపు రాణిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. గతంలో మల్లారం ఎంపీటీసీగా గ్రామ అభివృద్ధికి సిపిఐ జిల్లా నాయకులు అమరజీవి కామ్రేడ్ మందడపు నాగేశ్వరావు సేవలను కొనియాడారు. కాంగ్రెస్ బలపరిచిన సీపీఐ అభ్యర్థిని గెలిస్తేనే గ్రామం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. గ్రామ అభివృద్ధికి భర్త అడుగుజాడల్లో నడుస్తూ సర్పంచ్‌గా పోటీ చేస్తున్న మందడపు రాణి గెలుపుతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవి బాబు, మధిర మండల కార్యదర్శి ఓట్ల కొండల రావు, ఇతర జిల్లా నాయకులు మండల నాయకులు, కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

గంజాయి ముఠా అరెస్టు

విశాలంధ్ర - భద్రాచలం : జిల్లా పోలీసులు అనేక దఫాలు కోట్లాది రూపాయల విలువచేసే గంజాయిని వాహనాలను పట్టుకుంటు న్నప్పటికీ స్మగ్లర్లను అరికట్టలేని పరిస్థితి కొన్నేళ్లుగా సాగు తుంది. ఈ క్రమంలో రూ కోటి 11 లక్షల పైబడి విలువచేసే సుమారు 253 కిలోల నిషేధిత గంజాయిని పట్టుకున్నారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సోమవారం మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. భద్రాచలం పోలీసులు ఆదివారం సాయంత్రం సుమారు 7 గంటల సమయంలో ఎస్ ఐ సతీష్ ఆధ్వర్యంలో కూనవరం రోడ్డు ప్రాంతంలో వాహన తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. ఆ సమయంలో కూనవరం నుండి భద్రాచలం వైపుగా వస్తున్న అశోక్ లైలాండ్ వాహనం కొంత దూరంలోనే పోలీసులను చూసి వాహనాన్ని వెనుకకు మళ్ళించి తప్పించుకొని పారిపోయే ప్రయత్నం చేసారు. ఈ విషయాన్నీ గమనించిన పోలీసులు, ఆ వాహనాన్ని కొంత దూరం వెంబడించి పట్టుకున్నారు. ఆ లారిని ఆర్డివో ఆఫీసు వద్దకు తీసుకొచ్చి వెలుతురులో తనిఖీ చేసారు. అందులో 110 వరకు గంజాయిని ప్యాకెట్లగా చేసి తరలిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే వాహనంలో ఉన్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వాహనంలో పట్టుబడిన 110 ప్యాకెట్లలో సుమారుగా ఒక కోటి రూ:1,11,48,300 విలువ గల 222.966 కేజీల నిషేదిత గంజాయిని గుర్తించి పంచనామా చేసినట్లు ఎస్పీ తెలిపారు. పట్టుబడిన నలుగురు వ్యక్తులతో పాటు ఈ గంజాయిని విక్రయించిన వారితోపాటు కొనుగోలు చేస్తున్న వ్యక్తులపై కూడా కేసు నమోదు చేయడం జరిగిందని వారు తెలిపారు.

పుల్లయ్య మృతికి నేతల నివాళి

విశాలాంధ్ర ఖమ్మం : ఖమ్మం నగరంలోని 15వ డివిజన్ కొత్తగూడెం సీపీఐ శాఖ సభ్యులు గంధం పుల్లయ్య (68) మృతిచెందారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందారు. మృతునికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతివార్త తెలుసుకున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్‌తో పాటు పలువురు నాయకులు సోమవారం పుల్లయ్య భౌతికాయాన్ని సందర్శించి పార్టీ జెండా కప్పి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ సిపిఐ పార్టీ అభివృద్ధి కోసం పుల్లయ్య నిరంతరం కృషి చేశారని -ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. సీపీఐ నిర్వహించిన పలు పోరాటాల్లో ఆయన చురుగ్గా పాల్గొన్నారన్నారు. కుటుంబ -సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. 15వ డివిజన్ కార్యదర్శి జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు, కొత్తగూడెంశాఖ కార్యదర్శి రావుల హన్మంతరావు, కొత్తగూడెం మత్స్యసహకార సంఘం అధ్యక్షులు ముద్రబోయిన అప్పారావు, నాయకులు పొట్టా ప్రసాద్, కర్రి హుస్సేన్, కర్రీ కృష్ణ, చలపతి, కర్రీ వెంకటేశ్వర్లు తదితరులు పుల్లయ్య భౌతికాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

వామపక్ష పార్టీల అభ్యర్థులను గెలిపించండి

విశాలాంధ్ర-నేరేడు చర్ల : నేరేడుచర్ల పాలకవీడు మండలాల్లో సీపీఐ -సిపిఎం పార్టీల తరపున సర్పంచ్ మరియు వార్డ్ మెంబర్లుగా పోటీ చేస్తున్న వారికి ఓటర్లు అండగా నిలబడి వారిని గెలిపించాలని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు ధూళిపాళ ధనుంజయనాయుడు విజ్ఞప్తి చేశారు. సోమవారం నాడు ఆయన నేరేడుచర్ల సిపిఐ కార్యాలయం ప్రజా భవన్ లో పార్టీ ముఖ్యులతో కలిసి పాత్రికేయులతో మాట్లాడుతూ.... అధికారం ఉన్నా లేకపోయినా, ఏ పార్టీ వారు కేంద్రంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పటికీ ప్రజా సమస్యల పరిష్కారం కొరకు ప్రజలకు అవసరమైనప్పుడు ప్రజా ఉద్యమాలు నిర్మించాల్సి వచ్చినప్పుడు ప్రజలకు అండగా నిలబడేది కమ్యూనిస్టులు అనే విషయం లోక విదితమేనని, ఈనాడు దేశ పౌరులు అనుభవించే ప్రతి సౌలభ్యం కూడా వామపక్ష పార్టీలు ఉద్యమాలు చేసి సాధించుకున్నవేనని, ఉదాహరణకు పంటల బీమా పథకం కావాలని వామపక్ష రైతు సంఘాలు అనేక దశాబ్దాలు పోరాడి సాధించుకున్నాయని,పంటల బీమా పథకం కావాలని వామపక్ష రైతు సంఘాలు అనేక దశాబ్దాలు పోరాడి సాధించుకున్నాయని ఒంటరి మహిళలకు పెన్షన్ కావాలని వికలాంగులకు వితంతువుల పెన్షన్లు కావాలని దేశవ్యాప్త ఉద్యమాలను చేసిన ఫలితంగానే ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు దిగివచ్చి ఆయా రాష్ట్రాలు స్కీములు అమలు చేస్తున్నారని ఇప్పుడు కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలని ఉద్యమాలు చేస్తున్నామని కచ్చితంగా సాధించి తీరుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. వ్యవసాయానికి ఇన్పుట్ సబ్సిడీ కావాలి ఉద్యమం చేసిన ఫలితంగానే రైతు భరోసా పథకం రాష్ట్రంలో అమలవుతుందని, అయితే ఇంకా సాధించుకోవాల్సినవి చాలా ఉన్నాయని ముఖ్యంగా దేశ ప్రజలందరికీ ఉచిత విద్య ఉచిత వైద్యం ఉచిత న్యాయం అందుబాటులోకి రావాలని అప్పుడే కమ్యూనిస్టు కలలు కన్న సమ సమాజం ఏర్పడుతుందని అందరికీ చదువుకునే హక్కు అందరికీ ఆరోగ్యంగా జీవించే హక్కు అందరికీ న్యాయం పొందే హక్కు లభిస్తుందని ఆ రోజు కోసమే కమ్యూనిస్టులు ఉద్యమిస్తున్నారని అలాంటి కమ్యూనిస్టులకు ఓటర్లు ప్రథమ ప్రాధాన్యత ఇచ్చి ఎవరితో పొత్తు ఉన్నా లేకపోయినా సర్పంచ్ మరియు వార్డ్ మెంబర్లుగా నిలబడ్డ వారిని అత్యధిక మెజార్టీతో గెలిపించి అండగా నిలబడాలని ఆయన కోరారు ఆయన వెంట మండల సిపిఐ కార్యదర్శి కత్తి శ్రీనివాసరెడ్డి నేరేడుచర్ల పట్టణ సిపిఐ కార్యదర్శి యల్లబోయిన సింహాద్రి ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను బీసీ హక్కుల సాధన సమితి జిల్లా సహాయ కార్యదర్శి కొమ్రాజు వెంకట్ వున్నారు.

పోలింగ్ విధులు సమర్థవంతంగా నిర్వహించాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో సంగారెడ్డి. ఎన్నికల్లో ప్రిసైడింగ్ అధికారుల పాత్ర అత్యంత కీలకమైన దని, పోలింగ్ విధులను ప్రిసైడింగ్ అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ పి. ప్రావీణ్య సూచించారు. సదాశివపేట మండలం మద్దికుంట చౌరస్తాలోని కింగ్స్ ఫంక్షన్ హాల్ లో మొదటి దశ పంచాయితీ ఎన్నికలకు సంబంధించి ప్రిసైడింగ్ అధికారులకు రెండవ విడత శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ తరగతులను సందర్శించిన కలెక్టర్, ఈ సందర్భంగా ప్రిసైడింగ్ అధికారులకు పోలింగ్ విధులకు సంబంధించి కీలకమైన అనేక సూచనలు చేసారు. పోలింగ్ ప్రక్రియలో పీ.ఓలు క్రియాశీలకంగా వ్యవహరించాల్సి ఉంటుందని అన్నారు. నిబంధనలు పక్కాగా పాటిస్తూ పోలింగ్ ప్రక్రియను సాఫీగా నిర్వహించాలని, ఏ చిన్న తప్పిదానికి ఆస్కారం కల్పించకూడదని చెప్పారు. సమయ పాలనను పాటిస్తూ, సకాలంలో నిర్దేశించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలన్నారు. మొదటి విడత పోలింగ్ ఈ నెల 11న జరుగనున్న దృష్ట్యా, 10న నిర్ణీత సమయంలోపు డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు చేరుకుని, పోలింగ్ మెటీరియల్ ను తీసుకోవాలన్నారు. చెక్ లిస్టుకు అనుగుణంగా బ్యాలెట్ పత్రాలు, ఇతర సామాగ్రి ఉందా లేదా అన్నది క్షుణ?ంగా పరిశీలించుకోవాలని తెలిపారు.

డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి పోలింగ్ స్టేషన్ కు చేరుకొని ఓటింగ్ నిర్వహణ ఏర్పాట్లను ముందస్తుగా చక్కబెట్టుకోవాలని కలెక్టర్ మార్గనిర్దేశం చేశారు.ఓటింగ్ విషయంలో గోప్యత నూటికి నూరు శాతం అమలు జరిగేలా చూడాలన్నారు. ఓటరు జాబితాను అనుసరిస్తూ ఓటర్లను నిర్ధారించి, వారు ఓటు హక్కు వినియోగించు కునేలా చూడాలాన్నారు. అనుమతి ఉన్న వారిని మాత్రమే పోలింగ్ కేంద్రాల లోపలికి అనుమతించాలన్నారు. ఎన్నికల సంఘం రూపొందించిన హ్యాండ్‌బుక్‌ను ప్రతీ పీఓ క్షుణంగా చదివి స్పష్టమైన అవగాహన ఏర్పరచుకోవాలని, పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలు సాఫీగా జరిగి గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, సజావుగా పూర్తయ్యేలా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.

ఆశ్రమ పాఠశాల వార్డెన్ నిర్లక్ష్యం

- అనుమతి లేకుండా బయటికి వెళ్లిన విద్యార్థి
- రోడ్డు ప్రమాదానికి గురై తలకు తీవ్ర గాయాలు
- హుటా హుటిన ఆసుపత్రికి తరలించిన ఉపాధ్యాయులు
- విషయాన్ని గోప్యంగా ఉంచిన ఉపాధ్యాయులు

విశాలాంధ్ర కారేపల్లి: ఆశ్రమ పాఠశాల వార్డెన్ స్థానికంగా విద్యార్థులను పట్టించుకోకపోవడంతో అనుమతి లేకుండా బయటకు వెళ్లిన విద్యార్థికి రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలైన ఘటన సింగరేణి మండల పరిధిలో చోటు చేసుకుంది.వివరాల్లోకి వెళితే పరిధిలోని శాంతినగర్ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత ఆశ్రమ పాఠశాల నుండి ఆదివారం సాయంత్రం ఓవిద్యార్థి ఉపాధ్యాయుల అనుమతి లేకుండా బయటికి వెళ్లాడు. ఈ క్రమంలో ఒక ద్విచక్ర వాహనదారుడిని లిఫ్ట్ అడిగి వెళ్తుండగా ఆ మోటార్ సైకిల్ ప్రమాదానికి గురి అయింది.ఈ ప్రమాదంలో ఆ విద్యార్థి తలకు బలమైన గాయాలు తగిలాయి.రఘునాథపాలెం మండలం దోనబండకు చెందిన బానోత్ సాగర్ ఉసిరికాయలపల్లి ఆశ్రమ పాఠశాల వసతి గృహంలో ఉంటూ తొమ్మిదో తరగతి విద్యను అభ్యసిస్తున్నాడు. ఆదివారం సెలవు దినం కావడంతో ప్రధానోపాధ్యాయుడు, హాస్టల్ వార్డెన్ పాఠశాలలో అందుబాటులో లేరు. దీంతో ఆ విద్యార్థి ఎటువంటి అనుమతి లేకుండా సమీపంలోని ఇల్లెందుకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ఇల్లెందు కరెంట్ ఆఫీస్ నుండి పాఠశాల వైపు వచ్చేందుకు వివాహన దారుడుని లిఫ్ట్ అడిగి వస్తుండగా మోటార్ సైకిల్ ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది.ఈ ప్రమాదంలో బైకుపై వెనుక కూర్చున్న విద్యార్థి తలకు గాయాలు తగిలాయి. దీంతో ఆవాహనద ారులు విద్యార్థిని అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. గాయపడిన విద్యార్థి ప్రమాదం జరిగిన విషయాన్ని తన తండ్రికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. విద్యార్థి తండ్రి పాఠశాల వార్డెన్ కు ఫోన్‌చేయగా ఉపాధ్యాయులు అక్కడకు చేరుకుని అతన్ని ఇల్లెందు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు.ఇల్లందు ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సిబ్బంది మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం రిఫర్ చేశారు. కొత్తగూడెంలో చికిత్స పొందుతున్న ఆ విద్యార్థిని సోమవారం హాస్టల్ వార్డెన్ ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేపిస్తున్నాడు.ఈ విషయమై హాస్టల్ వార్డెన్ బావ్ సింగ్ ను విశాలాంధ్ర వివరణ అడిగేందుకు ప్రయత్నించగా ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉంది.

ఎలక్షన్ మెటీరియల్ పంపిణీకి సిద్ధం

విశాలాంధ్ర బ్యూరో నిర్మల్ జిల్లా : ఖానాపూర్ మండలంలో, డిసెంబర్ 10న జరగనున్న సర్పంచ్ వార్డ్ మెంబర్ ఎలక్షన్ల కొరకు ఖానాపూర్ మండలంలోని వివిధ గ్రామపంచాయతీలలో గల ఒక వంద 16 బూతులకు ఎలక్షన్ మెటీరియల్ ఖానాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో సిద్ధం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమాకాంత్ ఎంపీఓ రత్నాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో మహబూబాబాద్ /తొర్రూరు: పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలని, పోటీలో ఉన్న అభ్యర్థులు నిబంధనలు పాటించాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని తొర్రూరు డీఎస్పీ కృష్ణ కిశోర్ పేర్కొన్నారు. సోమవారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు, పోటీలో ఉన్న సర్పంచ్ అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలని, ప్రతీ ఒక్కరు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని సూచించారు. గ్రామాల్లో గొడవలు, గుంపులు, తగాదాలు, ఉద్రిక్తతలకు దారితీస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సోషల్ మీడియాలో పుకార్లు, నిర్ధారణలేని వార్తలు ప్రచారం చేయవద్దన్నారు. ప్రతీ ఒక్కరు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. అన్ని పార్టీల నాయకులు పోలీసుశాఖకు సహకరించాలని కోరారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ గడీల శ్రీనివాస్, సీఐ గణేష్ ఎస్సై ఉపేందర్, సర్పంచు అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ సర్పంచ్ అభ్యర్థికి ప్రజాదరణ

విశాలాంధ్ర జిల్లా బ్యూరో మహబూబాబాద్: మహబూబాబాద్ మండలంలోని ముడుపుగల్ గ్రామ సీపీఐ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తండా సందీప్ ప్రజలు మెండుగా ఆదరిస్తున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయ సారధి అన్నారు. సోమవారం సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ముడుపుగల్ గ్రామంలో సిపిఐ శ్రేణులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తండా సందీప్‌ను ఆశీర్వదించమని, అన్ని విధాలుగా ముడుపుగల్లు అభివృద్ధి చేస్తామన్నారు. ముడుపుగల్ గ్రామంలో తండా సందీప్ కు ప్రజా మద్దతు పెరుగుతుందన్నారు. విజయం సాధించి ప్రజల ఆశీర్వాదంతో గ్రామాల్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరుస్తామని, ఏ సమస్య వచ్చినా గుమ్మం ముందు నిలబడి ప్రజల కోసం పనిచేస్తామన్నారు. తండా సందీప్ ను ఆశీర్వదించమని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బి అజయ్ సారధి రెడ్డి, పెరుగు కుమార్, రేశపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిళ్ళ సాంబలక్ష్మి, వీరవెల్లి రవి, కేదాసు రమేష్ ,మేక వీరన్న, జలగం ప్రవీణ్, వంకాయలపాటి చిరంజీవి, ఎర్రోజు పద్మ ,మంద శంకర్ ,తండా శ్రీనాథ్, గార రవిచంద్రబోస్, పులి యాకయ్య, రాంప్రసాద్ ,బీదర్, ఎండి రఫీ, పాలగాని శ్రీను, వినయ్ కుమార్, సాయి, శ్రీనాథ్ ,అరుణ్ ,గురు స్వామి, సతీష్ ,శ్రీను పాల్గొన్నారు.

సర్పంచ్‌గా అవకాశం ఇవ్వండి సేవకురాలిగా ఉంటా

విశాలాంధ్ర-మరిపెడ: తనకు సర్పంచ్ గా ఒక్కసారి అవకాశం ఇచ్చి చూడండి..మీ రుణం తీర్చుకుంటా మీ సేవకురాలిగా ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని ఓ స్వతంత్ర అభ్యర్థి సొంత మేనిఫెస్టోను ఓ బాండు పేపర్ పై వ్రాయించి సోమవారం విడుదల చేశారు. కథనం ప్రకారం.. మరిపెడ మండలం అబ్బాయిపాలెం జీపీ సర్పంచ్ పదవిని ఎస్టీ మహిళకు కేటాయించారు. గ్రామ పరిధిలోని బోడతండాకు చెందిన బోడ ఉమారాంజీనాయక్ స్వతంత్ర సర్పంచ్ అభ్యర్థిగా ఇటీవల నామినేషన్ దాఖలు చేశారు. సొంత మేనిఫెస్టోలోని అధికారంలో ఉన్న ఐదేళ్లపాటు గ్రామస్తుల ఇంటి పన్ను చెల్లిస్తాను. ఇంట్లో మృతి చెందిన వారికి రూ.5 వేలు సాయం. ఆడపిల్ల పెళ్లికి చీరెచారె, మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు, సేవాలాల్ విగ్రహం ఏర్పాటు, ఫ్రీజర్ బాక్స్ ఏర్పాటు, మేరమ్మ ఆలయ నిర్మాణం, సవార్ లచ్చమ్మ పండుగకు రూ.లక్ష రూపాలు సాయం ఇలా పలు అభివృది పనులు గ్రామంలో చేపటనున్నటు బాండు పేపర్ ద్వారా వివరించారు.

ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలి

విశాలాంధ్ర-నిజామాబాద్ : గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ విధులలో ఉన్న ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ఎంపీడీఓ కార్యాలయాలలో ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ టి వినయ్ కృషా?రెడ్డి తెలిపారు. ఎన్నికల విధులలో ఉన్న ఉద్యోగులు సంబంధిత మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. మొదటి దశ గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్న బోధన్, చందూర్, కోటగిరి, మోస్రా, పోతంగల్, రెంజల్, రుద్రూర్, సాలూర, వర్ని, ఎడపల్లి, నవీపేట మండలాలల్లో ఎన్నికల విధులు కేటాయించబడిన ఉద్యోగులందరూ 9లోపు సంబంధిత ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ సదుపాయం ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు.అదేవిధంగా, రెండవ దశలో ఎన్నికలు జరుగనున్న ధర్పల్లి, డిచ్పల్లి, ఇందల్వాయి మాక్లూర్ మోపాల్ నిజామాబాద్ సిరికొండ జక్రాన్పల్లి మండలాల్లో ఎన్నికల విధులకు హాజరయ్యే ఉద్యోగులు 10 నుండి 12 లోపు సంబంధిత మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలోని ఫెసిలిటేషన్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. మూడవ దశ ఎన్నికలు జరగనున్న ఆలూర్, ఆర్మూర్, బాల్కొండ, భీమ్గల్, డొంకేశ్వర్, కమ్మర్పల్లి, మెండోరా, మోర్తాడ్, ముప్కాల్, నందిపేట్, వేల్పూర్, ఏర్గట్ల మండలాలలో ఎన్నికల విధులకు హాజరయ్యే ఉద్యోగులు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో డిసెంబర్ 13 నుండి 15వ తేదీ లోపు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలనికలెక్టర్ సూచించారు.

మద్యం దుకాణాలు బంద్: సీపీ

విశాలాంధ్ర ఖమ్మం క్రైమ్ : డిసెంబర్ 11,14,17 తేదీలలో జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఖమ్మం కమిషనరేట్ పరిధిలోని ఆయా మండలల్లో మద్యం విక్రయాలను నిలిపివేయాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. డిసెంబర్ 11న జరిగే ఎన్నికలకు డిసెంబర్ 9 సాయంత్రం 5:00 గంటల నుండి డిసెంబర్ 11న ఎన్నికలు ముగిసి, ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడించే వరకు ఆయా మండలల్లో మద్యం విక్రయాలను నిలిపివేయాలి. (కొణిజర్ల,రఘునాథపాలెం, వైరా, బోనకల్, చింతకాని, మధిర, ఎర్రుపాలెం) అదేవిదంగా డిసెంబర్ 14న జరిగే ఎన్నికలకు డిసెంబర్ 12 సాయంత్రం 5:00 గంటల నుంచి డిసెంబర్ 14న ఎన్నికలు ముగిసి, ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడించే వరకు ఆయా మండలల్లో మద్యం విక్రయాలను నిలిపివేయాలి. (కామేపల్లి, ఖమ్మం రూరల్, కూసుమంచి, ముదిగొండ, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం) డిసెంబర్ 17 న జరిగే ఎన్నికలకు డిసెంబర్ 15న సాయంత్రం 5:00 గంటల నుండి డిసెంబర్ 17న ఎన్నికల ముగిసి, ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడించే వరకు ఆయా మండలల్లో మద్యం విక్రయాలను నిలిపివేయాలి.(ఏన్కూరు, కల్లూరు,పెనుబల్లి, సత్తుపల్లి, తల్లాడ,వేంసూర్,సింగరేణి) అదేవిదంగా అయా తేదీలలో ఆయా మండలల్లో వైన్ షాపులు, బార్లు, మద్యం సరఫరా చేసే రెస్టారెంట్లు, మూసివేయాలని ఆదేశించారు. ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుండా పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా ముందస్తు చర్యలలో భాగంగా మూసివేయాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించి ఎవరైనా మద్యం దుకాణాలు ఓపెన్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలు పాటిస్తూ ప్రశాంతంగా పోలింగ్ జరిగేలా సహకరించాలని కోరారు.

టోల్ ఫ్రీ నెంబర్‌తో అవినీతికి అడ్డుకట్ట : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో ఖమ్మం : 1064 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయడం ద్వారా అవినీతికి అడ్డుకట్ట వేయవచ్చని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అవినీతి నిరోధక వారోత్సవాలను పురస్కరించుకొని పోస్టర్ లను, అవినీతి నిర్మూలన నినాదంతో కూడిన క్యూ ఆర్ కోడ్ పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఉద్యోగులు, అధికారులు తమవిధి నిర్వహణలో జవాబుదారితనంతో ఉంటూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. మనమంతా నిబద్ధతతో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని కలెక్టర్ సూచించారు. అవినీతి అక్రమాల నిర్మూలనలో అందరూ భాగస్వామ్యం కావాలని కలెక్టర్ పిలుపు నిచ్చారు. ప్రభుత్వ కార్యాలయంలో ప్రజలను ఎవరైనా లంచం ఇవ్వమని వేధిస్తే 1064 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని, ప్రభుత్వ అధికారులతో పని చేయించుకోవడం ప్రజల హక్కు అని, ఆ హక్కును లంచంతో కొనవద్దని, ఎట్టి పరిస్థితుల్లో ఎవరికి ఏ పని కోసం ఒక రూపాయి ఇవ్వాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏసిబి డిఎస్పి వై. రమేష్, సీఐబి. బాలాజీ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రుల తనిఖీ

విశాలాంధ్ర-సూర్యాపేట బ్యూరో : జిల్లాలో ప్రజలకు సరైన వైద్య, ఆరోగ్య సేవలు అందేలా జిల్లా వైద్యశాఖ నిరంతరం చర్యలు తీసుకుంటోంది అని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా. పెండెం వెంకటరమణ (MBBS, DCH) అన్నారు. క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం అమలు తీరును ప్రత్యేక బృందాల ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ కేంద్రాలను క్రమం తప్పకుండా తనిఖీ చేస్తూ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ క్రమంలో డా. జి. చంద్రశేఖర్, డిప్యూటీ డీఎంహెచ్ఓ నేతృత్వంలో సోమవారం సూర్యాపేట పట్టణంలోని పలు ప్రైవేటు ఆసుపత్రులపై తనిఖీలు నిర్వహించారు. అనుమతి పొందిన ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ కేంద్రాల్లో వైద్య సేవలకు నిర్ణయించిన చార్జీల పట్టిక ఉన్నదీ లేనిదీ, వసూళ్ల వివరాలు, రికార్డులను పరిశీలించారు. ఈ తనిఖీలలో సంజీవ రెడ్డి, డిప్యూటీ డీఈఎంఓ, శ్రీకల్యాణ్ పాల్గొన్నారు.

సమన్వయ్యంతో పనిచేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర-నల్గొండ బ్యూరో : గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణలో అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని, ఎక్కడైనా లోపాలు కనిపిస్తే వెంటనే సరిదిద్దుకొని పని చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సోమవారం శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డ్‌లో ఏర్పాటుచేసిన ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ మరియు రిసెప్షన్ కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలింగ్‌కు సంబంధించిన సామాగ్రి, పోస్టల్ బ్యాలెట్ పత్రాలు, పోలింగ్ బాక్స్‌లను పరిశీలించారు.పోలింగ్ ఏర్పాట్లపై అధికారులను వివరంగా అడిగి తెలుసుకున్న కలెక్టర్, ప్రజాస్వామ్య వ్యవస్థలో గ్రామస్థాయి ఎన్నికలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. ప్రతి ఓటరు తన ఓటు హక్కును వినియోగించుకునేలా ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగాలని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు క్రమబద్ధంగా, శాస్త్రీయ పద్ధతుల్లో ఏర్పాటు చేయాలని సూచించారు.పోలింగ్ సిబ్బందికి అవసరమైన సామాగ్రి సరఫరాలో ఆలస్యం జరగకుండా చూడాలని, సామాగ్రి పంపిణీ, స్వీకరణకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి స్పష్టమైన సూచికలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విశ్రాంతి గదులు, పారిశుద్ధ్య వసతులు, వైద్య సౌకర్యాలు, దివ్యాంగుల కోసం ర్యాంపులు, లైటింగ్ సదుపాయాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శ్రీనివాస్ రావు, జిల్లా పంచాయతీరాజ్ అధికారి వెంకటయ్య, నల్గొండ ఆర్డీవో వై. అశోక్ రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి, శాలిగౌరారం తహసీల్దార్ వరప్రసాద్, ఎంపీడీవో జ్యోతిలక్ష్మి పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ

విశాలాంధ్ర, కొమరం భీం : జిల్లా కేంద్రంలోన కలెక్టరేట్ భవన ఆవరణలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం కొరకు అవసరమైన ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. 9న ఉదయం 10.00గంటలకు తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఉన్నందున అవసరమైన ఏర్పాట్లు చేయాలని రహదారులు- భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. విగ్రహం వద్ద రంగుల పూలతో అలంకరించాలని, కార్యక్రమానికి వచ్చే వారికి తాగునీరు, టీ, అల్పాహారం అందించాలని తెలిపారు. ఆవిష్కరణ కార్యక్రమానికి 300 మంది విద్యార్థులు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.

మంగళవారం
09-12-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 10, సంచిక : 78
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

పైలట్లకు ఎయిరిండియా ఆహ్వానం

న్యూఢిల్లీ: ఇండిగో సంక్షోభం వేళ టాటా గ్రూప్ అధ్వర్యంలోని ఎయిరిండియా కీలక నిర్ణయం తీసుకుంది. పైలట్ల నియామకాలకు దరఖాస్తులు కోరింది. ఈమేరకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పోస్టు పెట్టింది. తగినంత సంఖ్యలో పైలట్లు, సిబ్బందిని నియమించుకోనందున ఇండిగో కొన్నిరోజులుగా వందల సంఖ్యలో విమానాలు రద్దు చేస్తున్న కారణంగా ఈ ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. 'ఆకాశం హద్దు కాదు. అది ప్రారంభం మాత్రమే' అంటూ ఎయిరిండియా ఆ పోస్టులో పేర్కొంది. 'భారత విమానయాన రంగం భవిష్యత్తు నిర్దేశకులుగా మారండి. విమానాల సంఖ్యను పెంచుతున్నందున అనుభవజ్ఞులైన పైలట్లను ఆహ్వానిస్తున్నాం. డిసెంబరు 22వ తేదీలోపు దరఖాస్తు చేసుకోండి' అని పేర్కొంది.

రాజకీయ లబ్ధే పరమావధి

- లోక్‌సభలో వందేమాతరంపై మోదీ వివాదాస్పద ప్రసంగం
- జాతీయగేయానికి మతం రంగు, చరిత్ర వక్రీకరణ
- కాంగ్రెస్ వల్లే వందేమాతరం ముక్కలైందని వ్యాఖ్యలు
- దేశ తొలి ప్రధానిపైనా ఆరోపణలు



న్యూఢిల్లీ: పార్లమెంటులో 'వందేమాతరం'పై చర్చ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ జాతీయగేయానికున్న చరిత్రకు మతం, రాజకీయరంగు పులిమే ప్రయత్నం చేశారు. పశ్చిమబెంగాల్‌లో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికల్ని దృష్టిలో పెట్టుకుని రాజకీయప్రయోజనాల కోసం కాంగ్రెస్ పార్టీతో పాటు ముస్లింలపై ద్వేషభావం రెచ్చగొట్టేవిధంగా వివాదాస్పద ప్రసంగం చేశారు. తనదైన శైలిలో చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేశారు. గంట సేపు వందేమాతరంపై ప్రసంగించిన మోదీ... జవహర్ లాల్ నెహ్రూను, మహమ్మద్ అలీ జిన్నాను ఒకటిగా చూపేందుకు తీవ్ర ప్రయత్నం చేశారు. వందేమాతరం గీతానికి 150 ఏళ్లు పూర్తైన నేపథ్యంలో సోమవారం పార్లమెంట్‌లో ప్రత్యేక చర్చ జరిగింది. ప్రధాని మోదీ చర్చను ప్రారంభిస్తూ... వందేమాతరంతో పాటు నాటి పరిస్థితులు, అనంతర విషయాలపై మాట్లాడారు. కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ఈ గేయానికి ఉన్న ఘన చరిత్రను, వలస పాలన వ్యతిరేక స్ఫూర్తిని ప్రధాని వివరించారు. 'ఈ రోజు మనం ఈ పవిత్రమైన వందేమాతరాన్ని స్మరించుకోవడం ఈ సభలోని మనందరికీ గొప్ప అదృష్టం' అని ప్రధాని మోదీ లోక్‌సభలో అన్నారు. అయితే, 1937లో కాంగ్రెస్ పార్టీ ఈ గీతం నుంచి కొన్ని పంక్తులను తొలగించిందని, అదే దేశ విభజనకు బీజాలు వేసిందని ప్రధాని మోదీ ఆరోపించడంతో ఈ చర్చ రాజకీయ రంగు పులుముకుంది. 'భారతదేశాన్ని చిన్నచూపు చూడటం ఒక ఫ్యాషన్‌గా మారిన నాటి సమయంలో బంకిం బాబు వందేమాతరం రాశారు' అని ప్రధాని మోదీ వందేమాతరం రచయిత బంకిం చంద్ర ఛటర్జీ గురించి ప్రస్తావించారు. ఈ సమయంలో టీఎంసీకి చెందిన బెంగాలీ ఎంపీ అడ్డుకుని, 'బంకిం దా' (దా అంటే సోదరుడు) అనకుండా, గౌరవ సూచకమైన 'బంకిం బాబు' అని

- మిగతా 5 లో

నెహ్రూపై చర్చిద్దాం రండి: మోదీకి ప్రియాంక సవాల్

న్యూఢిల్లీ: లోక్‌సభలో వందేమాతరంపై చర్చ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ మోదీ సర్కార్‌పై తనదైనశైలిలో ధ్వజమెత్తారు. "మీరు నెహ్రూ చేసిన తప్పులను, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ చేసిన తప్పులను ఎత్తిచూపుతుంటారు. వందేమాతరంపై చర్చ చేసినట్లే, నెహ్రూపై కూడా చర్చిద్దాం. మీరు నెహ్రూ తప్పుల జాబితాను తయారు చేయండి. దానిపై పార్లమెంట్‌లో విస్తృతమైన చర్చ నిర్వహిద్దాం" అని ప్రధాని మోదీకి సవాల్

- మిగతా 5 లో

మావోయిస్టు అగ్రనేత రామ్‌ధేర్ లొంగుబాటు

అతడి బాటలోనే మరో 11 మంది...
చత్తీస్‌గఢ్ సీఎంకు ఆయుధాలు అప్పగింత
ఎంఎంసీ స్పెషల్ జోన్‌లో జల్లెడపడుతున్న భద్రతా బలగాలు

విశాలాంధ్ర-చింతూరు: మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్ రాష్ట్ర కమిటీ ఇంచార్జి రామ్‌ధేర్ ముజ్జీతో సహా 12 మంది లొంగిపోయారు. చత్తీస్‌గఢ్‌లోని బైరాగఢ్ జిల్లా కర్కట్టానా పరిధిలోని కుస్తీ గ్రామంలో ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి ఎదుట సోమవారం సరెండర్ అయ్యారు. మూడు ఏకే-47 గన్స్, మూడు ఇన్సాస్, రెండు ఎస్ఎల్ఆర్ గన్స్, రెండు 303 రైఫిళ్లు, కార్బైడ్‌ను అప్పగించారు. మావోయిస్టు అగ్రనేత రామ్‌ధేర్‌పై రూ.కోటి రివార్డు ఉంది. అతడు అనేక దాడుల్లో పాల్గొన్నాడు. 1990లో మావోయిస్టు పార్టీలో సాధారణ సభ్యుడిగా

- మిగతా 5 లో

ఇండిగోపై అత్యవసర విచారణ చేయలేం

న్యూఢిల్లీ: 'ఇండిగో సంక్షోభం'పై దాఖలైన పిటిషన్‌ను అత్యవసరంగా విచారించేందుకు సోమవారం సుప్రీంకోర్టు నిరాకరించింది. సర్వీసుల్లో తీవ్ర అంతరాయాన్ని ఇప్పటికే పరిగణనలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వం... దాని పరిష్కారం దిశగా చర్యలు ప్రారంభించిందని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. 'ఇది తీవ్రమైన అంశమే. భారీ సంఖ్యలో ప్రయాణికులు విమానాశ్రయాల్లో చిక్కుకుపోయారు. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం సకాలంలో చర్యలు ప్రారంభించినట్లు మా దృష్టికి వచ్చింది' అని ప్రధాన

- మిగతా 5 లో

తొలి రోజు రూ.1.88 లక్షల కోట్ల ఒప్పందాలు

విశాలాంధ్ర-హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో తొలి రోజు సోమవారం భారీగా ఎంవోయూలు కుదిరాయి. డీప్ టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ, ఏరోస్పేస్ తదితర రంగాల్లో వివిధ కంపెనీలతో రూ.1.88 లక్షల కోట్ల మేర ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుంది. డీప్ టెక్నాలజీ రంగంలో రూ.75 వేల కోట్లు, గ్రీన్ ఎనర్జీ రూ.27 వేల కోట్లు, పునరుత్పాదక రూ.39,700 కోట్లు, ఏరోస్పేస్, డిఫెన్స్‌లో రూ.19,350 కోట్లు, ఏవియేషన్ రంగంలో జీఎంఆర్ గ్రూప్‌తో

మిగతా 5 లో

రూ.6.15 లక్షల కోట్ల రుణమాఫీ: కేంద్రం

న్యూఢిల్లీ: గత ఐదున్నరేళ్లలో ప్రభుత్వరంగ బ్యాంకులు రూ.6.15 లక్షల కోట్ల రుణాలు మాఫీ చేసినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. 2022-23 నుంచి ప్రభుత్వరంగ బ్యాంకుల్లోకి ప్రభుత్వం ఎలాంటి మూలధనాన్ని చొప్పించ లేదని లోక్‌సభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. ఆయా బ్యాంకుల ఆర్థిక పనితీరు గణనీయంగా మెరుగుపడినట్లు చెప్పుకొచ్చారు. మూలధన అవసరాల కోసం పీఎస్‌బీలు మార్కెట్ వర్గాలు, అంతర్గత సమీకరణలపై ఆధారపడుతున్నాయని మంత్రి తెలిపారు. 2022 ఏప్రిల్ 1 నుంచి

- మిగతా 5 లో

ఇదీ లోకం!

2047కి నెట్ జీరో లక్ష్యం

'విజన్' తెలంగాణ ప్రజల పత్రం
క్యూర్, ప్యూర్, రేర్ ... సమగ్ర అభివృద్ధి: భట్టి

విశాలాంధ్ర- హైదరాబాద్: తెలంగాణ విజన్ డాక్యుమెంట్ మూసివేసిన గదుల్లో రాసిన పత్రం కాదు, ప్రముఖుల సలహాలు, నిపుణుల చర్చలు, పౌరుల అభిప్రాయాలతో కూడిన ప్రజాస్వామ్య ప్రక్రియ. అందుకే ఇది ప్రభుత్వపు పత్రం మాత్రమే కాదు, ఇది తెలంగాణ ప్రజల పత్రం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. 2047 నాటికి నెట్ జీరో సాధించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఆర్థికాభివృద్ధి, పర్యావరణం పరస్పర సహకారాలు అని పేర్కొన్నారు. తెలంగాణకు ఆశయాల కొరత లేదనీ, కానీ ఎంతో కాలంగా ప్రజల శక్తిని, వారి ఆశలను, సామర్థ్యాన్ని ఒకే దారిలో నడిపించే సమగ్ర దృష్టి మాత్రమే కొరవడిందని అన్నారు. 2047 వరకూ ఉన్న దీర్ఘకాల లక్ష్యంతో నిర్మించిన విజన్ ఇది అన్నారు. మా విజన్ మూడు ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థ . ఇది కేవలం నినాదం కాదు, అన్ని రంగాలవారీగా, జిల్లాలవారీగా రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక అని వివరించారు. స్పేషియల్ ప్లానింగ్‌కు కొత్త వ్యాకరణం క్యూర్, ప్యూర్, రేర్... సమగ్ర అభివృద్ధిపై అచంచల కట్టుబాటు. సస్టైనబిలిటీనీ ఆవిష్కరణాత్మకంగా సహకారం చేయడం అన్నారు. మూడు ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థ ఇది సంఖ్య కాదు,ఇది తెలంగాణ వాస్తవాన్ని మార్చే శక్తి

మిగతా 5 లో

'తెలంగాణ రైజింగ్' దార్శనికతకు బీజం

- పెట్టుబడులకు అవకాశాలు అపారం
- చైనాలోని గ్వాంగ్‌డాంగ్ నమూనా అమలు
- రాష్ట్ర భవిష్యత్‌కు రోడ్ మ్యాప్
- అందరి మద్దతుతో లక్ష్యాన్ని సాధిస్తాం
- 2047 నాటికి దేశ జీడీపీలో 10 శాతం వాటా అందిస్తాం
- గ్లోబల్ సమ్మిట్‌లో సీఎం రేవంత్



విశాలాంధ్ర - హైదరాబాద్ : నాడు దేశ స్వాతంత్ర్యం అనంతరం మన నాయకులు కొత్త రాజ్యాంగాన్ని రూపొందించి భవిష్యత్తు కోసం రోడ్ మ్యాప్ వేశారని, నేడు మేం కూడా తెలంగాణ భవిష్యత్తు కోసం రోడ్ మ్యాప్ రూపొందించాలనుకున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఇందుకు మహాత్మా గాంధీ, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ నుంచి ఎంతో స్ఫూర్తి పొందామని పేర్కొన్నారు. తొలుత గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ భారత్ ఫ్యూచర్ సిటీలో 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ 2025'ను ప్రారంభించారు. అనంతరం సభలో రేవంత్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు దశాబ్దాలుగా ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడారని చెప్పారు. 2014లో సోనియా గాంధీ, ఆనాటి ప్రధాని మన్మోహన్ సింగ్ నాయకత్వంలో తెలంగాణ ఏర్పాటు కల సాకారమైందని గుర్తు చేశారు. దేశంలోనే యువ రాష్ట్రంగా తెలంగాణ అవతరించిందన్నారు. రాబోయే పదేళ్లలో తెలంగాణను దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా, ప్రపంచంలోనే ఉన్నత రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్-2047 దార్శనికతకు బీజం పడిందని చెప్పారు. అధికారులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్, నీతి ఆయోగ్ నిపుణుల సహాయం తీసుకున్నామన్నారు. గ్లోబల్ సమ్మిట్‌కు అన్ని రంగాల ప్రతినిధులు రావడం మన అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. వ్యాపార వేత్తలు, కార్పొరేట్ దిగ్గజాలు, విధాన నిర్ణేతలు, దౌత్యవేత్తలు, ప్రభుత్వ అధికారులు, నిపుణుల సూచనలు, సలహాలు, అభిప్రాయాలను స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. తెలంగాణలో అపారమైన అవకాశాలు... సానుకూల వాతావరణం ఉందన్నారు. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని సంకల్పించామని పేర్కొన్నారు. దేశ జీడీపీలో తెలంగాణ నుంచి దాదాపు ఐదు శాతం వాటాను అందిస్తున్నట్లు వెల్లడించారు. 2047 నాటికి భారతదేశ జీడీపీ 10శాతం వాటాను అందించాలని తాము లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. సేవారంగం, తయారీ... వ్యవసాయ రంగం... ఇలా తెలంగాణను స్పష్టమైన మూడు భాగాలుగా విభజించామని చెప్పారు. ఇందుకోసం క్యూర్, ప్యూర్, రేర్ మోడల్స్ నిర్దేశించామని, కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ, పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ, రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీ అని వివరించారు. చైనాలోని గ్వాంగ్‌డాంగ్ ప్రావిన్స్ సాధించిన అభివృద్ధిని స్ఫూర్తిగా తీసుకున్నామన్నారు. గ్వాంగ్‌డాంగ్ ఆర్థిక వ్యవస్థ చైనాలోని అన్ని ప్రావిన్స్‌ల కంటే అతిపెద్దదన్నారు. 20 సంవత్సరాల్లో వారు ప్రపంచంలోనే అత్యధిక పెట్టుబడులను, వృద్ధి రేటును సాధించారని, తెలంగాణలో కూడా మేము అదే నమూనాను అనుసరించాలని భావిస్తున్నామన్నారు. చైనా, జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా, సింగపూర్ దేశాల నుంచి

మిగతా 5 లో

'గ్లోబల్ సమ్మిట్'లో ఫిల్మ్ ఇన్ తెలంగాణ

- ఇండస్ట్రీ ప్యానల్ ప్రారంభం
- అగ్రశ్రేణి సినిమా కేంద్రంగా...
- సృజనాత్మక ఆర్థిక బలోపేతం దిశగా...

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో అత్యంత ప్రాముఖ్యమైన సాంస్కృతిక, ఆర్థిక కార్యక్రమాల్లో ఒకటైన 'ఫిల్మ్ ఇన్ తెలంగాణ' ప్రదర్శన... ఇండస్ట్రీ ప్యానెల్‌ను తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో ప్రదర్శించనున్నారు. భారతదేశం సృజనాత్మక ఆర్థిక రంగంలో తెలంగాణను ముందంజలో నిలిపే దృక్కోణంతో రూపుదిద్దిన ఈ ప్రదర్శన, 'ఒక దేశం, అనేక సినిమాలు' కార్యక్రమానికి సంబంధించి దేశంలోని అత్యంత ప్రభావశీలమైన వాణీలు, తెలంగాణ మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలోని ప్యానెల్‌ను ఒకటి చేస్తుంది. భారతీయ సినిమా పరిశ్రమ భవిష్యత్తును మళ్లీ ఊహించే రాష్ట్రపు లక్ష్యాన్ని ఇది ప్రతిబింబిస్తుంది. రాష్ట్రం 'ఫిల్మ్ ఇన్ తెలంగాణ' విప్లవాత్మక కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తున్న తరుణంలో, తెలంగాణ తక్కువ సమయంలోనే భారతదేశంలో అత్యంత సినిమాటోగ్రాఫర్-హితమైన, భవిష్యత్తుకు సన్నద్ధమైన సృజనాత్మక కేంద్రంగా రూపొందింది. ప్రగతిశీల విధానాలు, ప్రపంచ స్థాయి మౌలిక సౌకర్యాలు, సులభతరమైన వ్యవస్థలు... 'తెలంగాణ రైజింగ్ 2047' లక్ష్యంతో సమన్వయించిన దీర్ఘకాలిక సాంస్కృతిక దృక్కోణం దీన్ని నడిపిస్తోంది. రేవంత్ రెడ్డి మాట్లాడుతూ 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ద్వారా ప్రపంచానికి మన రాష్ట్రానికి ఆహ్వానం పలుకుతున్నామన్నారు.. ఇది ధైర్యవంతమైన, భవిష్యత్తుకు సన్నద్ధమైన, ఆవిష్కరణ, సమావేశ వృద్ధితో నడిచే రాష్ట్రమని చూపించేదని పేర్కొన్నారు. గ్లోబల్ పెట్టుబడిదారులు, సృజనాత్మక కళాకారులు కొత్త తెలంగాణలోని అవకాశాలు, ఆశయాలు, సృజనాత్మక ఆత్మవిశ్వాసాన్ని తెలుసుకోవాలని ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. 'ఫిల్మ్ ఇన్ తెలంగాణ' ప్రదర్శన... ఇండస్ట్రీ ప్యానెల్ ద్వారా 'ఒక దేశం, అనేక సినిమాలు' దృక్కోణంలో దేశంలోని ప్రముఖ సినిమా ప్రతిభలను ఒకే వేదికపైకి తెస్తున్నామన్నారు. తెలంగాణ సినిమా నిర్మాతలకు భారతదేశంలో అత్యంత బలమైన మౌలిక సౌకర్యాలు, పారదర్శక విధానాలు, ప్రతిభను వెలికి తేవడంలో సహాయపడే వ్యవస్థలను అందించడానికి కట్టుబడి ఉందన్నారు. తెలంగాణను కొత్త జాతీయ హబ్ గా మార్చి 'భారత సినిమా వ్యవస్థను మళ్లీ ఊహించడం' అనే హై-లెవల్ మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ ఇండస్ట్రీ ప్యానెల్ నిలిచిందన్నారు. భారతదేశంలో సినిమా పరిశ్రమల నుంచి అర్జున్ కపూర్, జెనీలియా దేశ్‌ముఖ్, రితీశ్ దేశ్‌ముఖ్, అనిరుద్ధ రాయ్ చౌధురీ, రాకేష్ ఓంప్రకాష్ మెహ్రా, జోయా అక్తార్, పార్థివ్ గోహిల్, అసిఫ్ అలీ, సుకుమార్ సహా ప్రముఖ కళాకారులు, నిర్మాతలు, దర్శకులు, ఓటిటి నాయకులు పాల్గొంటున్నారు. మంగళవారం తెలంగాణను ప్రధాన సినిమా నిర్మాణ కేంద్రంగా నిలిపే దిశలో మార్గదర్శకంగా నిలవడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ చర్చ భారతదేశం బహు-పరిశ్రమల సినిమా రంగాన్ని ప్రతిబింబిస్తూ, వివిధ ప్రాంతాలు చిత్రీకరణ స్థలాలు, బడ్జెట్లు, విదేశీ

- మిగతా 5 లో

తేలిగ్గా తీసుకోవడం లేదు

ఇండిగో సంక్షోభంపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

న్యూఢిల్లీ: 'ఇండిగో సంక్షోభం' నేపథ్యంలో పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు సోమవారం రాజ్యసభలో ఓ ప్రకటన చేశారు. విమానయాన సిబ్బంది పని గంటలపై పరిమితులకు సంబంధించిన నిబంధనలను ఇండిగో సరిగా అమలుచేయకపోవడమే సర్వీసుల రద్దుకు దారితీసిందని ఆయన వెల్లడించారు. ఏవియేషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ సాఫ్ట్‌వేర్(ఏఎంఎస్ఎస్) ఈ అంతరాయాలకు కారణం కాదని తెలిపారు. 'ఇండిగో నిర్వహణ వైఫల్యమే ప్రస్తుత పరిస్థితులకు దారితీసింది. సిబ్బందికి సంబంధించిన రోస్టరింగ్ విధానాన్ని సరిగా అమలుచేయలేదు. ఈ వైఫల్యానికి ఏఎంఎస్ఎస్ సిస్టమ్ కారణం కాదు. డిసెంబరు ఒకటిన రోస్టరింగ్ నిబంధనలకు సంబంధించి ఇండిగోతో సమావేశం నిర్వహించాం. ఆ సంస్థ ప్రతినిధులు లేవనెత్తిన సందేహాలపై మేం స్పష్టత ఇచ్చాం. అప్పుడు వారు ఎలాంటి సమస్యలను ప్రస్తావించలేదు. ఇక సమస్యను పరిష్కరించేందుకు ఎయిర్‌లైన్‌తో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాం. కొన్ని రోజులుగా ప్రయాణికులు ఎదుర్కొంటున్న తీవ్ర అంతరాయానికి చింతిస్తున్నాను. ఈ సమస్యను మేం తేలిగ్గా తీసుకోలేదు. ఇప్పటికే దర్యాప్తునకు ఆదేశించాం. భవిష్యత్తులో ఇతర ఎయిర్‌లైన్స్ నుంచి ఇలాంటివి పునరావృతం కాకుండా మా చర్యలు ఉండనున్నాయి. భారతదేశంలో కొత్త విమానయాన సంస్థ ప్రారంభం కావడానికి ఇదే మంచి తరుణం. పోటీ సంస్థలు ఏర్పాటయ్యేలా చర్చలు జరపనున్నాం' అని మంత్రి రామ్మోహన్ నాయుడు చెప్పారు. పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కాగానే ఇండిగో సంక్షోభంపై చర్చ జరపాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. దీనిపై మంత్రి స్పందించారు. ఇదిలాఉంటే... ఇండిగో వ్యవహారంపై కేంద్రం ఇప్పటికే ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించింది. కొద్దిరోజులుగా సేవల్లో అంతరాయానికి గల కారణాలను విచారించనుంది. బాధ్యులను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. మొత్తం నలుగురు సభ్యులతో కూడిన

మిగతా 5 లో

సంపాదకీయం

వందేమాతరం వివాదం లోగుట్టు

బంకిం చంద్ర చటర్జీ వందేమాతరం గీతం రాసి 150 ఏళ్లయిన సందర్భంగా ఉత్సవం చేసుకుందామని ప్రతిపాదించిన మోదీ చివరకు దాన్ని పెద్ద వివాదంగా మార్చేశారు. ఓట్ చోరీ గురించి పార్లమెంటులో చర్చిద్దామని ప్రతిపక్షాలు కోరితే వందేమాతరంపై చర్చించాలని మోదీ పట్టుబట్టారు. ఆ తరవాత కావాలంటే ఎన్నికల సంస్కరణల మీద మాట్లాడదామన్నారు. అంటే ఓట్ చోరీని ప్రధానాంశంగా కాకుండా మొత్తం ఎన్నికల సంస్కరణలపై మాట్లాదామనడంలోనే పెద్ద మతలబు ఉంది.

పార్లమెంటులో వందేమాతరంపై పది గంటల చర్చ జరుగుతుందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ చర్చ జరిగిన తీరు చూస్తే వందేమాతరంపై చర్చ జరుగుతున్నది. వందేమాతరం 150 ఏళ్ల ఉత్సవంపై కాదని ఆ మిషతో మత రీత్యా జనాన్ని విభజించడానికి మోదీ పన్నిన కుట్ర అని అర్థం అవుతోంది. బంకించంద్ర ఈ గేయాన్ని 1875 లో రాశారు. 1896 లో రవీంద్రనాథ్ టాగోర్ ఈ గేయాన్ని కాంగ్రెస్ మహాసభలో చదివారు. చివరకు 1937 లో ఈ గేయాన్ని అధికారికంగా ఉద్యమ గీతంగా అంగీకరించారు. అప్పుడే వందేమాతరం గేయంలోంచి దుర్గామాత వర్ణన ఉన్న భాగాలను తొలగించి పాడుకోవడం మొదలైంది. ఆ పంక్తులు తొలగించింది కూడా రవీంద్రుడే. 1950 లో రాజ్యాంగ నిర్ణాయక సభ దీనికి జాతీయ గేయం స్థాయి కల్పించింది. ఈ సంఘటనలన్నీ జరిగి ఇన్నేళ్లయి పోయిన తరవాత ఈ గేయం మీద చర్చలెందుకు? వివాదాలెందుకు? ఏమైతేనేం పార్లమెంటులో గంట సేపు వందేమాతరంపై ప్రసంగించిన మోదీ జవహర్ లాల్ నెహ్రూను, మహమ్మద్ అలీ జిన్నాను ఒకే గాటన కట్టడానికి తీవ్ర ప్రయత్నం చేశారు. మోదీ వాదనను ఎంత మంది అంగీకరిస్తారో చెప్పలేక పోయినా ఈ వివాదం మాత్రం జనం మెదళ్లను తొలిచేస్తూనే ఉంటుంది. మోదీకి కావాల్సింది సరిగ్గా ఇదే. స్థూలంగా చూస్తే హిందూ–ముస్లిం రాజకీయాలను మరింత బలోపేతం చేసే ప్రయత్నం స్పష్టంగా కనిపిస్తోంది. బంకించంద్ర చటర్జీ బెంగాల్‌కు చెందిన వాడు. బెంగాల్‌లో త్వరలో శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి. ఏ చిన్న అవకాశం దొరికినా దాన్ని రాజకీయ ప్రయోజనాలకు, ముఖ్యంగా ఎన్నికల్లో విజయం సాధించడానికి ఏమైనా చేయడం మోదీకి అలవాటే. బెంగాల్ ఎన్నికలు ముగిసే దాకా ఈ వివాదం ప్రతిధ్వనులు వినిపిస్తూనే ఉంటాయి. ప్రతి దానికీ నెహ్రూను బాధ్యుడిని చేయడం మోదీకి అలవాటై పోయింది. అంత మాత్రం చేత నెహ్రూ కీర్తికి వచ్చిన నష్టమేమీ లేదు. మోదీ వాదనతో సమ్మతించే వారు సంఘ్ పరివార్‌లో తప్ప ప్రపంచంలో ఎక్కడా కాగడా వేసి వెతికినా ఎవరూ కనిపించరు. ప్రపంచమంతటా నెహ్రూ మీద చర్చ జరుగుతుంది తప్ప గోల్వాల్కర్ మీదో, హెగ్డేవార్ మీదో, సావర్కర్ మీదో జరగదు. స్వాతంత్ర్యం రావడానికి కనీసం పదేళ్ల ముందు నుంచే ప్రపంచమతటా ప్రఖ్యాతి ఉన్న నాయకుడు పండిత్ నెహ్రూ. స్వాతంత్ర్య పోరాటంతో వీసమెత్తు కూడా సంబంధం లేని సంఘ్ పరివార్ కుదురు నుంచి వచ్చిన నరేంద్ర మోదీ మాత్రం నెహ్రూ వ్యక్తిత్వానికి మసి పూయడానికి ఎంత గింజుకున్నా ఫలితం కనిపించడం లేదు. అయినా పట్టు వదలని విక్రమార్కుడిలా నెహ్రూను అపఖ్యాతి పాలు చేయడానికి ప్రయత్నిస్తూనే ఉన్నారు. నెహ్రూను కురచన చేయడానికి నానా తంటాలు పడ్తున్నారు. చర్చ జరగవలసింది వందేమాతరంపై అయితే మోదీ మొత్తం దృష్టి నెహ్రూకు తాటాకులు కట్టడం మీదే ఉంది. 1937 లో వందే మాతరం గేయంలో కొన్ని చరణాలు తొలగించారని నిరూపించే బదులు అప్పుడు కాంగ్రెస్ ముస్లిం లీగ్ ముందు తలవంచిందని రుజువు చేయడానికి ఎంతో శ్రమ పడాల్సి వచ్చింది. అంటే ఇది హిందూ–ముస్లిం రాజకీయాలను మరో అడుగు ముందుకు నడిపించడమే. వందేమాతరం గేయంలో కొన్ని చరణాలో, పంక్తులో తొలగించడం వల్లే దేశ విభజనకు బీజాలు పడ్డాయని మోదీ ఇటీవల నిరంతరం దుష్ప్రచారం చేస్తున్నారు. వందేమాతరం వివాదం రేకెత్తించడమే మోదీ లక్ష్యం అయినప్పటికీ సోమవారం నాడు పార్లమెంటులో ప్రసంగిస్తూ మమతా బెనర్జీ ప్రస్తావన తీసుకు రాలేదు. తృణమూల్ కాంగ్రెస్‌ను ప్రస్తావించలేదు. వందేమాతరంపై ప్రసంగించడానికి తయారు కావడంలో మోదీ ఏ లోటూ చేయలేదు. కానీ బంకిం చంద్ర చటర్జీని బంకిం దా అనడం బెంగాలీ ఎంపీలకు చాలా అభ్యంతరకరమైంది. బంకిం బాబు అనాలని వారు గుర్తు చేశారు. బెంగాల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మోదీ వివాదాలు రేకెత్తించడం వెనక బలమైన కారణమే ఉంది. బెంగాల్‌లో 27 శాతం మంది ముస్లింలు ఉన్నారు. వీరు మమతా బెనర్జీకి మద్దతు ఇస్తున్నారు. వీరిని మమతా బెనర్జీకి దూరం చేయడం మోదీ అసలు ఉద్దేశం. వందేమాతరం గేయంలో కొన్ని చరణాలు తొలగించడం బెంగాల్ ఆత్మ గౌరవానికి భంగం కలిగించడమేనని మోదీ చెప్పదలచుకున్నారు. కాంగ్రెస్ ముస్లింలను సంతృప్తి పరచడానికి ప్రయత్నిస్తున్నదని మోదీ ఎప్పుడూ ఆరోపిస్తున్నారు. వందేమాతరం నుంచి కొన్ని చరణాలను తొలిగిస్తే మమతా బెనర్జీ నోరు తెరవకపోవడం కూడా ముస్లింలను సంతృప్తి పరచడంలో భాగమేనని మోదీ చెప్పదలచుకున్న అసలు విషయం. ఈ వాదనకు వందేమాతరం మీద కన్నా హిందూ–ముస్లిం రాజకీయాల మీదే మోదీకి దృష్టి ఎక్కువ అని చెప్పక్కర్లేదు.

బంకిం చంద్ర చటర్జీ రాసిన వందేమాతరం స్వాతంత్ర్య పోరాట సమయంలో, బెంగాలు విభజనను వ్యతిరేకించడంలో ప్రజలకు స్ఫూర్తి కలిగించింది. ఆ సందర్భంలో వందే మాతరం దేశమంతటా మార్మోగేది. ముస్లింలను సంతృప్తి పరుస్తున్నారని ప్రచారం చేసి మమతా బెనర్జీని సైతం ఇరుకున పెట్టాలన్నది మోదీ అసలు లక్ష్యం. బెంగాల్‌లో అధికారం సంపాదించడానికి బీజేపీ చేస్తున్న ప్రయత్నాలలో వందేమాతరం ఒక అంశం మాత్రమే. దీనితో పాటు సమగ్ర, సునిశిత ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్.) కూడా ఉంది. ఎస్ఐఆర్ సందర్భంలో చొరబాటుదార్ల అంశాన్ని రేకిత్తించడానికి మోదీ చేసిన ప్రయత్నాలు అంతగా ఫలించలేదు. వక్ఫ్ చట్టం ఆధారంగా ముస్లింలలో మమత మీద వ్యతిరేకత పెంచడం మోదీ లక్ష్యాలలో మరొకటి. వక్ఫ్ చట్టాన్ని బెంగాల్‌లో అమలు చేయనివ్వబోమని మమత ఇదివరకే ప్రకటించారు. కానీ ఇప్పుడు ఆమె మాట మార్చారు. బెంగాల్‌లోని ముర్షీదాబాద్‌లో బాబ్రీ మసీదు నిర్మాణం కోసం రెండు రోజుల కింద తృణమూల్ శాసనసభ్యుడు ఒకరు శంకుస్థాపన చేశారు. మమతా బెనర్జీ దీనిని వ్యతిరేకించకపోవడాన్ని గమనించాలి. ఆ పని చేసిన నాయకుడిని మమత పార్టీ నుంచి సస్పెండ్ చేసి ఉండొచ్చు. అయినా ఆమె దగ్గర నుంచి పెద్ద అభ్యంతరం ఏదీ వ్యక్తం కాలేదు. సంఘ్ పరివార్‌కు సరిగ్గా కావాల్సింది ఇలాంటి పరిణామాలే. వందేమాతరం మిషతో దేశ విభజన అంశాన్ని మరోసారి రేకెత్తించే ప్రయత్నం జరుగుతోంది. బెంగాల్ ఎన్నికల కార్యక్రమం ప్రకటించిన తరవాత వందేమాతరం వివాదాన్ని మోదీ మరింతగా రెచ్చగొట్టడం ఖాయం.

బంతీ! బహుమతీ!

చింతపట్ల సుదర్శన్

రంగస్థలం

దూరం నుంచి ఏదో ఒక వస్తువు విసురుగా వచ్చి గోడకు ఢామ్మని తగిలి తన పక్కన పడిపోవడంతో, ఉలిక్కిపడి లేచి తోక తిప్పుతూ తోక చుట్టూ తనూ తిరగసాగింది డాగీ. ఈ 'ఢాం' చప్పుడుకు డాంకీ కూడా ఉలిక్కిపడి గాజుకళ్లు వెడల్పు చేసి ఆ వస్తువు వైపు చూసింది. అది గుండ్రంగా ఉంది. మట్టిరంగో, ఎరుపు రంగో, అతుకుల బొంతో అర్థం కాలేదు డాంకీకి. ఏమిటి బ్రో ఆ గుండ్రటి ఢాం? అనడిగింది. రెన్నిమిషాలు దానికేసి పరీక్షగా చూసి ఇదా! ఇదొక బంతి అనుకుంటా. పార్కులో జాతి కుక్కలు బంతి విసిరేసి పట్టుకు రమ్మన్నప్పుడు, పరుగెత్తుకు వెళ్లి నోటితో పట్టుకు వచ్చి యజమానికి అందించి, ఆనందపడుతుంటాయి అదే అనుకుంటా. కాకపోతే...అని ఆగిపోయింది డాగీ. కాకపోతే అని 'డౌటు ఫేసు' పెట్టావెందుకోయ్ అంది డాంకీ. మరేం లేదు నేను చూసిన బంతి జాతి కుక్క నోటితో పట్టుకునే చిన్న బంతి కానీ ఇది నా నోట్లోనూ, నీ నోట్లోనూ పట్టేట్టు లేదు చాలా పెద్దది. అసలిది ఎక్కడ్నించి వచ్చి మన పాత గోడ గుండె దడదడలాడించింది అంటూ మైదానం వైపు చూసింది. అక్కడ ఓ స్కూల్ కుర్రాళ్ల గుంపు నిలబడి ఉంది. అంతా ఇటువైపే చూస్తున్నారు. బహుశా తన పక్కన పడ్డ ఈ జెయింటు బంతి కోసమేనేమో అనుకున్న డాగీ, వాళ్లదేమో ఈ బంతి. అరుగు మీద కాలభైరవుడిలా నేనున్నానని రావడానికి భయపడి అలా నిలబడ్డారన్న మాట అంది డాగీ. అప్పుడు గుర్తుకు వచ్చింది డాంకీకి. స్కూల్ గేటు పక్కనించి పోతూపోతూ గమనించింది చాలాసార్లు. కుర్రాళ్లు పరుగెడుతూ ఈ బంతిని కాళ్లతో అటూఇటూ తన్నేస్తుంటారు. డాగీ దీన్ని బంతి అనరు, 'ఫుట్‌బాల్' అంటారు. ఇది నోటితో పట్టుకునే బంతికాదు ఎడాపెడా కాలితో బాదే బంతి, అనగా తన్నే బంతి అంది డాంకీ. అవునా దేన్నయినా తన్నడ మంటే మనుషులకు ఇష్టం అనుకుంటా. నేనూ తన్నగలను అంటూ బంతిని కాలితో తన్నింది డాగీ. అది దడదడ దొర్లుతూ అరుగు చివరకు వెళ్లింది. కాసేపయితే అరుగు మీది నుంచి జారిపోయి, దూరంగా నిలబడ్డకుర్రాళ్లకు అంది ఉండేదికానీ డాగీ వేగంగావెళ్లి దానికి అడ్డంగా నిలబడి మళ్లీ ఇటు తన్నింది. అది గోడకి తాకి వెనక్కి వస్తుంటే మళ్లీ అటు తన్నింది. అది వెనక్కి దొర్లడం, డాగీ దాన్ని ముందుకు తన్నడం కాసేపు సాగింది. డాంకీ, డాగీ ఆట చూస్తూ ఉండిపోయింది.

ఎక్కడ్నించో ఊడిపడ్డాడు అబ్బాయి. అబ్బాయిని చూసి ఆట ఆపేసింది డాగీ. డాగీ వైపూ బంతి వైపూ చూస్తూ ఏంటి డాగీ ఫుట్‌బాల్ ప్రాక్టీసు ఎప్పట్నించి అన్నాడబ్బాయి నవ్వుతూ. దీన్ని ఫుట్‌బాల్ అంటారని ఇప్పుడే డాంకీ చెబితే విన్నా, దీన్ని ఎటుపడితే అటు ఇష్టం వచ్చినట్టు తన్నడం ఓ ఆట అని తెల్సుకున్నా అందుకే తంతున్నా అంది డాగీ. ఇది మామూలు ఆట కాదు డాగీ క్రికెట్టు ఆట కన్నా ఎక్కువ దేశాలు ఆడే ఆట. ముఖ్యంగా అగ్ర రాజ్యంలో ఇది ఎంత 'పాప్యులరో' తెలుసా? అన్నాడు అబ్బాయి. అలాగా అయితే ఇంకేం నాకూ బాగా తన్నడం వచ్చు అంది డాగీ. ఇకనేం ఛాంపియన్ అయిపోతావన్న మాట అంది డాంకీ. ఆటలాడ్డం మనుషులకి వచ్చినట్టు మనకు రాదులే డాంకీ. రాజకీయాలనే ఆట తెల్సిన వాళ్లకివి రోజులు, కానీ నీకూ నాకూనా అంది డాగీ. అవును డాగీ నువ్వన్నది నిజం. మన నాయకులకు ప్రజలూ, ఓటర్లూ ఫుట్‌బాల్ లాంటి వాళ్లే. బుగ్గ కార్లల్లో తిరుగుతూ జనాన్ని తన్నుతూ ఎంజాయ్ చేస్తుంటారు. ఇచ్చిన హామీలు దొబ్బేసినా, గోడకు కొట్టిన బంతుల్లా జనం మళ్లీమళ్లీ వాళ్ల కాళ్ల దగ్గరికే పోతారు తన్నిచ్చుకోడానికి అంది డాంకీ.

తన్నడానికి ఫుట్‌బాల్ అక్కర్లేదు వాళ్లకు. ఎన్నో రకాలుగా తన్నగలుగుతారు. పన్నులతో తంతారు, ధరలతో తంతారు, అబద్ధాలతో తంతారు, కుట్రలతో, మోసాలతో, మాయ మాటలతో తంతారు. మళ్లీ మళ్లీ తన్నడానికి ఎన్నికల్లో నిలబడతారు అన్నాడు అబ్బాయి. నువ్వన్నది నిజమే కాని 'బ్రో' వాళ్లని ప్రజలూ, ఓటర్లూ తల్చుకుంటే వేలు మీద చుక్క ఇంకు పెట్టుకునే సమయంలో తన్ని తగలెయ్యలేరా? అంది డాంకీ. భేషుగ్గా తన్నగలరు. అలా తన్నబట్టే కదా ప్రభుత్వాలు మారేది. వారు వీరయ్యేది వీరు వారయ్యేది అన్నాడు అబ్బాయి. పాపం స్కూల్ కుర్రాళ్లు బిక్క మొఖాలతో ఇటే చూస్తున్నారు బంతి కోసం. ఇచ్చేద్దామా? అంది డాంకీ. అదెలా! నేనూ తన్నులాట నేర్చుకుంటా సరదాగా ఉంది అంది డాగీ. నేర్చుకుని ఏం చేస్తావోయ్ నువ్వేమయినా 'ఫిఫా' వారి శాంతి బహుమతి కొట్టేస్తావా? అన్నాడబ్బాయి నవ్వుతూ. శాంతి బహుమతా? అని ముఖంలో క్వశ్చన్ మార్కు పెట్టింది డాగీ. అవును డాగీ నోబెల్ బహుమతి మీద కన్నేసిన ఓ అగ్ర నాయకుడు, సుంకాలతోనూ, హెచ్చరికలతోనూ, బెదిరింపులతోనూ, మధ్యవర్తిత్వం తోనూ గుండ్రటి గ్లోబ్ మీద దేశాల్ని బంతుల్ని చేసి ఇటు తన్నీ అటు తన్నీ భయభ్రాంతుల్ని చేయడంలో ఛాంపియన్ అయినాడని శాంతి బహుమతి అందించారు. 'గుడ్డి కాకపోతే మెల్ల' అని అనుకున్నది కాకపోయినా, శాంతి బహుమతి ఓటి అందిందని కొబ్బరికాయ దొరికిన కోతిలా, చెట్టు దిగి ఎవరినీ తన్నడానికి రాదని ఇచ్చి ఉంటారు అన్నాడబ్బాయి.

అందరినీ హింసించి, చావగొట్టి అందుకునేబహుమతి నాకేం వద్దు, అంటూ ఫుట్‌బాల్‌ని కుర్రాళ్లున్న వైపు కాలితో లాగిపెట్టి తన్నింది డాగీ.

ఇరాక్ తరహాలో వెనిజులాపై దాడికి ట్రంప్ ఎత్తులు

అశోక్ నీలకంఠన్ అయ్యర్స్

వెనిజులా విమానయాన ఆవరణ ను 'పూర్తిగా మూసివేసినట్లు' అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నవంబరు 29న ప్రకటించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా కార్యకలాపాలకు వ్యతిరేకంగా పోరాటం అనే పేరుతో ఆయన ఆ దేశ భూ-తలంపై సైనిక దాడులకు అవకాశాలు ఉన్నట్లు బెదిరించారు.

గత మూడు నెలల్లో మాదకద్రవ్యాలను తీసుకువెళుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓడలపై అమెరికా దళాలు దాదాపు రెండు డజన్ల ప్రాణాంతక దాడులు నిర్వహించాయి. ఫలితంగా దాదాపు 82 మంది మరణించారు. నావికా దళంలో అత్యంత అధునాతన విమాన వాహక నౌక అయిన యుఎస్ గెరాల్డ్ ఆర్.ఫోర్డ్ ప్రస్తుతం కరేబియన్ జలాల్లో గస్తీ తిరుగుతోంది. కోస్ట్ గెరాల్డ్ డ్రోన్లు 1 బిలియన్ డాలర్లకు పైగా మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నాయి. శ్వేతభవనం నుంచి వెలువడిన వాచాలత్వం వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో పట్ల క్రమంగా మరింత యుద్ధోన్మాదంగా మారింది. మాదకద్రవ్యాల నిరోధక చర్యగా మొదలైన వ్యవహారం పెరుగుతున్న ముప్పునకు అవసరమైన ప్రతిస్పందనగా మారిందని పరిపాలన అధికారులు నొక్కి చెబుతున్నారు. కానీ ప్రస్తుత, మాజీ అధికారులు పరిశీలించిన నిఘా అంచనాలు, అమెరికా సైనికఆస్తుల విస్తరణ విధానాలు, వ్యూహాత్మక స్థానాలతో పాటు, మరింత సంక్లిష్టమైన లక్ష్యాన్ని సూచిస్తున్నాయి. అవి మదురో ప్రభుత్వాన్ని అస్థిరపరచడం, చివరకు వెనిజులాలోని అపారమైన చమురు సంపదను చేజిక్కించుకోవటం. రెండు దశాబ్దాల క్రితం ఇరాక్ యుద్ధానికి ముందు అమలైన వ్యూహంతో ప్రస్తుత ఘటనలకు ఇబ్బందికర పోలిక ఉంది. - అమెరికా అత్యంత వినాశకరమైన విదేశాంగ విధాన తప్పిదాలలో ఒకటి పునరావృతం అవుతున్నట్లు లాటిన్ అమెరికన్ దౌత్యవేత్తలు, ఐక్యరాజ్యసమితి అధికారులు లేదా కాంగ్రెస్ సభ్యులు సమాంతర పరిణామాల పట్ల ఎక్కువగా ఆందోళన చెందుతున్నారు.

సైనిక విస్తరణ వేగంగా, గణనీయంగా సాగుతోంది. ప్రధానంగా తీరజలాల్లో నిశ్శబ్దంగా మానవతా కార్యకలాపాలపై దృష్టి సారించేదిగా చాలా కాలంగా పరిగణిస్తున్న యుఎస్ సదరన్ కమాండ్ ఆగస్టు మాసం నుంచి యుద్ధ కార్యకలాపాలకు ప్రధాన కేంద్రంగా మారింది. ఇది పెంటగాన్ అధికారులు చెబుతున్నట్లుగా- దశాబ్దాలలో అత్యంత ముఖ్యమైన అర్ధగోళ సైనికచర్యగా రూపాంతరం చెందింది. స్వయంప్రతిపత్తి వ్యవస్థల కోసం 350 మిలియన్ల డాలర్‌లను వెచ్చించడం ద్వారా బలోపేతం చేసిన ఈ తీర రక్షక నావ వందలాది వైమానిక, సముద్రగర్భ డ్రోన్లను మోహరించింది. మళ్లీ ఇంధనం నింపకుండా 1,150 మైళ్లు ప్రయాణించ గలవి విమానం - ఫ్లీట్ భారీగా మాదకద్రవ్య స్వాధీనానికి దారితీసిన నౌకలను ట్రాక్ చేయడంలో ఘనత పొందింది. వీటిలో నవంబరు నెల ప్రారంభంలో పోర్ట్ ఎవర్‌గ్లేడ్స్, ఫ్లోరిడాలో రికార్డు స్థాయిలో 60,000 పౌండ్ల కొకైన్ రవాణా బయట పడిన వ్యవహారం కూడా ఉంది.ఆఫ్ఘనిస్తాన్ నుంచి ఉపసంహరణ తర్వాత ఆదాయాలు క్షీణించిన రక్షణ సాంకేతికసంస్థలు, లాభదాయకమైన కొత్తమార్కెట్‌ను కనుగొన్నాయి. షీల్డ్ ఎఐ, వన్నెవర్ ల్యాబ్స్, డజన్ల కొద్దీ ఇతర సంస్థలు ఇప్పుడు 'నార్కో-ఇంటర్డిక్షన్' అని అధికారులు పిలిచే ఫెడరల్ ఏజెన్సీలకు కృత్రిమ మేధస్సు వేదికలు, నిఘా వ్యవస్థలు, స్వయంప్రతిపత్తి వాహనాలను అందిస్తున్నాయి. ఈ సాంకేతిక పెరుగుదలకు గల కారణాన్ని వివరిస్తూ 'మాదకద్రవ్యాల ముప్పు నిజమైనది, స్థిరమైనది, కేవలం మనుషులతోనే ఒంటరిగా పోరాడటం అసాధ్యం' అని సీనియర్ కోస్ట్ గార్డ్ రోబోటిక్స్‌అధికారి ఆంథోనీ ఆంటోగ్నోలి అన్నారు. కానీ ఈ దాడులను అంతర్జాతీయంగా తీవ్రంగా ఖండించారు. వెనిజులా విదేశాంగ మంత్రిత్వ శాఖ వాటిని 'న్యాయవ్యవస్థ యేతర హత్యలు' , 'వలసవాదముప్పు' అని అంటుండగా, అమెరికన్ స్టేట్స్ సంస్థ సంయమనం పాటించాలని కోరింది. ఆరు విదేశీ విమానయాన సంస్థల ల్యాండింగ్ హక్కులను నవంబరు 27న వెనిజులా రాజధాని కారకాస్ రద్దు చేసింది. తమ దేశాన్ని ఏకాకిని చేయడానికి వాషింగ్టన్ చేస్తున్న ప్రయత్నాలకు అవి సహకరిస్తున్నాయని ఆరోపించింది.

దీనిని మాదకద్రవ్యాల వ్యతిరేక చర్యలుగా ట్రంప్ అధికార యంత్రాంగం ప్రచారం గావిస్తుండగా, ఆపరేషన్ పరిధి, తీవ్రతలు మాత్రం 'అధికారం మార్పు' దిశగా ఉన్నాయని నిఘా అధికారులు, విధాన విశ్లేషకులు చెబుతున్నారు. నవంబరులో అమెరికా అధికారికంగా కార్టెల్ డి లాస్ సోలెస్ (అంతర్జాతీయ డ్రగ్స్ అక్రమ నెట్‌వర్క్) నేరుగా మిస్టర్ మదురో, సీనియర్ సైనిక అధికారుల నియంత్రణలో ఉంటోందని వాషింగ్టన్ ఆరోపించింది. దానిని- విదేశీ ఉగ్రవాద సంస్థగా పేర్కొంది. థాంక్స్ గివింగ్ సందర్భంగా మోహరించిన దళాలను ఉద్దేశించి ట్రంప్ చేసిన వ్యాఖ్యలలో వెనిజులా నేత ఎన్నికలలో రిగ్గింగ్, పద్ధతి ప్రకారం మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నాడనీ, వ్యక్తిగతంగా అమెరికాలోకి మాదకద్రవ్యాల అక్రమ రవాణాను నిర్వహిస్తున్నాడని ఆరోపించారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను 'మేము సముద్రం ద్వారా దాదాపు 85శాతం ఆపాం', 'ఇప్పుడు మేము వాటిని భూమి ద్వారా ఆపడం ప్రారంభించబోతున్నాం. భూమి సులభం. అది చాలా త్వరగా ప్రారంభం కానుంది అని అధ్యక్షుడు అన్నారు.

వెనిజులా అధికారులు అన్ని ఆరోపణలను తోసిపుచ్చారు. సైనిక జోక్యాన్ని సమర్థించడానికి రూపొందించిన 'కల్పితయుద్ధం'గా అమెరికా ప్రచారాన్ని అభివర్ణించారు. కానీ, సున్నితమైన నిఘా అంచనాలపై చర్చించడానికి తమ గుర్తింపును దాచాలనే షరతుపై అనేక మంది లాటిన్ అమెరికన్ దౌత్యవేత్తలు మాట్లాడుతూ వాషింగ్టన్ మిస్టర్ మదురో ప్రభుత్వంతో ప్రత్యక్ష ఘర్షణకు పునాది వేస్తున్నదని తాము విశ్వసిస్తున్నట్లు చెప్పారు. 'ఇది 2003 పూర్వపు ఇరాక్ కాలం నాటి ఇబ్బందులను గుర్తుకు తెస్తోంది' అని ఒక సీనియర్ దక్షిణ అమెరికన్ అధికారి అన్నారు. 'ముప్పు ఆసన్నమైంది, ఆస్తుల పెరుగుదల, స్వతంత్రంగా ధృవీకరించలేని నిఘా వినియోగం వంటి వృత్తాంతాల స్క్రిప్ట్ సుపరిచితం.' అని ఆయన పేర్కొన్నారు, ఇరాక్‌పై చర్యలకు సమాంతరంగా కార్యకలాపాలు ఉన్నప్పుడు, అంతర్లీనంగా ఉన్న వ్యూహాత్మక బహుమతి కూడా అంతే స్పష్టం. ప్రపంచంలోనే అతిపెద్ద చమురు నిల్వలపైన వెనిజులా కూర్చొని ఉందని నిరూపితమైంది. అక్కడ 300 బిలియన్ బ్యారెళ్లకు పైగా చమురు, దానిలో ఎక్కువభాగం భారీ ముడి చమురు ఉన్నప్పటికీ, దశాబ్దాల కాలంగా సరిపడ పెట్టుబడి పెట్టకపోవడం, అంతర్జాతీయ ఆంక్షల కారణంగా ఎక్కువగా వినియోగించలేదు. ప్రపంచంలోనే అతిపెద్ద చమురు, సహజవాయువు ఉత్పత్తిదారుగా అమెరికాఉన్నప్పటికీ, వెనిజులా నిల్వలను భౌగోళికంగా రాజకీయంగా కీలకమైనవిగా ఆ దేశం చాలా కాలంగా భావిస్తోంది. ప్రత్యేకించి కారకాస్‌తో చైనా, రష్యా ఆర్థిక, సైనిక బంధాలను మరింత గాఢతరం చేసుకోవడం ఇందుకు కారణం. ఇంధన విశ్లేషకులు, మాజీ పెంటగాన్ అధికారులు చమురుకోణాన్ని సైనికప్రచారం నుంచి వేరు చేయలేమని అంటున్నారు. ఏ పరిపాలన అధికారి బహిరంగంగా దీనిని అంగీకరించేందుకు సిద్ధంగా లేరు. 'మాదకద్రవ్యాల గురించి అనే ఆలోచన కచ్చితంగా పరిశీలనకు నిలబడదు' అని పేరు వెల్లడించ డానికి ఇష్టపడని అట్లాంటిక్ కౌన్సిల్‌లోని సీనియర్ ఇంధన ఆర్థికవేత్త అన్నారు. 'అమెరికా పెరట్లోనే భూగ్రహంలోనే అతిపెద్ద చమురు నిల్వలు ఉన్నప్పటికీ భౌగోళిక రాజకీయ పరపతిని పొందడం వ్యూహాత్మకంగా అమూల్యమైనది' అని ఆయన పేర్కొన్నారు.

ఇరాక్‌పై దండయాత్ర జరిపేందుకు సద్దాం హుస్సేన్ వద్ద సామూహిక విధ్వంసక ఆయుధాలు ఉన్నాయనే వాదనలపై బుష్ అధికార యంత్రాంగం ఆధార పడింది. - నిఘా వర్గాలు ఆ వాదనలను తప్పుగా నిరూపించాయి. ఐక్యరాజ్యసమితి తనిఖీదారులు దాడికి ముందు క్రియాశీల ఆయుధ కార్యక్రమాలకు సంబంధించి ఎటువంటి ఆధారాలు కనుగొనలేదు. అయినప్పటికీ యుద్ధం కొనసాగింది. చివరికి ఇరాకీ చమురుక్షేత్రాలను పాశ్చాత్య కంపెనీలకోసం తెరిచింది. ఇస్లామిక్ రాజ్యంలోకి విస్తరించిన హింసాత్మక ఉగ్రవాదాన్ని పుట్టించింది. అప్రచురిత ట్రంప్ జాతీయ రక్షణ వ్యూహం అర్ధగోళ భద్రతకు అసాధారణ శ్రద్ధ వహించడంతో పాటు పోటీలో ఉన్న చైనాను 'వెనుక సీటు'కు పరిమితం చేయడంగా ఒక అధికారి పేర్కొన్నారు. వెనిజులా రాజకీయ దృశ్యాన్ని పునర్నిర్మించడం ద్వారా ప్రపంచ చమురు మార్కెట్లను, ఒపెక్ ప్రభావాన్ని ప్రాథమికంగా మారుస్తుందని అనేకమంది ప్రస్తుత, మాజీ రక్షణ శాఖ అధికారులు భావిస్తున్నారు. 'వెనిజులా రాజకీయ దృశ్యాన్ని వాషింగ్టన్ పునర్నిర్మించగలిగితే, అది ఒక తరానికి సంబంధించి ప్రపంచ చమురు ప్రభావం సమతుల్యతను మారుస్తుంది' అని రక్షణ శాఖ మాజీ సీనియర్ వ్యూహకర్త అన్నారు. 'అదే నిశ్శబ్ద గణితం.' అమెరికా తన అత్యంత తీవ్రమైన వ్యూహాత్మక తప్పిదాలలో ఒకదాన్ని పునరావృతం చేయబోతోందా అనేది ఇప్పుడు ప్రాంతీయ నిపుణులను, కాంగ్రెస్ సభ్యులను చుట్టుముడుతున్న ప్రశ్న.-అతిగా పేర్కొన్న ముప్పు సాకుతో సైనిక జోక్యాన్ని సమర్థించడం, అదే సమయంలో అసలు సమస్యను పరిష్కరించకుండా సంక్లిష్టం చేసే ఊహించని పరిణామాలను సృష్టిస్తుందని వారు భావిస్తున్నారు. ఇరాక్ యుద్ధం లక్షలాదిమందిని చంపింది. ట్రిలియన్ల డాలర్లు ఖర్చుచేసింది. ఐసిస్ ఎదుగుదలకు దారితీసిన అధికార శూన్యతను సృష్టించింది. ఆ సమూహం క్రూరత్వం, పరిధి చివరికి అమెరికాను స్థిరీకరించడానికి ప్రయత్నించిన అదే ప్రాంతంలోకి తిరిగి నెట్టివేసింది. సైనిక చర్యలను మరో దశాబ్దం పాటు పొడిగించింది.

వెనిజులా స్వతహాగానే జ్వలించే అస్థిరతను కలిగిఉంది. ఇటీవలి సంవత్సరాలలో పది లక్షలకు పైగా ప్రజలు పారిపోవడంతో దేశం ఆర్థిక పతనంతో నాశనమైంది. మిస్టర్ మదురోకు చెందిన భద్రతా దళాలు క్రమబద్ధమైన అణచివేతకు పాల్పడుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. కొలంబియన్ గెరిల్లాలు, స్థానిక మిలీషియాలతో సహా సాయుధ సమూహాలు సరిహద్దు ప్రాంతాలలో వివిధ స్థాయిలలో క్రూరమైన అణచివేతకు పాల్పడుతున్నాయి. అస్థిరీకరణ పొందిన వెనిజులా ప్రస్తుత సంక్షోభాన్ని మించి మానవతా విపత్తును ప్రేరేపించగలదని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. అదే సమయంలో తీవ్రవాద సమూహాలు, బహుళజాతి నేర సంస్థలు, శత్రు దేశాల శక్తులకు తమ ప్రభావాన్ని విస్తరించడానికి అవకాశాలు సృష్టిస్తున్నది. పారదర్శకమైన చట్టపరమైన సమర్థనలేకుండా నిరంతరం జరుగుతున్న సముద్రదాడులు 'అంతర్జాతీయ చట్టం తీవ్రమైన ఉల్లంఘనలు' గా పరిగణిస్తామని ఐక్యరాజ్యసమితి హెచ్చరించింది. వాషింగ్టన్, కారకాస్‌లతో సంక్లిష్టమైన సంబంధాలు కలిగిన బ్రెజిల్, కొలంబియా, మెక్సికో దేశాలు దౌత్యపరమైన పరిష్కారాల కోసం పిలుపునిచ్చాయి. అయినప్పటికీ మిస్టర్ ట్రంప్ చలించనట్లు కనిపిస్తున్నారు. ఇటీవలకాలంలో తీర ప్రాంతాలకు సమీపంలో వెనిజులా తమ వైమానిక రక్షణ వ్యవస్థలను తిరిగి ఏర్పాటు చేయడం ప్రారంభించింది. అమెరికా డ్రోన్లు సార్వభౌమ గగనతలాన్ని ఉల్లంఘిస్తున్నాయని ప్రభుత్వ మీడియాపేర్కొంది. వెనిజులాగడ్డపై దాడులను శ్వేతభవనం తోసిపుచ్చలేదు. భూతలకార్యకలాపాలు ప్రారంభమైతే, అమెరికా మరోసారియుద్ధాన్ని ప్రారంభించవచ్చు. దీన్ని మాదకద్రవ్యాల అక్రమరవాణాను ముగించడం అనే ముసుగులో భౌగోళిక రాజకీయ ఆశయాలు, ఆర్థిక ప్రయోజనాలు, దేశీయ రాజకీయ లెక్కలు సరిచేసుకునేందుకు మరింత క్లిష్టమైన విషయాలను దాచిపెట్టడమే. ఇరాక్‌లో మాదిరిగానే ఘర్షణ పర్యవసనాలు చమురుక్షేత్రాలను దాటి చాలావరకు విస్తరించవచ్చు.

కంప్యూటర్‌కు బుద్ధి ఎలా వచ్చింది?

విజయ్‌కుమార్ కుర్రా

"ఏఐ" అంటే ఏమిటి? అనే ప్రశ్నకు సమాధానం వెతికిన మొదటి వ్యాసంలో, కృత్రిమ మేధస్సు నిర్వచనం, దీని పనితీరు, ప్రయోజనాలు, అపాయాలు గురించి తెలుసుకున్నాం. ఇప్పుడు, ఆ భావన ఎక్కడి నుంచి పుట్టింది? ఎలా అభివృద్ధి చెందింది? అనే అంశంపై దృష్టి పెడదాం. ఈ రోజుల్లో "ఏఐ" అనే పదం మన చుట్టూ ప్రతిరోజూ వినిపిస్తోంది. కానీ ఈ సాంకేతికత అనేది అకస్మాత్తుగా పుట్టిందా? కాదు. దాని పునాదులు దాదాపు 70 సంవత్సరాల క్రితమే వేసి పెట్టారు. అలాంటి దీర్ఘప్రయాణం, విప్లవాత్మక పరిణామాలను తెలుసుకోవడం మనకు ఈ రంగం పట్ల గౌరవాన్ని, అవగాహనను పెంచుతుంది.

1950లో బ్రిటీష్ గణిత శాస్త్రవేత్త అలన్ టూరింగ్ ఏఐ భావనకు తొలిమెట్టు వేశారు. ఆయన "కంప్యూటింగ్ మెషినరీ ఇంటెలిజెన్స్" అనే ప్రబంధంలో, "మిషిన్‌లు ఆలోచించగలవా?" అనే పాతుకుపోయే ప్రశ్న వేశారు. అలన్ టూరింగ్ ప్రతిపాదించిన "టూరింగ్ టెస్ట్" ప్రకారం, ఒక మిషిన్ మానవునిలా స్పందించి మనిషిని మోసం చేయగలిగితే దానిని మేధస్సుగలదిగా పరిగణించాలి. ఇదే ప్రశ్న, ఆ పరీక్ష ఏఐకి బుద్ధి కలిగించాలనే లక్ష్యానికి ప్రామాణిక పునాది వేసింది.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనే పదం జననం

జాన్ మెకార్తీ అనే శాస్త్రవేత్త, 1956లో అమెరికాలోని డార్ట్‌మౌత్ కాన్ఫరెన్స్‌లో తొలిసారిగా "ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్" అనే పదాన్ని ఉపయోగించారు. ఈ సమావేశంలో గుణాత్మకమైన మోడల్స్, సమస్య పరిష్కార పద్ధతులు, భవిష్యత్ పరిశోధనలపై చర్చలు జరగడం ద్వారా ఏఐని అధికారికంగా ఒక శాస్త్రపరమైన శాఖగా పరిగణించారు.

ఏఐపై ఉన్న పెద్ద ఆశల వల్ల అనేక ప్రయోగాలు జరిగాయి. చెస్ ఆడే ప్రోగ్రాములు, భాష అనువాద సాఫ్ట్‌వేర్‌లు, నియమాల ఆధారిత వ్యవస్థలు అభివృద్ధి చేశారు. కానీ కంప్యూటింగ్ శక్తి తక్కువ, మెమొరీ పరిమితి, డేటా కొరత కారణంగా మిషిన్‌లు ఆశించిన స్థాయిలో పనిచేయలేదు. దీని ఫలితంగా పరిశోధన నిధులు తగ్గిపోయాయి. ఈ కాలాన్ని పరిశోధకులు "ఏఐ వింటర్" అని పిలుస్తారు. అది నిరాశ నింపిన దశ.

1997లో ఐబీఎం సంస్థ అభివృద్ధి చేసిన డీప్ బ్లూ అనే ఏఐ సిస్టమ్, చెస్ ప్రపంచ ఛాంపియన్ గ్యారీ కాస్పారోవ్‌పై విజయం సాధించింది. ఈ ఘట్టం ప్రపంచవ్యాప్తంగా ఏఐ పట్ల నూతన ఆసక్తిని రేకెత్తించింది. ఇది ఏఐ కూడా మనలాగా ఆలోచించగలదు!" అన్న నమ్మకానికి బలమైన ఆధారం ఇచ్చింది.



డేటా శక్తితో 2010 తరువాత పెరిగిన జోరు

2010దశకంలో "బిగ్ డేటా", "క్లౌడ్ కంప్యూటింగ్", "గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్స్ (జీపీయూలు) లభ్యతతో ఏఐ పునరుత్థానం చెందింది. ఇప్పటికే మనం వింటున్న 'లోతైన అభ్యాసం' (డీప్ లెర్నింగ్) పద్ధతులు, మానవ మెదడును అనుకరించే 'న్యూరల్ నెట్‌వర్క్‌లు' అనే ఆధారంగా పనిచేస్తాయి. ఇవి చిత్రాలను గుర్తించడం, భాషను అర్థం చేసుకోవడం, అభిప్రాయాలను విశ్లేషించడం వంటి అత్యాధునిక పనులు చేయగలవు.

ఓపెన్ ఏఐ సంస్థ 2022లో విడుదల చేసిన 'చాట్‌జీపీటీ' మోడల్ ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేసింది. ప్రస్తుతం జీపీటీ4, 5, 5.1, 'సిరి', 'అలెక్సా' 'గూగుల్ అసిస్టెంట్' వంటి ఎన్నో సహాయక ఏఐలు, భాషా అనువాదం, వైద్య సహాయం, కస్టమర్ సపోర్ట్, క్రియేటివ్ రైటింగ్ వంటి రంగాలలో విస్తారంగా వాడుతున్నారు.

ఏఐ ఇప్పుడు ప్రతి వ్యక్తి జీవితంలో మనకు తెలియకుండానే ఓ సహాయకుడిగా మారుతోంది. అభివృద్ధి ఒకరేఖగా కాకుండా, ఎత్తుపల్లాల మధ్య సాగిన ప్రయాణం. తడబడినప్పటికీ మానవ జిజ్ఞాసను నిలిపేయలేదు. అలెన్ టూరింగ్ మొదలు, జీపీటీ-5 వరకు ప్రతి దశలో మానవ ఆవిష్కరణా శక్తికి అద్దంపట్టే ఘట్టాలు ఎన్నో ఉన్నాయి.

టెక్ జర్నలిస్ట్, ఏఐ పరిశోధకుడు

గాజానుంచి తీవ్రవాదాన్ని తరిమేయాలి: నెతన్యాహు

టెల్ అవీవ్: హమాస్‌తో కాల్పుల విరమణ ఒప్పందం రెండో దశ త్వరలోనే ప్రారంభమవుతుందని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు పేర్కొన్నారు. హమాస్ ఇంకో బందీ మృత దేహాన్ని అప్పగించడం పూర్తయితే రెండో దశ ప్రారంభమవుతుందని ఆయన స్పష్టం చేశారు. నెతన్యాహు ఆదివారం ఇజ్రాయిల్ పర్యటనకు వచ్చిన జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడరిచ్ మెర్జ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నెతన్యాహు మాట్లాడుతూ "ఒప్పందంలో తొలి దశ పూర్తయినా, రెండో దశ అసాధ్యమని చాలా మంది అంటున్నారు. నేను ఒకటి చెప్పదలచుకున్నా...ఒప్పందంలో మూడో దశ కూడా ఉంది. అందులో భాగంగా గాజా నుంచి తీవ్రవాదం దూరం చేయాలి. అది కూడా అసాధ్యమని చాలా మంది అంటున్నారు. కానీ జర్మనీలో జరిగింది. జపాన్‌లో సాధ్యమైంది. గల్ఫ్‌దేశాల్లో కూడా జరిగింది. గాజాలో కూడా జరుగుతుంది. అయితే అందుకు హమాస్‌ను నాశనం చేయాలి" అని పేర్కొన్నారు.

థాయ్-కంబోడియా సరిహద్దులు ఉద్రిక్తం

సరిహద్దుల్లో వైమానిక దాడులు

బ్యాంకాక్: థాయ్‌లాండ్- కంబోడియా మధ్య మళ్లీ ఘర్షణలు చెలరేగాయి. సోమవారం కంబోడియా దళాలు చేసిన దాడిలో ఒక థాయ్ సైనికుడు మృతిచెందగా అనేకమంది గాయపడ్డారు. ఆగ్రహించిన థాయ్‌లాండ్ సైన్యం మిలిటరీ మౌలిక సదుపాయాలు, ఆయుధ డిపోలు, కమాండ్ సెంటర్లు లక్ష్యంగా కంబోడియాపై వైమానిక దాడులు నిర్వహించింది. ముందు దాడి చేసింది మీరంటే మీరని రెండుదేశాలు ఆరోపించుకుంటున్నాయి. సరిహద్దు గ్రామాల ప్రజలను రెండు దేశాల సైన్యాలు ఖాళీ చేయిస్తున్నాయి. మొదట కంబోడియా దళాలు కాల్పులు జరిపినట్లు థాయ్‌లాండ్ సైనిక ప్రతినిధి మేజర్ జనరల్ వింథాయ్ సువారే తెలిపారు. సోమవారం తెల్లవారుజామున ఈ ఘర్షణ మొదలైనట్లు పేర్కొన్నారు. తమ సైనికుడు ఒకరు ప్రాణాలు కోల్పోగా, మరో నలుగురు గాయపడినట్లు తెలిపారు. అలాగే ప్రభావిత ప్రాంతాల నుంచి ప్రజలను తరలిస్తున్నామన్నారు. కంబోడియా కాల్పులు జరిపినందుకే, పోస్టులు, ఆయుధ డిపోలే లక్ష్యంగా థాయ్ సైన్యం వైమానిక దాడులకు దిగిందని పేర్కొన్నారు. కాగా కంబోడియా రక్షణ మంత్రిత్వశాఖ స్పందిస్తూ... థాయ్ సైన్యమే మొదట కంబోడియా దళాలపై దాడి చేసిందని తెలిపింది. తొలుత ప్రీహ్ విహియార్ ప్రావిన్స్‌లో కాల్పులు జరిపినట్లు పేర్కొంది. శాంతి, స్థిరత్వానికి ముప్పు కలిగించే అన్ని కార్యకలాపాలను థాయ్‌లాండ్ వెంటనే ఆపాలని డిమాండ్ చేసింది. వెంటనే కవ్వింపు చర్యలు ఆపివేసి సరిహద్దుల్లో శాంతిస్థిరత్వానికి కట్టుబడి ఉందామని పిలుపునిచ్చింది.

జూలైలో థాయ్‌లాండ్-కాంబోడియా మధ్య జరిగిన ఐదు రోజుల మినీ యుద్ధంలో పెద్ద సంఖ్యలో సైనికులు, పౌరులు మృతిచెందారు. పరిస్థితి చేయి దాటుతుండటంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జోక్యం చేసుకుని రెండు దేశాల ప్రభుత్వాలను సంధికి ఒప్పించారు. అక్టోబర్‌లో సంధి ఒప్పందం అమల్లోకి వచ్చింది. అయితే కొద్ది నెలలకే మళ్లీ ఘర్షణలు మొదలయ్యాయి. ట్రంప్ ఆపినట్లు చెప్పుకొనే 8 యుద్ధాల్లో థాయ్-కంబోడియా ఘర్షణ కూడా ఒకటి.

థాయ్-కంబోడియా వివాదం ఏంటంటే?

రెండు దేశాల మధ్య ఘర్షణలకు సరిహద్దు వివాదాలే కారణమని చెబుతుంటారు కానీ సరిహద్దుల్లోని హిందూ దేవాలయాల కోసం ఇరుదేశాలు ఎన్నో ఏళ్లుగా ఘర్షణ పడుతున్నాయి. ప్రధానంగా ప్రముఖ ఆలయాలు ఉన్న ప్రీహ్ విహార్, ట మోన్ థోమ్, ట మ్యూన్ థోమ్ ఉన్న పర్వతాలు, అరణ్యాలు కలగలిసిన ప్రాంతాల కోసం దశాబ్దాలుగా ఇరుదేశాల మధ్య తీవ్ర పోరాటం జరుగుతోంది. ఈ ఆలయాల్లో శివలింగం, సంస్కృత లిపిలో శాసనాలు, హిందూ దేవతల చిత్రాలు ఉన్నాయి. థాయిలాండ్, కంబోడియా మధ్య 508 మైళ్ల సరిహద్దు ఉంది.

దీనిలో అత్యధిక భాగాన్ని ఫ్రాన్స్ పాలన కింద ఉన్నప్పుడే గుర్తించారు. రెండు దేశాలు శాంతియుతంగా కలిసి ఉంటున్నప్పటికీ, సరిహద్దుల్లో మాత్రం తరచూ ఘర్షణలు జరుగుతున్నాయి. వీటిల్లో 9వ శతాబ్దానికి చెందిన ప్రీహ్ విహార్ కీలకమైంది. కంబోడియా విజ్ఞప్తి మేరకు 2008లో ఈ ఆలయాన్ని యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించింది. దీనిని థాయ్‌లాండ్ తీవ్రంగా వ్యతిరేకించింది. కంబోడియా నాడు చూపిన మ్యాప్‌లో 4.6 చదరపు మైళ్లను ఆక్రమించుకున్నట్లు పేర్కొంది. అటు థాయ్‌లాండ్ దేశ పరిధిలోని సురిన్ ప్రావిన్స్‌లోని ట మోన్ థోమ్, ట మ్యూన్ థోమ్ ప్రాంతాలు కూడా ఇరుదేశాల మధ్య వివాదాస్పద ప్రదేశాలుగా ఉన్నాయి.

అమెరికాలో 9నెలల్లో 75వేలమంది అరెస్టు

వాషింగ్టన్: అక్రమ వలసదారులని ముద్ర వేయడం ద్వారా ఎటువంటి నేర చరిత్ర లేని దాదాపు 75,000 మందిని అమెరికా ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) అదుపులోకి తీసుకుంది. ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన మొదటి తొమ్మిది నెలల్లో ఈ అరెస్టులు జరిగినట్లు జాతీయ మీడియా ఆదివారం విడుదల చేసిన ఒక నివేదికలో తెలిపింది. ఈ మీడియా కాలిఫోర్నియా యూనివర్శిటీలోని 'డిపోర్టేషన్ డేటా ప్రాజెక్ట్' నుండి డేటాను పొందినట్లు తెలిపింది. ఐసిఇకి వ్యతిరేకంగా ఈ సంస్థ దావా వేసిన సంగతి తెలిసిందే. జనవరి 20, అక్టోబర్ 15 మధ్య నేర చరిత్ర లేని 75,000మందికి పైగా ఖైదీలను అదుపులోకి తీసుకుంది. వీరు ఐసీఈ అరెస్ట్ చేసిన మొత్తం 2,20,000 మంది ఖైదీల్లో మూడింట ఒక వంతు కంటే ఎక్కువ. ఈ గణాంకాల్లో కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ (సీబీపీ) నిర్బంధించిన వారి డేటా లేదు. ఈ ఏడాది లాస్ ఏంజిల్స్ వంటి పెద్ద నగరాల్లో దాడులు నిర్వహించినట్లు ఈ నివేదిక సూచిస్తోంది. నేరచరిత్ర లేని ఖైదీల సంఖ్య అధికంగా ఉందని తెలిపింది. ఐసీఈ సేకరించిన డేటా చిన్న నేరాలకు పాల్పడిన వ్యక్తులకు, హత్య లేదా అత్యాచారం వంటి తీవ్రమైన నేరాలకు పాల్పడిన వారికి మధ్య తేడాను గుర్తించదని తెలిపింది.

డిపోర్టేషన్ డేటా ప్రాజెక్ట్ నివేదిక ప్రకారం అక్టోబర్ మధ్య కాలం వరకు ఐసీఈ నిర్బంధించిన ఈ వ్యక్తులందరిలో సుమారు 90శాతం మంది పురుషులు ఉండగా, వీరు మెక్సికన్, గ్వాటెమాల , హొండురాన్ దేశాలకు చెందినవారు. అదుపులోకి తీసుకున్నవారిలో ఎంతమందిని వారి దేశాలకు పంపారన్న అంశంపై స్పష్టత లేదు.

అక్రమ వలసదారులపై భారీ జరిమానా

అనుమతి లేకుండా అమెరికాలోకి ప్రవేశించిన వలసదారుల నుంచి సుమారు రూ. 4,50,550 జరిమానా వసూలు చేయాలని అమెరికా భావిస్తోంది. 'బిగ్ బ్యూటిఫుల్' బిల్లు నిబంధనలకు అనుగుణంగా ఈ కొత్త నియమం ఉందని అమెరికా సరిహద్దు గస్తీ విభాగం అధిపతి మైఖేల్ బ్యాంక్స్ తెలిపారు. దేశంలోకి అక్రమంగా ప్రవేశించిన 14 ఏళ్లు పైబడిన వలసదారులందరూ దీని పరిధిలోకి వస్తారు. ఇక స్వదేశానికి తిరిగి వెళ్లడానికి సిద్ధంగా ఉన్న అక్రమ వలస కార్మికులకు ఉచిత విమానాలు, రూ.90,000 బోనస్‌గా ప్రకటించారు. 2025లో సరిహద్దు గస్తీ విభాగం 2,37,565 అక్రమ వలసదారులను అరెస్టు చేసింది. ఒక వ్యక్తిని అరెస్టు చేయడానికి, నిర్బంధించడానికి, బహిష్కరించడానికి రూ.15.3లక్షల ఖర్చవుతుందని హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం చెబుతోంది. కొత్త విధానం దేశ వ్యాప్తంగా సరిహద్దులతో నిమిత్తం లేకుండా అన్ని ప్రాంతాల్లోని పాత, కొత్త అక్రమ వలసదారులందరికీ వర్తిస్తుంది. సెప్టెంబర్ నుంచే ఈ కొత్త విధానం అమల్లోకి వచ్చినట్లు హోమ్ ల్యాండ్ సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్ తెలిపింది. ఒక్కో అక్రమ వలసదారును గుర్తించి, నిర్బంధించి, వారిని స్వదేశాలకు పంపడానికి అమెరికా ప్రభుత్వానికి సుమారు రూ.15 లక్షలు ఖర్చవుతుంది. ఇందులో కొంత అక్రమ వలసదారుల నుంచే వసూలు చేయాలని ట్రంప్ యంత్రాంగం నిర్ణయించింది.

తొలి రోజు రూ.1.88 లక్షల కోట్ల ఒప్పందాలు

(మూడోపేజీ తరువాయి)

రూ.15 వేల కోట్లు, తయారీ రంగంలో రూ.13,500 కోట్లు, ఉక్కు రంగంలో రూ.ఏడు వేల కోట్లు, టెక్స్‌టైల్ రంగంలో రూ.నాలుగు వేల కోట్లు మేర ఒప్పందాలు కుదిరినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

ఇండిగోపై అత్యవసర విచారణ చేయలేం

(మూడోపేజీ తరువాయి)

న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. కొన్ని రోజులుగా ఇండిగో తన సర్వీసులు రద్దు చేస్తోందని, దాంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారని పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ అంతరాయాల గురించి ప్రయాణికులకు సమాచారం ఇవ్వలేదన్నారు.

మావోయిస్టు అగ్రనేత రామ్‌ధేర్ లొంగుబాటు

(మూడోపేజీ తరువాయి)

చేరిన రామ్‌ధేర్ అనతి కాలంలోనే కీలక నేతగా ఎదిగాడు. కేంద్ర కమిటీ సభ్యుడు, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి హిడ్మా తర్వాత వచ్చిన ఆదివాసీ నేత రామ్‌ధేర్. ఒకప్పుడు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ (ఎంఎంసీ) స్పెషల్ జోనల్ కమిటీ కార్యకలాపాలు పోలీసులకు నిరంతరం ముప్పుగా ఉండేవి. తాజాగా ఆ బృందం సభ్యులైన మజ్జితో పాటు డివిజన్ కమిటీ సభ్యులు చందు ఉసెండి, లలిత, జానకీ, ప్రేమ్, ఏరియా కమిటీ సభ్యులు రామ్సింగ్ దాదా, సుకేశ్ పొట్టం, ప్లాటూన్ పార్టీ మెంబర్లు లక్ష్మి, శీల, సాగర్, కవిత, యోగిత లొంగిపోవడంతో ఎంఎంసీ జోన్లో దాదాపు మావోయిస్టు పార్టీ కనుమరుగైనట్లేనని పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా... కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో భద్రతా బలగాల 'ఆపరేషన్ కగార్' కొనసాగుతూనే ఉంది.

మావోయిస్టుల కోసం ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లోని దండకారణ్యాలను జల్లెడ పడుతున్నారు. ఈ క్రమంలో అగ్రనేతలు ఎదురుకాల్పుల్లో మృతి చెందడం, సెంట్రల్ కమిటీ సభ్యులతో పాటు మరి కొంతమంది కీలక నేతలు లొంగిపోతుండడంతో మావోయిస్టు పార్టీ పూర్తిగా బలహీనపడుతోంది.

'గ్లోబల్ సమ్మిట్'లో 'ఫిల్మ్ ఇన్ తెలంగాణ'

(మూడోపేజీ తరువాయి)

షూటింగ్స్, సాంస్కృతిక ప్రత్యేకతలను ఎలా నిర్వహిస్తున్నాయో పరిశీలిస్తుంది. అలాగే, తెలంగాణ కొత్త 'ఫిల్మ్ ఇన్ తెలంగాణ' కార్యక్రమం సింగిల్-విండో ఫిల్మ్ క్లియరెన్స్, ముందస్తు ప్రోత్సాహకాలు, రాష్ట్ర మద్దతు పొందిన స్థలాలు ... లాజిస్టిక్స్, ప్రపంచ స్థాయి ఫిల్మ్ ఫెసిలిటేషన్/కమిషన్ మోడల్ ద్వారా ఈ అవసరాలను ఎలా తీర్చుతుందో కూడా వివరంగా చూపిస్తుంది. అన్ని అంశాలు కలిపి తెలంగాణను భారతదేశంలో అగ్రశ్రేణి సినిమా కేంద్రంగా తీర్చిదిద్దాలని, ప్రధాన ప్రాంతీయ పరిశ్రమల నుంచి ప్రొడక్షన్‌లను ఆకర్షిస్తూ సృజనాత్మక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని సూచిస్తున్నాయి.

నెహ్రూపై చర్చిద్దాం రండి

(మూడోపేజీ తరువాయి)

విసిరారు. "వందే మాతరం జాతీయ గేయంపై రెండు కారణాల వల్ల ఈ చర్చ జరుగుతోంది. మొదటి కారణం త్వరలో బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు రానున్నాయి. అందులో తన పాత్ర గురించి ప్రధాని మోదీ చెప్పాలనుకుంటున్నారు. రెండో కారణం స్వాతంత్ర్యం కోసం పోరాడిన, దేశం కోసం ప్రాణత్యాగాలు చేసిన వారిపై కొత్త ఆరోపణలను చేయాలని ప్రయత్నిస్తున్నారు. తద్వారా ప్రజలకు సంబంధించిన ముఖ్యమైన సమస్యల నుంచి దేశ దృష్టిని మరల్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. నిజం ఏంటంటే? గతంలో ఉన్నట్లు ప్రధాని మోదీ ఇప్పుడు లేరు. ఆయన(మోదీ) ఆత్మవిశ్వాసం సన్నగిల్లుతోంది. ఆయన విధానాలు దేశాన్ని బలహీనపరుస్తున్నాయి. దేశ ప్రజలు సంతోషంగా లేరు. అనేక సమస్యలతో ఆందోళన చెందుతున్నారు. వారి సమస్యలకు ప్రభుత్వం పరిష్కారం చూపడం లేదు" అంటూ ప్రియాంక ప్రధానికి చురకలంటించారు. "వందేమాతరాన్ని జాతీయ గేయంగా ప్రకటిస్తే, అది ముస్లింలను రెచ్చగొట్టవచ్చని సుభాష్ చంద్ర బోస్‌కు జవహర్‌లాల్ నెహ్రూ లేఖ రాశారు. వందేమాతరంపై మహమ్మద్ అలీ జిన్నా భావాలను నెహ్రూ అంగీకరించారు" ప్రధాని మోదీ లోక్‌సభలో చెప్పారు. ఇలా అర్ధ సత్యాలను చెప్పడాన్ని ప్రియాంక గాంధీ తీవ్రంగా తప్పుబట్టారు. మోదీ కేవలం కొన్ని ఎంపిక చేసిన వాక్యాలు మాత్రమే పార్లమెంట్‌లో చెప్పారన్నారు.

ఈ సందర్భంగా 1937లో నెహ్రూ, సుభాష్ చంద్ర బోస్‌కు రాసిన లేఖను లోక్‌సభలో చదివి వినిపించారు. "నెహ్రూ ఆ లేఖలో, వందేమాతరంలోని మిగతా చరణాలను మతతత్వవాదులు తయారు చేశారని చెప్పారు. కానీ మోదీ కావాలనే ఆ భాగాన్ని ప్రస్తావించలేదు" అని ప్రియాంక చెప్పారు. "వాస్తవానికి వందేమాతరాన్ని జాతీయ గేయంగా ప్రకటించేటప్పుడు సభలో బాబాసాహెబ్ అంబేద్కర్, సంఘ్ నాయకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ఉన్నారు. ఆనాడు వందేమాతరంలోని కేవలం రెండు చరణాలను మాత్రమే ఆమోదించారు. మరి ఆనాడు అంబేద్కర్, ముఖర్జీ ఎందుకు అభ్యంతరం చెప్పలేదు" అని ప్రియాంక ప్రశ్నించారు.

రాజకీయ లబ్ధే పరమావధి

(మూడోపేజీ తరువాయి)

సంబోధించాలని సూచించారు. ప్రధాని మోదీ వెంటనే తనను తాను సరిదిద్దుకుని, ఎంపీకి అనేకసార్లు ధన్యవాదాలు చెప్పి... 'బాబు' అని అనడం ప్రారంభించారు. బ్రిటిష్ వలస పాలన 'విభజించి పాలించు' విధానానికి బెంగాల్ ఒక ప్రయోగశాలగా మారిందని మోదీ అన్నారు. "1905లో (బెంగాల్ విభజన) వారు ఆ పాపాన్ని చేసినప్పుడు, వందేమాతరం ఒక పర్వతంలా నిలబడింది. వీధుల్లో పాటగా మారింది. అది ప్రజలకు స్ఫూర్తినిచ్చింది. బ్రిటిష్ వారు బెంగాల్ ద్వారా విభజన బీజాలు వేశారు. కానీ వందేమాతరం జాతీయ ఐక్యతకు చిహ్నంగా మారింది" అని మోదీ స్పష్టం చేశారు. వందేమాతరం కేవలం రాజకీయ స్వేచ్ఛ కోసం ఉపయోగించిన ఒక మంత్రం కాదని, అది భారతమాతకు వలసవాద అవశేషాల నుంచి విముక్తి కల్పించడానికి చేసిన పవిత్ర యుద్ధ నినాదం అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. బ్రిటిష్ పాలకులు తమ జాతీయ గీతం 'గాడ్ సేవ్ ది క్వీన్' ను ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని ప్రయత్నిస్తున్న సమయంలోనే వందేమాతరం రాయడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. వందేమాతరాన్ని నిషేధించాలని బ్రిటిష్ వారు ప్రయత్నించారు. ఈ పద్యం ముద్రణ, ప్రచారాన్ని నిరోధించడానికి వారు చట్టాలను తీసుకువచ్చారని మోదీ అన్నారు. లండన్‌లోని ఇండియా హౌస్‌లో వీడీ సావర్కార్ వందేమాతరం ఆలపించిన విధానాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. "లక్షలాది మంది వందేమాతరం నినాదం చేస్తూ స్వాతంత్ర్యం కోసం పోరాడటం వల్లే మనం ఇక్కడ కూర్చున్నాం" అని అనేక మంది స్వాతంత్ర్య సమరయోధుల పేర్లను ప్రస్తావించిన తర్వాత మోదీ అన్నారు. ఈ క్రమంలోనే ఇండియాలో విధించిన ఎమర్జెన్సీని సైతం మోదీ ప్రస్తావించారు. వందేమాతరం 50 ఏళ్లు పూర్తి చేసుకున్నప్పుడు దేశం వలస పాలనలో ఉందని... అయితే అది 100వ వార్షికోత్సవం జరుపుకునే నాటికి దేశం ఎమర్జెన్సీలో ఉందని తెలిపారు. ఆ సమయంలో, రాజ్యాంగాన్ని అణచివేశారు, దేశభక్తి కోసం జీవించిన వారిని జైళ్లలో నెట్టారు. ఎమర్జెన్సీ అనేది మన చరిత్రలో ఒక చీకటి అధ్యాయం. ఇప్పుడు మనకు వందేమాతరం గొప్పతనాన్ని పునరుద్ధరించే అవకాశం లభించింది. ఈ అవకాశాన్ని వదులుకోకూడదని తాను గట్టిగా నమ్ముతున్నానని పేర్కొన్నారు. 'గత శతాబ్దంలో వందేమాతరం గీతానికి కొందరు ద్రోహం చేశారు. ఎవరు చేశారన్నది భావి తరాలకు చెప్పడం మన బాధ్యత. 1937లో మహమ్మద్ అలీ జిన్నా నేతృత్వంలోని ముస్లిం లీగ్ వందేమాతరం గీతానికి వ్యతిరేకంగా ప్రచారం చేసింది. దానిని వ్యతిరేకించాల్సిన కాంగ్రెస్, నెహ్రూ వందేమాతరంపైనే దర్యాప్తు చేయడం మొదలుపెట్టారు' అని మోదీ అన్నారు. మత సామరస్యం పేరుతో ఇలా చేశారని, జిన్నా నిరసనకు దిగిన 5 రోజుల్లోనే సుభాష్ చంద్రబోస్‌కి నెహ్రూ లేఖ రాస్తూ... గీతంలోని కొన్ని భాగాలు ముస్లింలకు నచ్చకపోవచ్చు అన్నారు. ఇది విని దేశం మొత్తం షాక్‌కు గురైందని... చివరికి, 1937 అక్టోబర్ 26న వందేమాతరాన్ని భాగాలు భాగాలుగా విడదీసింది కాంగ్రెస్ అని మోదీ ఆరోపించారు. వందేమాతరం నినాదాలు, కొన్ని అనువాదాలను ప్రస్తావిస్తూ బంగ్లా- తమిళ భాషల్లో కూడా కొన్ని పంక్తులు మాట్లాడారు.

దేశ చరిత్ర వక్రీకరణ...తిరగరాసే యత్నం: గొగోయ్

తొలుత కాంగ్రెస్ తరపున ఆ పార్టీ ఉపనాయకుడు గౌరవ్ గొగోయ్ వందేమాతరంపై చర్చను ప్రారంభిస్తూ... ప్రధాని దేశ చరిత్రను వక్రీకరించి తిరగరాసేందుకు ప్రయత్నించారని మండిపడ్డారు. బీజేపీ ఎంత ప్రయత్నించినా నెహ్రూ వారసత్వాన్ని అడ్డుకోలేదని గౌరవ్ గొగోయ్ వ్యాఖ్యానించారు. వందేమాతరం గేయానికి ప్రాముఖ్యతను ఇచ్చింది, ఆ గేయానికి జాతీయ గేయం హోదాను కల్పించింది కాంగ్రెస్ పార్టీయేనని ఆయన గుర్తుచేశారు. ఏ అంశంపై మాట్లాడినా దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పేరును, కాంగ్రెస్ పార్టీ పేరును ప్రస్తావించడం ప్రధాని మోదీకి అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు. ఆపరేషన్ సిందూర్‌పై చర్చ సందర్భంగా ప్రధాని ప్రసంగిస్తూ నెహ్రూ పేరును 14 సార్లు, కాంగ్రెస పార్టీ పేరును 50 సార్లు ప్రస్తావించారని గొగోయ్ తెలిపారు. అదేవిధంగా 75వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కూడా ప్రధాని మాట్లాడుతూ నెహ్రూ పేరును 10 సార్లు, కాంగ్రెస్ పేరును 26 సార్లు ప్రస్తావించారని చెప్పారు. వందేమాతరం గేయానికి ప్రాముఖ్యతనిచ్చిన పార్టీ ఏదైనా ఉందంటే అది కాంగ్రెస్ పార్టీయేనని అన్నారు. దానిని కేవలం రాజకీయ నినాదంగా చూడకుండా, జాతీయ గీత హోదా ఇచ్చేలా తమ పార్టీ చూసుకుందని ఆయన అన్నారు.

'తెలంగాణ రైజింగ్' దార్శనికతకు బీజం

(మూడోపేజీ తరువాయి)

మేమెంతో ప్రేరణ పొందామని వివరించారు. తెలంగాణ రైజింగ్ ప్రయాణంలో సహకరించడానికి, పెట్టుబడి పెట్టడానికి, మాకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని ఆకాంక్షించారు. ఈ విజన్ కష్టంగా అనిపించవచ్చు... కానీ మా టీమ్‌కు తాను చెప్పేదొక్కటే "కష్టంగా ఉంటే వెంటనే చేపడదాం... అసాధ్యం అని అనుకుంటే వారికి కొంత గడువు ఇస్తా"నని చెప్పారు. మీ అందరి మద్దతుతో తెలంగాణ రైజింగ్ లక్ష్యాలన్నింటినీ సాధించగలమని బలంగా నమ్ముతున్నానని స్పష్టం చేశారు. తెలంగాణ రైజింగ్ నిరంతర ప్రక్రియ... 'రండి... రైజింగ్‌లో చేరండి' అనే నినాదంతో సీఎం తన ప్రసంగాన్ని ముగించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అడుగు, ఆలోచన భావితరాల కోసమే: మంత్రి శ్రీధర్‌బాబు

భవిష్యత్తు కోసం ఎదురు చూడకుండా... దానిని నిర్మించాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. మేం వేసే ప్రతి అడుగు... చేసే ఆలోచన భావితరాల ఆశయాలు, అవసరాలకు అనుగుణంగా "రేపటి తెలంగాణ" కోసమే అని స్పష్టం చేశారు. "ఫీనిక్స్" పక్షి స్ఫూర్తితో ఇన్నోవేషన్, హ్యూమన్ క్యాపిటల్, సస్టైనబిలిటీ, గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్‌గా తెలంగాణను మార్చాలనే లక్ష్యంతోనే "తెలంగాణ రైజింగ్"కు శ్రీకారం చుట్టామన్నారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఎదురవుతున్న ఎకనామిక్ రీ అలైన్‌మెంట్స్, టెక్నలాజికల్ డిస్రప్షన్ వంటి సవాళ్లను అవకాశాలుగా మార్చుకొని దార్శనికతతో కూడిన అడుగులు వేస్తున్నామన్నారు. భౌగోళికం, జనాభాలో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ చిన్నదే అయినా దేశ జీడీపీలో మాత్రం ఐదు శాతం వాటాను కలిగి ఉందన్నారు. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.3.79 లక్షలు, జాతీయ సగటు కంటే 1.8 రెట్లు ఎక్కువ అని వివరించారు. పరిశ్రమలు, తయారీలో ఆర్థిక వృద్ధి రేటు 7.6 శాతం కాగా, జాతీయ సగటు 6.6 శాతం మాత్రమే అన్నారు. రాష్ట్ర సేవల రంగం వృద్ధి రేటు 11.9 శాతంగా కాగా, అదే జాతీయ సగటు 10.7 శాతంగా ఉందన్నారు. రాష్ట్ర ఇండస్ట్రియల్ జీఎస్‌వీఏ 12.6 శాతం వృద్ధి రేటుతో రూ.2.46 లక్షల కోట్ల నుంచి రూ.2.77 లక్షల కోట్లకు పెరిగిందన్నారు. దేశంలోనే తొలి ఏఐ పవర్డ్ విలేజ్ గా మారిన మంథని నియోజకవర్గంలోని ఒక మారుమూల గ్రామం "రేపటి తెలంగాణ"కు మార్గదర్శిగా నిలిచిందన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ, తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్, ఏఐ ఆధారిత తెలంగాణ డేటా ఎక్స్ఛేంజ్, ఏఐ యూనివర్సిటీ, స్కిల్ యూనివర్సిటీ, అడ్వాన్స్‌డ్ ఐటీఐలు, ఏఐ ఆధారిత అకడమిక్ కరిక్యులం, యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్స్, లైఫ్ సైన్సెస్ హబ్ "వన్ బయో", సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ క్వాంటం టెక్నాలజీ వంటి విప్లవాత్మక అడుగులు ప్రపంచపటంలో "తెలంగాణ"ను ప్రత్యేకంగా నిలుపుతాయన్నారు. భవిష్యత్ తరాలకు భరోసాగా తెలంగాణతో కలిసి భవిష్యత్తును నిర్మించేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలకు ఆహ్వానం పలికారు.

2047కి నెట్ జీరో లక్ష్యం

(మూడోపేజీ తరువాయి)

అన్నారు. ప్రతి పాఠశాలకు, ప్రతి ఆవిష్కరణకు, ప్రతి గ్రీన్ ఇనిషియేటివ్‌కు కావాల్సిన ఆర్థిక బలం. ఇది మూలధనంపై నమ్మకం మాత్రమే కాదు సృజనాత్మకత, సామర్థ్యం, ధైర్యంపై తెలంగాణ ప్రభుత్వం పెట్టుబడి అని వివరించారు. క్యూర్, ప్యూర్, రేర్ స్పెషియల్ విజన్, క్యూర్... కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ హైదరాబాద్ అత్యంత చురుకైన రూపం, ఏఐ, ఏరోస్పేస్, జీనోమిక్స్, ఫ్యూచర్ ఇండస్ట్రీల కేంద్రం. ప్యూర్, పెరీ అర్బన్ రీజియన్ ఎకానమీ ఉత్పత్తి, పరిశ్రమలు, లాజిస్టిక్స్ ఇవి జరిగే శక్తివంతమైన ప్రాంతం. రేర్, రూరల్ అగ్రికల్చరల్ రీజియన్ ఎకానమీ మన వ్యవసాయభూములు, అడవులు, పచ్చదనం... ఇవి అగ్రి ఎంట్రప్రెన్యూర్షిప్, ఈకో-టూరిజం, కార్బన్ ఎకానమీకి ఇంజిన్‌లు అన్నారు. క్యూర్ ఆవిష్కరిస్తుంది, ప్యూర్ అందిస్తుంది, రేర్ నిలబెడుతుందనీ తెలిపారు. మహిళ శక్తి నుంచి రైతు భరోసా వరకు, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ వరకు ఇవి సంక్షేమం కాదు... ఇవి సమానత్వ నిర్మాణం, అభివృద్ధి ప్రయాణంలో ఎవరూ వెనుకబడకూడదు అన్నదే తెలంగాణ ప్రజా ప్రభుత్వ నినాదం అన్నారు.

తేలిగ్గా తీసుకోవడం లేదు

(మొదటిపేజీ తరువాయి)

కమిటీని పౌర విమానయాన శాఖ ఏర్పాటుచేసింది. ఈ కమిటీలో డీజీసీఏ జాయింట్ డైరెక్టర్ సంజయ్ కె.బ్రహ్మనే, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ అమిత్ గుప్తా, సీనియర్ ఫ్లైట్ ఆపరేషన్స్ ఇన్‌స్పెక్టర్ కెప్టెన్ కపిల్ మాన్‌గ్లిక్, ఫ్లైట్ ఆపరేషన్స్ ఇన్‌స్పెక్టర్ లోకేష్ రాంపాల్ ఉన్నారు. వీరు భవిష్యత్తులో ఎలాంటి అంతరాయాలు చోటుచేసుకోకుండా కొన్ని సిఫార్సులు చేయనున్నారు.

ఇండిగో ప్రయాణికులకు రూ.827 కోట్ల రీఫండ్

ఇండిగో విమాన సర్వీసుల్లో నెలకొన్న అంతరాయం వల్ల నవంబరు 21 నుంచి డిసెంబరు 1 వరకు 9,55,591 టికెట్లు రద్దయినట్లు పౌరవిమానయాన శాఖ తెలిపింది. వీటి విలువలో దాదాపు రూ.827 కోట్లను ప్రయాణికులకు రీఫండ్ చేసినట్లు వెల్లడించింది. డిసెంబరు 1 నుంచి 7 వరకు 5,86,705 టికెట్లు రద్దు కాగా... రూ.570 కోట్లు ప్రయాణికులకు అందినట్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. విమాన సర్వీసుల రద్దు వల్ల వివిధ విమానాశ్రయాల్లో దాదాపు 9,000 బ్యాగేజీలు నిలిచిపోయినట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది. వాటిలో 4,500 బ్యాగులు ఇప్పటికే ప్రయాణికులకు అందజేసినట్లు వెల్లడించింది. వచ్చే 36 గంటల్లో మిగిలిన వాటిని డెలివరీ చేసేందుకు ఇండిగో ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొంది. సోమవారం మొత్తం 500 సర్వీసులు రద్దయినట్లు చెప్పింది. మరోవైపు సర్వీసుల పునరుద్ధరణను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు తమ మాతృసంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ ప్రత్యేకంగా ఒక 'క్రైసిస్ మేనేజ్‌మెంట్ గ్రూప్'ను ఏర్పాటు చేసినట్లు ఇండిగో తెలిపింది.

రూ.6.15 లక్షల కోట్ల రుణమాఫీ

(మూడోపేజీ తరువాయి)

2025 సెప్టెంబరు 30 వరకు రూ.1.79 లక్షల కోట్లు సమీకరించినట్లు వివరించారు. ఆర్‌బీఐ మార్గదర్శకాలు, బ్యాంక్ బోర్డు ఆమోదించిన విధానం మేరకు పూర్తి ప్రొవిజనింగ్ చేసిన నిరర్థక ఆస్తులను నాలుగేళ్లు పూర్తయిన తర్వాతే బ్యాంకులు రద్దు చేస్తాయని గుర్తుచేశారు. బ్యాంకులు తమకు అందుబాటులో ఉన్న వివిధ రికవరీ విధానాల ద్వారా రుణగ్రహీతలపై చర్యలు కొనసాగిస్తాయన్నారు.

ఏపీపీఎస్సీ పరీక్షల షెడ్యూలు ఇలా...

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) రాత పరీక్షల తేదీలు విడుదల య్యాయి. ఈ ఏడాది కూటమి ప్రభుత్వం 21 ఉద్యోగాల భర్తీకిగాను ప్రకటన విడుదల చేసిన విషయం తెలిసిందే. ఆయా ఉద్యోగాలకు సంబంధించిన నియామక రాత పరీక్ష (ఓఎంఆర్) షెడ్యూల్‌ను ఏపీపీఎస్సీ తాజాగా విడుదల చేసింది. ఈ పరీక్షలను రెండు విడతలుగా నిర్వహించనున్నారు. ఈ మేరకు షెడ్యూల్‌ను, పరీక్షా కేంద్రాల వివరాలను ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. 2026 జనవరి 27 నుంచి 31 వరకు తొలి విడత, ఫిబ్రవరి 9 నుంచి 13 వరకు రెండో విడత ఈ పరీక్షలు జరగనున్నాయి. అగ్రికల్చర్ ఆఫీసర్, టెక్నికల్ అసిస్టెంట్, జూనియర్ లెక్చరర్ (లైబ్రేరియన్ సైన్స్), హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్-2, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ (సివిల్), హార్టికల్చర్ ఆఫీసర్, అసిస్టెంట్ ఇంజనీర్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, జూనియర్ ఆఫీసర్ అసిస్టెంట్ (గ్రూప్-4), అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిషరీస్, వార్డెన్ పరీక్షలు జనవరి 27, 28, 30 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన పరీక్ష కేంద్రాల్లో ఆఫ్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. ఇక ఫారెస్ట్ బీట్ ఆఫీసర్-అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, తానేదార్ పరీక్షలు ఫిబ్రవరి 9, 10వ తేదీల్లోను, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గ్రేడ్-3 పరీక్షలు 11న, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పరీక్షలు 12, 13 తేదీల్లో ఏపీపీఎస్సీ నిర్వహించనుంది. జనరల్ స్టడీస్ (జీఎస్), మెంటల్ ఎబిలిటీ(ఎంఏ) ఉమ్మడిగా పేపర్ 1 పరీక్ష విధానం ఉంటుంది.

విశాలాంధ్ర హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర,షాద్ నగర్, రూరల్: గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ ద్వారానే అభివృద్ధి సాధ్యమని, కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి అన్నారు. కొందుర్గ్ మండలంలోని అగిర్యాల గ్రామంలో తన సోదరుడు శేఖర్‌రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందరరేగా సులోచన కృష్ణారెడ్డి మాట్లాడుతూఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో కొందుర్గ్ మండలానికి అనేక సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను తీసుకువచ్చా మన్నారు. అదే విధంగా ఆగిర్యాల గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశామని అన్నారు. గ్రామంలోలో ఓల్టేజి సమస్య కారణంగా ఇబ్బందులు తలెత్తితే ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో కొత్తగా 5 కేవీ ట్రాన్స్ ఫార్మర్ కూడా ఏర్పాటు చేశామని, రూ.15 లక్షలతో సీసీ రోడ్లు నిర్మాణంకు భూమి పూజ చేశామని, గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను సైతం మంజూరు చేయించి పేద ప్రజలకు అందించామన్నారు. ఆగిర్యాల గ్రామంలో తన సోదరుడు శేఖర్‌రెడ్డి సర్పంచ్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచారని ఉంగరం గుర్తుకు ఓటేసి తన సోదరుడు శేఖర్‌రెడ్డినీ అత్యధిక మెజార్టీతో గెలిపించి గ్రామ అభివృద్ధిలో పాలు పంచుకోవాలన్నారు.

టాప్ 100 ఐటీ, ఐటీఈఎస్ కంపెనీల్లో సీడీకే

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఆటోమోటివ్ రిటైల్ సాఫ్ట్‌వేర్ రంగంలో అగ్రగామి సంస్థ అయిన సీడీకే, గ్రేట్ ప్లేస్ టు వర్క్ ఇండియా ద్వారా 2025 సంవత్సరానికి భారతదేశంలోని టాప్ 100 ఐటీ, ఐటీఈఎస్ వర్క్‌ప్లేస్‌లలో ఒకటిగా గుర్తింపు పొందింది. సీడీకే గ్లోబల్, ఇండియా సీనియర్ డైరెక్టర్ ఆఫ్ హ్యూమన్ రిసోర్సెస్, ఆశిష్ సక్సేనా మాట్లాడుతూ "సీడీకే మరోసారి భారతదేశంలోని టాప్ 100 ఉత్తమ కార్యాలయాల్లో ఒకటిగా ఎంపికైనందుకు మేము గర్వపడుతున్నామన్నారు. ఈసారి, పరిమాణంతో సంబంధం లేకుండా దేశంలోని అన్ని ఐటీ, ఐటీఈఎస్ కంపెనీలను పరిగణనలోకి తీసుకున్నారు. ఈ గుర్తింపులు మా ఉద్యోగుల పట్ల మాకు ఉన్న తిరుగులేని నిబద్ధతను తెలియజేస్తున్నాయని పేర్కొన్నారు. ఇంజినీర్లు, విశ్లేషకులు, కస్టమర్, ప్రొడక్ట్ బృందాలు తమ పని ప్రభావం గురించి తెలుసుకోవడానికి, వృద్ధి అవకాశాలను అన్వేషించడానికి, వివిధ పాత్రల్లోకి మారడానికి వీలుగా మేము పారదర్శకమైన, అందరినీ కలుపుకొనిపోయే విధానాలను రూపొందించాం. ఇదంతా కూడా నమ్మకం అనే సంస్కృతికి కట్టుబడి ఉంది. అని పేర్కొన్నారు. సీడీకే గ్లోబల్, ఇండియా ఎండీ సందీప్ జైన్ మాట్లాడుతూ ఈ గుర్తింపు ఆటోమోటివ్ రిటైల్ సాఫ్ట్‌వేర్‌లో లోతైన డొమైన్ నైపుణ్యం, బలమైన ఇంజినీరింగ్ సామర్థ్యాలు, త్వరగా స్పందించే కస్టమర్ సపోర్ట్ బృందాలు అన్నీ కలిసి అభివృద్ధి చెందగలిగే ఒక కార్యాలయాన్ని సృష్టించాలనే మా నిబద్ధతను మరింత బలోపేతం చేస్తుందని వివరించారు.

కల్యాణ లక్ష్మి ,షాదిముబారక్ చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి మండలం పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, మాదాపూర్, మియాపూర్, హఫీజ్పేట్, చందానగర్ ,భారతి నగర్(పార్ట్) డివిజన్ల పరిధిలోని పలువురికి కల్యాణ లక్ష్మి /షాదిముబారక్ పథకం ద్వారా మంజూరైన మంజూరైన 30 మంది లబ్ధిదారులకు రూ.30,03,480ల ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులకు మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి చెక్కుల రూపేణా పీఏసీ చైర్మన్ ఆరెకపూడిగాంధీకి అందజేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ఈ రోజు 30 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులు అందచేయడం చాలా సంతోషకరమైన విషయమని గాంధీ తెలిపారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని , గౌరవ ముఖ్యమంత్రి వర్యులు శ్రీ రేవంత్ రెడ్డి, పేదల పక్షపాతి అని, పేదింటి ఆడ బిడ్డకు పెద్ద అన్న లాగా నిలుస్తారన్నారు. నిరుపేదల అడా బిడ్డల పెళ్లికి దేశంలో ఎక్కడా లేని విధంగా, మానవతా దృక్పథంతో కల్యాణ లక్ష్మి షాది ముబారక్ పథకం ప్రవేశపెట్టడం జరిగినది అని, అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, పేదింటి వారి ఇండ్లలో సంతోషంతో ఆడ పిల్లల పెండ్లి జరగాలని సదుద్దేశంతో కల్యాణ లక్ష్మి షాది ముబారక్ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగాధర్,కాజా, ఖాసీం, లియకత్,శ్రీనివాస్ రెడ్డి, ప్రసాద్ కార్యకర్తలు, లబ్ధిదారులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

సీపీఆర్‌తో ప్రాణం నిలిపిన మార్షల్



విశాలాంధ్ర శేరిలింగంపల్లి: సీపీఆర్ చేసి ఓ వ్యక్తి ప్రాణం నిలిపిన జీడిమెట్ల ట్రాఫిక్ మార్షల్ శివకుమార్‌ను ఈరోజు సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, జాయింట్ సీపీ, ట్రాఫిక్ డా. గజరావు భూపాల్ అభినందించారు. వివరాల్లోకి వెళితే..జీడిమెట్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సూరారం చౌరస్తాలో రహీం అనే వ్యక్తి శుక్రవారం (డిసెంబర్ 5న) ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. అక్కడే విధులు నిర్వహిస్తున్న జీడిమెట్ల ట్రాఫిక్ మార్షల్ శివకుమార్ వెంటనే స్పందించి అతడికి సీపీఆర్ చేశాడు. కొద్దిసేపటికి అతడు స్పృహలోకి రావడంతో, శివకుమార్ అతడిని పక్కనే ఉన్న దవాఖానకు తరలించాడు. శివకుమార్ సకాలంలో స్పందించి సిపిఆర్ చేయడం, డాక్టర్లు ట్రీట్ మెంట్ ఇవ్వడంతో రహీం కోలుకున్నాడు.

గ్రామాభివృద్ధికి కృషి : శ్రీనివాస్

విశాలాంధ్ర - మొయినాబాద్: మన తోల్కట్ట గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని సర్పంచ్‌గా ఒక అవకాశం ఇవ్వండని మమత శ్రీనివాస్ ప్రజలను కోరారు. గ్రామంలో అర్హులందరికీ స్కీమ్ లు అందేలా చూస్తాను.. ముఖ్యంగా ప్రజలందరికీ అందుబాటులో ఉంటాను.. 14న జరిగే సర్పంచ్ ఎన్నికల్లో బాల్ గుర్తుకు ఓటు వేసి సర్పంచ్‌గా అవకాశం కల్పించాలని తోల్కట్ట గ్రామ ఓటర్లను కోరారు. సోమవారం మండలంలోని తోల్కట్ట గ్రామంలో ఆమె ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌గా గెలిపించి ప్రజాసేవ చేసే భాగ్యం కల్పించాలని ఓటర్లను వేడుకున్నారు. స్వచ్ఛ గ్రామమే లక్ష్యంగా పనిచేస్తానని మమత శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఈ ప్రచారంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

ఘనంగా తెలంగాణ గ్లోబల్ సమ్మిట్

- సమ్మిట్‌ను ప్రారంభించిన తెలంగాణ గవర్నర్
- తరలి వచ్చిన వివిధ రాష్ట్రాల ప్రముఖులు

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 మీర్ఖాన్‌పేటలోని భారత్ ఫ్యూచర్ సిటీలో ఘనంగా ప్రారంభమైంది. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభోపన్యాసం చేస్తూ, ఈ ప్రతిష్ఠాత్మక ఈవెంట్‌ను అధికారికంగా ప్రారంభించారు. వేడుకకు ముందు, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గ్లోబల్ సమ్మిట్ ప్రాంగణంలో వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ముఖ్యమంత్రితో పాటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, ఉన్నతాధికారులు, పారిశ్రామికవేత్తలు, నిపుణులు, మేధావులు ఉన్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ప్రారంభ ప్లీనరీలో ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులు పాల్గొన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి,

కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, తెలంగాణ ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ట్రంప్ మీడియా అండ్ టెక్నాలజీ గ్రూప్ సీఈవో ఎరిక్ స్వైడర్, నోబెల్ శాంతి గ్రహీత కైలాష్ సత్యార్థి, టీవీఎస్ సప్లై చైన్ చైర్మన్ ఆర్. దినేష్, అపోలో హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ శోభన కామినేని, అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ మేనేజింగ్ డైరెక్టర్ కరణ్ అదానీ తదితరులు ప్రసంగించారు. నోబెల్ గ్రహీత అభిజిత్ బెనర్జీ, వరల్డ్ ఎకనామిక్ ఫోరం మేనేజింగ్ డైరెక్టర్ జెరెమీ జుర్గెన్స్ సమ్మిట్‌ను ఉద్దేశించి వర్చువల్‌గా ప్రసంగించారు. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, తెలంగాణ డీజీపీ శివదర్ రెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్, సీనియర్ అధికారులు, వివిధ దేశాల ప్రతినిధులు, ప్రపంచ సంస్థల ప్రతినిధులు తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరయ్యారు.

విశ్వవిద్యా కేంద్రంగా తెలంగాణ :మంత్రి

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణను ప్రపంచ విద్యా కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. 'తెలంగాణ రైజింగ్-2047' విజన్‌లో భాగంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేర్చడంలో వైద్య, విద్యారంగాలే వెన్నుముకగా నిలుస్తాయని ఆయన అన్నారు. గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా 'తెలంగాణ యాజ్ ఏ గ్లోబల్ ఎడ్యుకేషన్ హబ్' అనే అంశంపై జరిగిన చర్చా వేదికలో మంత్రి ప్రసంగించారు. బాలికా విద్య ప్రాముఖ్యతపై మంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. "పేద, మధ్య తరగతి కుటుంబాల నుంచి వచ్చే అమ్మాయిలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి నర్సింగ్ వంటి వృత్తి విద్యా కోర్సులు ఎంతో దోహదపడతాయి. వారి కలలను సాకారం చేసేందుకే తెలంగాణ ప్రభుత్వం గతేడాది కొత్తగా 16 నర్సిం గ్ కళాశాలలను ప్రారంభించింది. కేవలం డిగ్రీలు ఇవ్వడమే కాదు, అంతర్జాతీయ స్థాయిలో వారికి ఉద్యోగాలు కల్పించ డమే మా లక్ష్యం. ఇందుకోసం నర్సింగ్ విద్యార్థులకు జర్మన్, జపనీస్, ఇంగ్లిష్ భాషల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. తద్వారా మన ఆడబిడ్డలు విదేశాల్లోనూ రాణించేలా తీర్చిదిద్దుతున్నాం, అని మంత్రి దామోదర రాజనర్సింహ వివరించారు. నైపుణ్యంతో కూడిన విద్యే అసలైన ఆస్తి అని, సామాన్యుడి ఆశయ సాధనకు విద్యే ప్రధాన ఆయుధమని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుత ప్రపంచంలో కేవలం పుస్తక జ్ఞానం ఉంటే సరిపోదని, నైపుణ్యాభివృద్ధి, ఎంటర్ప్రెన్యూర్ షిప్ మిళితమైన విద్య అవసరమని తెలిపారు. అందరికీ అందు బాటులో నాణ్యమైన విద్యను అందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు.

విద్యా రంగంలో తెలంగాణ హవా....

రాష్ట్రంలో ప్రస్తుతం 47 విశ్వవిద్యాలయాలు, 1,951 ఉన్నత విద్యా సంస్థలు ఉన్నాయి. దేశంలోనే అత్యధిక కళాశాల సాంద్రత కలిగిన రాష్ట్రాల్లో తెలంగాణ రెండో స్థానంలో ఉంది. గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియోలో తెలంగాణ దేశంలోని టాప్-5లో నిలిచింది. అని మంత్రి వెల్లడించారు.

కీలక సంస్కరణలు - 'యంగ్ ఇండియా' విజన్....

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సంస్కరణలను మంత్రి వివరిస్తూ.. సామాజిక అసమానతలను తొలగించి, అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించేందుకు 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' (YIIRS)ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పరిశ్రమలకు అవసరమైన మానవ వనరుల కోసం 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ'ని నెలకొల్పామన్నారు. పాలిటెక్నిక్ విద్యార్థులకు ఆస్ట్రియాకు చెందిన ఆల్పా సంస్థతో కలిసి డ్యుయల్ అప్రెంటిస్‌షిప్ ప్రోగ్రామ్‌ను అమలు చేస్తున్నట్లు గుర్తుచేశారు. తెలంగాణ ప్రభుత్వం 2047 నాటికి ప్రతి పౌరుడిని నైపుణ్యవంతుడిగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తుందని, ఈ యజ్ఞంలో భాగస్వాములు కావాలని అంతర్జాతీయ పారిశ్రామిక వేత్తలకు, విద్యావేత్తలకు మంత్రి పిలుపునిచ్చారు. తాను చదువుకుని రాజయకీయాల్లోకి వచ్చే సమయంలో కేశవరావు విద్యాశాఖ మంత్రిగా ఉండేవారని, ఇప్పుడు ఆయనతో కలిసి విద్యా రంగానికి సంబంధించిన చర్చలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఈ సమా వేశంలో నిపుణులు ఇచ్చిన సూచనలను తప్పకుండా పరిగణలోకి తీసుకుంటామని మంత్రి తెలిపారు.

పర్యాటక రంగాన్ని విశ్వవ్యాప్తం చేయడమే లక్ష్యం: మంత్రి జూపల్లి

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ పర్యాటకాన్ని విశ్వవ్యాప్తం చేయడమే లక్ష్యమని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గ్లోబల్ సమ్మిట్‌లో తెలంగాణ పర్యాటక రంగాన్ని సరికొత్తగా ప్రపంచానికి పరిచయం చేస్తామని వెల్లడించారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో పర్యాటక శాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్‌ను మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. అంతర్జాతీయ ప్రతినిధులను ఆకర్షించేలా తెలంగాణ పర్యాటక అందాలు, చారిత్రక ప్రదేశాల ఛాయచిత్రాలను డిజిటల్ స్క్రీన్ లో (కాగితపు రహిత-పేపర్ లెస్) పర్యాటక శాఖ ప్రదర్శించింది. రాష్ట్రంలో ఎక్కడెక్కడ ఏయే పర్యాటక ప్రాంతాలున్నాయో తెలుసుకునేలా టచ్ కియోస్క్‌ను ఏర్పాటు చేశారు. తెలంగాణ పర్యాటక ప్రాంతాలకు సంబంధించిన మీ జ్ఞానాన్ని పరీక్షించుకోండి. అద్భుతమైన బహుమతులను గెలుచుకోండి! అని చెప్పారు. నూతన పర్యాటక విధానం 2025-2030తో పునరుత్తేజం వచ్చింది. నూతన పర్యాటక పాలసీపై ఇన్వెస్టర్స్ ఆసక్తి చూపుతున్నారు. త్వరలోనే పర్యాటక రంగం మరింత పురోభివృద్ధి సాధిస్తుందని భావిస్తున్నా మని మంత్రి ఈ సందర్భంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ క్రాంతి వల్లూరు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతలో రాష్ట్రం రోల్ మోడల్

- మహిళలు ఎదిగితే.. దేశం ఎదుగుతోంది
- స్టార్టప్‌ల నుంచి సౌర శక్తి దాకా...
- కొత్త రంగాల్లో దూసుక పోతున్న మహిళా సంఘాలు
- 2047 నాటికి మహిళా శ్రామిక భాగస్వామ్యం 90శాతం ఇది తెలంగాణ సంకల్పం
- ప్రపంచ వేదికపై తెలంగాణ మహిళా శక్తి ప్రతిభను ప్రతిధ్వనింపజేసిన మంత్రి సీతక్క

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహిళలు ఎదిగితే ఆర్థిక వ్యవస్థ ఎదుగుతుంది, మహిళలు స్వయం సంపత్తి సృష్టిస్తే అభివృద్ధి సమగ్రంగా ఉంటుంది. మహిళలు వ్యాపారాలు నడిపితే ఆర్థిక వృద్ధి స్థిరంగా ఉంటుందని తెలంగాణ ఈ మార్పునకు నాయకత్వం వహిస్తోంది' అని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. మహిళా ఆధారిత ఆవిష్కరణలతో ముందుకు సాగుతున్న తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి గాథను, భవిష్యత్తు ప్రణాళిలను తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్--2025 వేదికగా ఆవిష్కరించారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్--2025లో పాల్గొన్న పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క. ప్రపంచం నలుమూలల నుండి వచ్చిన ప్రతినిధులు, పెట్టుబడిదారులు, పారిశ్రామిక వెత్తలను ఉద్దేశించి ప్రసంగించారు. మహిళా సాధికారతలో రోల్ మోడల్‌గా నిలుస్తున్న తెలంగాణ అనుభవాలను ప్రపంచంతో పంచుకోవడం ఈ సమ్మిట్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. సీతక్క మాట్లాడుతూ, దేశంలోనే అత్యంత శక్తివంతమైన మహిళా నెట్‌వర్క్‌ను తెలంగాణ నిర్మించిందని, 65 లక్షల మహిళా స్వయం సహాయక సంఘాలు గ్రామీణ, పట్టణ ఆర్థిక వ్యవస్థలను పూర్తిగా మారుస్తున్నాయని పేర్కొన్నారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా గ్రామీణ, పట్టణ పేద మహిళలు, వికలాంగులు, వృద్ధ మహిళలు, అట్టడుగు వర్గాలు, ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల వరకు అందరికీ రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని చెప్పారు. తెలంగాణలో ఒక్క మహిళ కూడా వెనుకబడిపోకూడదనే లక్ష్యంతో పనిచేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. గత రెండేళ్లలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు సంక్షేమానికే పరిమితం కాలేనది..అవి మహిళల నిజమైన సాధికారత వైపు ఉన్నాయని పేర్కొన్నారు. వడ్డీలేని రుణాలు, స్త్రీ నిధి మరియు బ్యాంకుల ద్వారా భారీ స్థాయిలో అందించిన క్రెడిట్ సపోర్ట్, లక్షలాది సూక్ష్మ వ్యాపారాల నెలకొల్పడం, మహిళల కోసం జిల్లాల్లో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి భవనాలు, తెలంగాణ మహిళల ఆర్థిక స్వరూపాన్ని మార్చేశాయని తెలిపారు. ప్రతి మహిళకు ప్రమాద బీమా, లోన్ బీమా వంటి రక్షణ వలయాలు సమాన అవకాశాలు అందిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో మహిళలు కొత్త రంగాల్లో ఆధిపత్యం చాటుతున్నట్లు వివరించారు. ప్రభుత్వ కార్యాలయాలు, కోర్టులు, హాస్పిటళ్లు, దేవాలయాలు, పర్యాటక కేంద్రాల్లో నడుస్తున్న మహిళా శక్తి కాంటీన్లు మహిళలకు స్థిరమైన ఆదాయ వనరులుగా మారాయని, పాఠశాల యూనిఫాంల తయారీ, పాఠశాల అభివృద్ధి పనుల అమలు, టీఎస్ ఆర్టీసీకి అద్దె బస్సుల కొనుగోలు, మహిళల ఆధ్వర్యంలో నడుస్తున్న పెట్రోల్ బంకులు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు మహిళలకు కొత్త ఆర్థిక వ్యాపారాలను సృష్టిస్తున్నాయని పేర్కొన్నారు. దీనికి కొనసాగింపుగా 32 జిల్లాల్లో మహిళల చేత ఏర్పాటు కాబోతున్న 64 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్లు దేశంలోనే తొలి ఉదాహరణగా నిలిచాయని వెల్లడించారు. విజన్ 2047 గురించి మాట్లాడుతూ, అభివృద్ధి చెందిన దేశాల్లో మహిళలు జీడీపీ+DP కి 40శాతం వరకు దోహదం చేస్తే, భారతదేశంలో అది ఇప్పటికీ 20శాతంకి చేరలేదని, ఈ అసమానతను తెలంగాణ మార్చబోతుందని తెలిపారు. ప్రస్తుతం 52శాతం ఉన్న మహిళా శ్రామిక భాగస్వామ్యాన్ని 2047 నాటికి 90శాతం వరకు పెంచేందుకు ప్రభుత్వం సంకల్పించిందని చెప్పారు. దీనిలో భాగంగా గ్రామాల్లో డే కేర్ సెంటర్లు, మహిళలకు భద్రతాయుత రవాణా, తక్కువ వడ్డీ రుణాలు, మహిళా సహకార సమాఖ్యలు, ఆన్‌లైన్ మార్కెట్లు, ప్రత్యేక మహిళా పారిశ్రామిక క్లస్టర్లు..మహిళా కేంద్రంగా ఆర్థిక ప్రగతికి బాటలు వేస్తున్నామన్నారు. "మహిళలు ఎదిగితే ఆర్థిక వ్యవస్థ ఎదుగుతుంది. మహిళలు స్వయం సంపత్తి సృష్టిస్తే అభివృద్ధి సమగ్రంగా ఉంటుంది. మహిళలు వ్యాపారాలు నడిపితే ఆర్థిక వృద్ధి స్థిరంగా ఉంటుంది. తెలంగాణ ఈ మార్పునకు నాయకత్వం వహిస్తోంది" అని అన్నారు. పెట్టుబడిదారులు, జాతీయ అంతర్జాతీయ పారిశ్రామిక దిగ్గజాలు తెలంగాణలో అవకాశాలు అన్వేషించాలని ఆమె పిలుపునిచ్చారు. తెలంగాణలో మహిళలు అవకాశాల కోసం ఎదురు చూడడం లేదు, అవకాశాలను స్వయంగా సృష్టిస్తున్నారు అని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

ర్యాండమైజేషన్ పూర్తి

విశాలాంధ్ర ప్రతినిధి - రంగారెడ్డి : ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా సోమవారం పోలింగ్ సిబ్బందిని నియమించుటకు మూడవ విడతలో రెండవ ర్యాండమైజెషన్ ప్రక్రియను జనరల్ అబ్జర్వర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సమక్షంలో పూర్తి చేశారు. సోమవారం జనరల్ అబ్జర్వర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణ రెడ్డి నేతృత్వంలో జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ మూడవ విడతలో రెండవ ర్యాండమైజెషన్ ప్రక్రియను నిర్వహించారు. జిల్లాలో నిర్వహించే గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి మండలాల వారీగా ఎన్నికల విధులు నిర్వర్తించే 4458 ప్రిసైడింగ్, అధికారులను, ఇతర అధికారులతో కూడిన బృందాలను ర్యాండమైజెషన్ ద్వారా కేటాయించారు. వీరికి ఇప్పటికే మొదటి విడత శిక్షణను ఎంపిక చేసిన వివిధ కేంద్రాలలో మాస్టర్ ట్రైనర్స్‌చే పోలింగ్ నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగిందని కలెక్టర్ అన్నారు. రెండవ విడత మండలాలలో పోలింగ్ సిబ్బందికి 9న వారికి కేటాయించిన మండల కేంద్రాలలో రెండవ విడత శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని, ఎవరైనా ఎన్నికల విధులకు గైర్హాజరు అయినట్ల యితే ఎన్నికల నిబంధనలను అనుసరించి కఠినచర్యలు తీసుకోబడుతాయని అని కలెక్టర్ హెచ్చరించారు. ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్,(లోకల్ బాడీస్) డీపిఓ సురేష్ మోహన్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

గాంధీ ఆశయాలతో అభివృద్ధి : కైలాష్ సత్యార్థి

విశాలాంధ్ర -హైదరాబాద్: 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్' ... కేవలం సదస్సు మాత్రమే కాదు. ప్రపంచ దేశాల నుంచి పెట్టుబడుదారులు, పారిశ్రామికవేత్తలతోపాటు అనేకమంది నిపుణులు హాజరు కావడంతోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సగం విజయం సాధించారని స్పష్టమౌతుందని నోబెల్ అవార్డు గ్రహీత కైలాష్ సత్యార్థి అన్నారు. తెలంగాణ వివిధ జాతుల సంస్కృతి, సంప్రదాయాలకు నెలవైందని అన్నారు. గాంధీ ఆశయాలతో తెలంగాణను అభివృద్ధి పథంలోకి నడిపించనున్నారని అన్నారు. ఈ సమ్మిట్ ... దేశాన్ని, ప్రపంచాన్ని ఒక పారదర్శకమైన శాంతియుత సామాజిక అభివృద్ధి వైపుగా తీసుకు వెళుతుందన్నారు. తెలంగాణ ఆర్థికంగా, సామాజికంగా అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందని అందులో తప్పనిసరిగా తాము భాగస్వామ్యం అవుతామని జెర్మీ జర్గెన్స్ పేర్కొన్నారు.

లక్షల కోట్ల పెట్టుబడి ఖాయం: హెరిక్

తెలంగాణ రైజింగ్ పేరుతో నిర్వహిస్తున్న గ్లోబల్ సదస్సుతో రూ.లక్షల కోట్ల పెట్టుబడి రాష్ట్రానికి వస్తుందని అర్థమైందని హెరిక్ అన్నారు. భారతదేశం సాంకేతికంగా అభివృద్ధి చెందడానికి ఎక్కువ సమయం పట్టదని, అందులో తెలంగాణ కీలకపాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.

ఇది ఆవిష్కరణ... పెట్టుబడుల కలయిక: దినేష్

ఇది కేవలం సాధారణ సదస్సు కాదని, ఇది ఆవిష్కరణ పెట్టుబడుల కలయిక అని సీఐఐ మాజీ ప్రెసిడెంట్ టీవీఎస్ సప్లైచైన్ సొల్యూషన్ ఎగ్జిక్యూటివ్ దినేశ్ అన్నారు. రాష్ట్రం అత్యంత రక్షణతో కూడిన పారిశ్రామిక అభివృద్ధిగా ఉంటుందని అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం కలసి పనిచేస్తామని హామీ ఇచ్చారు.

మరో ఫార్మా విప్లవానికి నాంది: శోభన కామినేని

భారత ఫ్యూచర్ సిటీ మరొక ఫార్మా విప్లవానికి నాంది పలకనుందని అపోలో హాస్పటల్స్ చైర్మన్ కామినేని శోభన అన్నారు. ప్రపంచ దేశాలకు ఎగుమతి అయ్యే ఫార్మా ఉత్పత్తులలో అధిక శాతం రాష్ట్రం నుంచే అవుతున్నాయని తెలిపారు. దేశంలోని ఫార్మసిటికల్ కంపెనీలలో మూడవ వంతు తెలంగాణలోనే ఉన్నాయన్నారు.

3 ట్రిలియన్ ఎకానమీకి అదానీ గ్రూప్ భాగస్వామ్యం: కరణ్ అదానీ

రాష్ట్రంలో ప్రధాని గ్రూప్ అనేక రంగాలలో పెట్టుబడులు పెట్టిందని తద్వారా రాష్ట్ర ఆర్థిక ఎదుగుదలకు తమ వంతుగా చేయూత అందిస్తుందని అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ మేనేజింగ్ డైరెక్టర్ కరణ్ అదాని అన్నారు. ఈ సమ్మిట్ ప్రభుత్వం విజన్, నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు.

సమర్థ నాయకత్వంతో మానవ వనరుల అభివృద్ధి: అభిజిత్ బెనర్జీ

తెలంగాణ రాష్ట్రంలో భారత్ ఫీచర్ సిటీ ఏర్పాటుతో మానవ వనరుల అభివృద్ధి జరుగుతుందని ఆర్థిక నిపుణులు అభిజిత్ బెనర్జీ అన్నారు. ఈ సదస్సుతో రాష్ట్రంలో దేశంలోనే గొప్ప ఆర్థిక అభివృద్ధి జరుగుతుందని తెలిపారు.

రాష్ట్రం చిన్నదైనా విజన్ పెద్దది: డీకే శివకుమార్

తెలంగాణ రాష్ట్రం కర్నాటకతో పోల్చుకుంటే చిన్నదైనా... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజన్ మాత్రం పెద్దదని కర్నాటక ఉప ముఖ్య మంత్రి డీకే

శివకుమార్ అన్నారు. హైదరాబాద్, బెంగుళూరు ప్రపంచస్థాయిలో మార్కెట్ కలిగి ఉన్న ప్రాంతాలన్నారు. తెలంగాణ రైజింగ్ కేవలం ఒక్క తెలంగాణకు చెందినది మాత్రమే కాదని ఇది దక్షిణ రాష్ట్రాలకు చేయూతగా నిలుస్తుందన్నారు. ఇండియా ఆర్థిక వ్యవస్థలో దక్షిణ రాష్ట్రాల పాత్ర కీలకం కానుంది అన్నారు. దేశంలో జరిగే ఎగుమతులలో బెంగళూరు నుంచి 40 శాతం జరుగుతున్నాయని, అతి త్వరలో తెలంగాణ నుంచి కూడా ఇదే స్థాయిలో ఎగుమతులు జరుగుతాయని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వం లో తెలంగాణ గ్లోబల్ మార్కెట్ గా అవతరించనుందని, అందుకు కర్నాటక సహకరిస్తుందన్నారు. అభివృద్ధి మ్యాజిక్ కాదని, నిబద్ధత, కష్టం, పారదర్శకత, బాధ్యత, జవాబుదారీతనం, నిజాయితీతోనే సాధ్యమవుతుందన్నారు.

ఓవర్ లోడింగ్ వాహనాలపై చర్యలు తీసుకోవాలని వినతి

విశాలాంధ్ర - తుర్కయంజల్ : ఓవర్ లోడింగ్, అక్రమ రవాణా చేస్తున్న వాహనాలపై తగు చర్యలు తీసుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తుర్కయంజాల్ మున్సిపల్ సమితి ఆధ్వర్యంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ (ఎంవీఐ) సుశీల్ రెడ్డికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం ఆర్టీవో శాఖ కార్యాలయం పరిధిలో ఓవర్ లోడింగ్ పేరుతో భారీ స్థాయిలో అక్రమ రవాణా జరుగుతున్నదనీ, దీనివల్ల ప్రభుత్వానికి ఆదాయ నష్టం కలడమే కాకుండా రహదారులపై మట్టి కంకరపడి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నా యన్నారు. ఇటీవల కాలంలో చేవెళ్లలో జరిగిన కంకర టిప్పర్ బస్సుపై బోల్తా పడి పదుల సంఖ్యలో ప్రాణ నష్టం జరిగిందని వారు తెలిపారు. ఇలాంటి ఘటనలు మరలా జరగకుండా వెంటనే అక్రమ వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్స్‌లు వాహన రిజిస్ట్రేషన్లు విషయంలో అవినీతి జరుగుతుందని, కొంతమంది మధ్యవర్తులు అధిక మొత్తంలో అవినీతి చేస్తూ, వారు లేకపోతే ఆర్టీవో కార్యాలయంలో పనులు జరగడంలేదని ప్రజలు చెప్తున్నారని అన్నారు. రవాణా వినియోగదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తూ, అవినీతి అక్రమ కార్యక్రమాలకు పాల్పడుతున్న వ్యక్తులపై, వారికి సహకరిస్తున్న అధికారులపైన వెంటనే చర్యలు తీసుకోవాలని లేనియెడల సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి శివకుమార్ గౌడ్, తుర్కయంజాల్ మున్సిపాలిటీ కార్యదర్శి కాటమరాజు తదితరులు పాల్గొన్నారు.

శబరిమల బయలుదేరిన అయ్యప్ప స్వాములు

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ నుంచి సోమవారం అయ్యప్ప దీక్షా స్వాములు శబరిమలై యాత్రకు బయలుదేరి వెళ్లారు. 41 రోజుల పాటు దీక్షా కాలం ముగించుకుని కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్ రెడ్డి (గురుస్వామి) శ్రీ అభయ ఆంజనేయ స్వామి వారి ఆలయంలో గణపతి హెూమం కార్యక్రమాని పూర్తి చేసి గురుస్వాములచే ఇరుముడి కట్టుకుని స్వామియే శరణమయ్యప్ప నామస్మరణ చేస్తూ సన్నిధానం స్వాములతో కలిసి ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు అభిమానులు,భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

'రక్షణ సేకరణ నిర్వహణ వ్యవస్థ' అభివృద్ధి, విస్తరణకు గీతం కృషి

విశాలాంధ్ర, పటాన్ చెరువు : న్యూఢిల్లీలోని భారత సైన్యం, పదాతిదళ ప్రధాన కార్యాలయం కోసం 'రక్షణ సేకరణ నిర్వహణ వ్యవస్థ' అభివృద్ధి, విస్తరణకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదు తోడ్పాటును అందించింది. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ ఆచార్యురాలు ప్రొఫెసర్ ప్రీతి అంబరీష్ పర్వేకర్ నేతృత్వంలోని నలుగురు సభ్యుల బృందం ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేసింది.ప్రధాన పరిశోధకురాలిగా వ్యవహరించిన ప్రొఫెసర్ ప్రీతి 2025 మే నుంచి నవంబర్ వరకు ఈ ప్రాజెక్టును నడిపించారు. నిరంతరం దశలవారీ విస్తరణల ద్వారా సజావుగా పురోగతిని నిర్ధారించారు. ఆమెకు సహాయ పరిశోధకుడిగా (కో-ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్) డాక్టర్ ఎస్. రామకృష్ణ ఇద్దరు విద్యార్థి డెవలపర్లు- నిడదవోలు కుందన్, దిగుదాడి ప్రణశ్ రాహుల్ మద్దతు ఇచ్చారు. పదాతిదళంలో సేకరణ ప్రక్రియలను క్రమబద్ధీకరించి, బలోపేతం చేయడానికి రూపొందించిన ఈ వ్యవస్థ ఇప్పుడు పూర్తిగా సిద్ధమై, వినియోగ దశకు చేరుకుంది. ఇది జాతీయ రక్షణ కార్యకలాపాలకు గీతం హైదరాబాదు చేసిన గణనీయమైన సహకారాన్ని సూచిస్తోంది.ఈ విజయానికి గుర్తింపుగా, ఇండియన్ ఆర్మీ ఇన్ ఫాంట్రీ ప్రధాన కార్యాలయం ప్రొఫెసర్ ప్రీతి, ఆమె బృందాన్ని ఇటీవల జరిగిన తుది విస్తరణ, వ్యవస్థ ప్రదర్శన, సత్కార కార్యక్రమానికి న్యూఢిల్లీకి అధికారికంగా ఆహ్వానించింది.ఈ మైలురాయి గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగానికి గర్వకారణంగా నిలుస్తుంది. ఇది ప్రభావవంతమైన, దేశ-కేంద్రీకృత సాంకేతిక ఆవిష్కరణలను ముందుకు తీసుకెళ్లడంలో ప్రొఫెసర్ ప్రీతి నాయకత్వాన్ని బలోపేతం చేస్తుంది.

కత్తెర గుర్తుకు ఓటు వేయండి

విశాలాంధ్ర - మొయినాబాద్ : ఈ నెల 14న జరిగే సర్పంచ్ ఎన్నికల్లో, కత్తెర గుర్తుకు ఓటు వేసి సర్పంచ్ గా ఆశీర్వందించాలని సర్పంచ్ అభ్యర్థి కీసరి పద్మ సంజీవరెడ్డి కోరారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా కత్తెర గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సర్పంచ్ గా గెలిపించి ప్రజా సేవ చేసే భాగ్యం మరోమారు కల్పించాలని ఓటర్లను కోరుకున్నారు. అవకాశం ఇస్తే గ్రామ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. అదే విధంగా గ్రామ అభివృద్ధిపై పలు హామీలను వెల్లడించారు. గ్రామంలో సీసీ రోడ్డులు, డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం, హైమాక్స్ లైట్లు ఏర్పాటుకి "కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం కృషి చేస్తాను. ఎస్సీ, బీసీ కాలనీల్లో సైడ్ డ్రైనేజీల ఏర్పాటు, త్రాగునీటి సమస్యలపై చర్యలు తీసుకుంటాను. యువతలోని క్రీడా ప్రతిభను వెలికి తీయడానికి కోసం కృషి చేస్తాను. వృద్ధులు, దివ్యాంగులు అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా వ్యవస్థను బలోపేతం చేస్తాను. మొత్తంగా గ్రామ ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ గ్రామానికి సమర్థవంతమైన పరిపాలన అందించడమే తన లక్ష్యమని సర్పంచ్ అభ్యర్థినీ కీసరి పద్మ సంజీవరెడ్డి పేర్కొన్నారు.

మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
H.M.O.P. No. 200/2024

బిట్వీన్ :
లొట్టపల్లి సాయి కృష్ణవేణి, W/o.సైదయ్య @ ప్రభాకర్,R/o.పల్లెగుంత గ్రామం, గురజాల(మం), పల్నాడు జిల్లా. ...పిటీషనర్

మరియు

లొట్టపల్లి సైదయ్య @ ప్రభాకర్,S/o. కృష్ణయ్య R/o.ఐర్ణిగూడెం(గ్రామం), దామరచర్ల(మం), నల్గొండ జిల్లా, తెలంగాణ రాష్ట్రం ...రెస్పాండెంట్

పై నెంబరు పిటీషన్ విడాకుల కొరకు పిటీషనర్ మరియు రెస్పాండెంట్ పై దాఖలుచేసియున్నారు. పిటీషనరు కోర్టువారి ఉత్తర్వుల కొరకు మీకు అనేక పర్యాయములు నోటీసులు పంపిననూ మీరు ఉద్దేశ్యపూర్వకముగా తీసికొని యుండ లేదు. కావున పైన తెలిపిన పిటీషన్‌లో మీకుగల ఆక్షేపణలు తెలుపుకొనుటకు శ్రీ కోర్టు వారు ది.18-12-2025కి వాయిదావేసియున్నారు. సదరు వాయిదా రోజు ఉ॥గం॥10-30ని॥లకు పై కోర్టువారి ఎదుట మీరు స్వయంగా గాని లేదా మీ లాయరుగారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షమందు తీర్మానించబడును.

వాయిదా తేది. 18-12-2025

దాసరి చిరంజీవి శరత్ బాబు, పిటీషనర్ తరుపు న్యాయవాది, గురజాల. సెల్ : 9885084234

మహిళా కార్మికులు మెరుపు ధర్నా

విశాలాంధ్ర, కాప్రా : నాచారం పారిశ్రామిక వాడలోని షాహీ టెక్స్టైల్స్ ఎక్స్‌పోర్ట్ యూనిట్ ఎదుట సోమవారం ఉదయం నుంచి దాదాపు వెయ్యిమంది మహిళా కార్మికులు మెరుపు ధర్నాకు దిగారు. యాజమాన్యం హేతుబద్ధమైన డిమాండ్లను పట్టించుకోవడం లేదంటూ కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నాచారం ఐడీఏలో పనిచేస్తున్న షాహీ టెక్స్టైల్స్ మహిళా కార్మికులు సోమవారం పెద్ద సంఖ్యలో ప్రధాన గేటు ఎదుట చేరి ధర్నా నిర్వహించారు. పరిశ్రమలో జరుగుతున్న వేధింపులను అరికట్టాలని, కనీస వేతనం రూ.15,000 అమలు చేయాలని, చేసిన ఓవర్‌టైమ్ మొత్తాన్ని పూర్తిగా చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ధర్నాకు సంఘీభావం తెలుపుతూ ఏఐటీయూసీ టి సత్య ప్రసాద్, సీఐటీయూ మేడ్చల్ మాజీ అధ్యక్షుడు కోమటి రవి మాట్లాడుతూ.. కార్మికుల న్యాయపరమైన డిమాండ్లపై యాజమాన్యం వెంటనే స్పందించాలి. ప్రస్తుత పరిస్థితుల్లో కనీస వేతనం రూ.26,000 కన్నా తక్కువ కాదు. ఐక్యంగా నిలబడితే కార్మికుల పోరాటం తప్పకుండా విజయం సాధిస్తుంది అని అన్నారు. కార్మికుల ప్రతి ఉద్యమానికి సీఐటీయూ పూర్తి మద్దతు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. వెంటనే యాజమాన్య ప్రతినిధులు హెచ్‌ఆర్ ప్రతాపరెడ్డి, మేనేజర్ స్వప్నతో కలిసి కార్మికుల సమక్షంలో రవి నేతృత్వంలో చర్చలు జరిగాయి. ఓటీ మొత్తాన్ని సమీక్షించి న్యాయపరంగా రావాల్సిన అమౌంట్ అందజేస్తామని యాజమాన్యం హామీ ఇచ్చింది. వేధింపులపై విచారణ జరిపి తక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పింది. అయితే వేతన పెంపు విషయంపై మేనేజ్‌మెంట్‌తో మాట్లాడి చెబుతాం అంటూ దాటవేశారు. ఈ సమాధానంపై కార్మికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వేతనం పెంచే వరకు ధర్నా కొనసాగిస్తామని స్పష్టంచేశారు. అంతకుముందు రోజు ఏడుగురు సభ్యులతో కూడిన కమిటీ యాజమాన్యంతో చర్చలకు వెళ్లగా, వారిని తమవైపు తిప్పుకునేందుకు ప్రమోషన్లు, హెూదాలు ఇచ్చినట్లు కార్మికులు ఆరోపించారు. ఈ విషయం తెలిసిన వెంటనే మహిళా కార్మికులు సోమవారం పెద్ద ఎత్తున గేటు ఎదుట ఆందోళనకు దిగారు. స్థితిగతులు తెలుసుకున్న కార్మిక సంఘాలు సంఘీభావం తెలిపాయి. సీఐటీయూ తరపున కోమటి రవి, ఏఐటీయూసీ నుండి సత్యప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ హాజరై కార్మికుల ధర్నాకు సంఘీభావం తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమంలో కార్మిక నాయకులు సీఐటీయూ అశోక్ రెడ్డి, ఉపేందర్, ప్రభాకర్, ఏఐఎస్ఎఫ్ ఉప్పల్ మండల్ అధ్యక్షులు ఎండి అజీమ్ పాషా,ఏఐవైఎఫ్ గిరిబాబు, ఎస్ ఎఫ్ ఐ డబ్ల్యూ స్వప్న, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

భక్తి మార్గంతోనే సత్ప్రవర్తన సాధ్యం

విశాలాంధ్ర, పటాన్ చెరువు : సమాజంలో భక్తి మార్గంతోనే సత్ప్రవర్తన సాధ్యమవుతుందని, భక్తి ఏకాగ్రతతో భగవంతుని స్మరిస్తే మనసుకు ప్రశాంతత లభిస్తుందని టిఆర్ఎస్ సీనియర్ నాయకులు మాధురి పృథ్వీరాజ్ స్పష్టం చేశారు. సోమవారం పటాన్ చెరువు మండలం, కర్దనూర్ లో ఎల్వర్తి అరవింద్ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి మహా పడిపూజకు ముఖ్య అతిథులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందరర్బగా అర్చకులు అయ్యప్ప స్వామికి మహా అభిషేకం నిర్వహించి 18 మెట్ల పడిపూజను చేశారు. స్వామియే శరణమయ్యప్ప అను శరణు ఘోషలతో కర్దనూరు ప్రాంతం దద్దరిల్లింది. ఈ సందర్భంగా టిఆర్ఎస్ సీనియర్ నాయకులు మాదిరి పృథ్వీరాజ్ మాట్లాడుతూ క్రమశిక్షణ, సత్ప్రవర్తనతో భగవంతుని పూజించినట్లయితే ఆ దేవుని కరుణా కటాక్షములు తప్పకుండా ఉంటాయని పేర్కొన్నారు. అయ్యప్ప మాలధారణతో మాల ధరించిన స్వాములు నిజ జీవితంలో ఉత్తమమైన సన్మార్గంలో జీవితాన్ని నడుపుతారని వివరించారు. అనంతరం అయ్యప్పస్వామి అన్న ప్రసాదంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాలుపంచుకున్నారు. ఈ కార్యక్రమంలో కర్దనుర్ మాజీ ఉపసర్పంచ్ వడ్డే కుమార్, పాల్గొన్నారు.

బీసీ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రవీణ్ కుమార్ నియామకం

విశాలాంధ్ర, బషీర్ బాగ్: తెలంగాణ బీసీ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కంచిగారి ప్రవీణ్ కుమార్ నియమిస్తూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య, తెలంగాణ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గవ్వల భరత్ కుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ర్యాగ అరుణ్ బాబులకు కృతజ్ఞతలు తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేసిందని ఆరోపించారు. తూతూ మంత్రంగా రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేసి చేతులు దులుపు కుందని విమర్శించారు. బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదం కోసం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కేంద్రం ఒత్తిడి తేవడం లేదని ఆయన అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించాకే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ బీసీల గొంతు కోసిందని మండిపడ్డారు.కృష్ణయ్య సారధ్యంలోనే బీసీ రిజర్వేషన్లు సాధించుకుంటామని ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు.

ఈశ్వరచారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

విశాలాంధ్ర శేరిలింగంపల్లి: తెల్లాపూర్ బీసీ సంఘం ఆధ్వర్యంలో మాజీ ఉపసర్పంచ్ కృష్ణ అధ్యక్షతన తెల్లాపూర్ గద్దర్ సర్కిల్ దగ్గర అమరుడు సాయి ఈశ్వర చారికి ఘన నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ ఈశ్వర చారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. తరతరాలుగా అన్ని పార్టీలు బీసీలను మోసం చేస్తున్నాయి అని అన్నారు. 33% ఉన్న బీసీ రిజర్వేషన్లను కేసీఆర్ ప్రభుత్వం 22 శాతానికి పరిమితం చేసిందని మరియు అలాగే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని మాయ మాటలు చెప్పి గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి గారు కూడా 17% రిజర్వేషన్ కల్పించడం దారుణమైన చర్య అని అన్నారు. బీసీలను వెనుకబాటుకు గురిచేస్తున్న అన్ని పార్టీలను తరిమికొట్టి బీసీల రాజ్యాధికారాన్ని బీసీల ఐక్యమత్యాన్ని నిలుపుకోవాలని బీసీల హక్కులను కాపాడుకోవాలని అంతిమంగా బీసీ బిడ్డలను కాపాడుకోవాలని అన్నారు. అమరుడు సాయి ఈశ్వర చారి గారి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని పిల్లల చదువుల ఖర్చులకు మొత్తం ప్రభుత్వమే భరించాలని, ఆ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని ఎక్స్గ్రేషియా ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ కృష్ణ గారు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మన బీసీల ఓట్లు బీసీ నాయకులకి వేసి ప్రభుత్వానికి బీసీలు అంటే ఏంటో తెలియజేయాలని అన్నారు. వడ్డే నరసింహులు మాట్లాడుతూ బీసీ బిడ్డలు తిరగబడాలని ప్రభుత్వం మెడలు వంచైనా హక్కులను సాధించుకోవాలిన కానీ ఆత్మహత్య చేసుకోకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు పి కుమార్ గౌడ్ మాజీ సర్పంచి తెల్లాపూర్ బేరి రామచంద్ర యాదవ్ బీసీ రాష్ట్ర నాయకులు వడ్డే నర్సింలు మాజీ నీటి సంఘం అధ్యక్షులు భరత్ మాజీ కౌన్సిలర్ శ్రీశైలం మాజీ కౌన్సిలర్ చిలకమర్రి ప్రభాకర్ రెడ్డి మల్లె పల్లి బుచ్చిరెడ్డి ఎల్ రవీందర్ మాజీ కౌన్సిలర్ ఐలేష్ యాదవ్ సంగారెడ్డి జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు శ్రీశైలం చారి తలారి బలరాం పాటి మీది పాండు వడ్డే శ్రీనివాస్ తూర్పు శ్రీనివాస్ బీసీ ఫేడరేషన్ ఆర్కే సాయన్న ముదిరాజ్ సీనియర్, విశ్వకర్మ సంఘం అధ్యక్షులు కృష్ణమూర్తి చారి, ఆర్ సి పురం యాదవ్ సంగం అధ్యక్షులు రాగం రమేష్ యాదవ్, జర్నలిస్ట్ కృష్ణ నర్సింగ్ ముదిరాజ్ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే వంగూరు శ్రీనివాస్ యాదవ్ విజయలక్ష్మి బీసీ రాష్ట్ర ఆర్గనైజ్ సెక్రటరీ హరికృష్ణ చారి అందాల కుమార్ యాదవ్ శివా యాదవ్ గణేష్ యాదవ్ బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొని అమరుడు సాయి ఈశ్వర చారి కి ఘన నివాళులు తెలియజేశారు.

పంచాయతీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - కొత్తగూడెం : పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి పొరపాటు లేకుండా సంపూర్ణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన చండుగొండ మండలంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆర్.ఓలు, ఏఈఓలతో సమావేశమై ఎన్నికల ప్రక్రియలో ప్రతి దశను నియమ నిబంధనలకు అనుగుణంగా అమలు చేయాలని సూచించారు. ఎటువంటి నిర్లక్ష్యం జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు.ఈ సందర్భంగా నిర్వహిస్తున్న రికార్డులను విపులంగా పరిశీలించిన ఆయన, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందస్తుగా పూర్తి చేయాలని ఆదేశించారు. పోలింగ్ సిబ్బంది నుండి పోస్టల్ బ్యాలెట్ జారీ చేసే సమయంలో ఫారం--17, డ్యూటీ ఆర్డర్ కాపీని తప్పనిసరిగా పరిశీలించాలని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ వెనుక రిటర్నింగ్ అధికారి సంతకం స్పష్టంగా ఉండాలన్నారు. అదే లేకపోతే ఆ ఓటు చెల్లదని స్పష్టం చేశారు. అదేవిధంగా బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ మెటీరియల్ పంపిణీ కేంద్రాలలో ఏర్పాటు చేయాల్సిన వసతులు, పోలింగ్ సిబ్బందికి అందించాల్సిన భోజన ఏర్పాట్లు, రూట్‌వారిగా మెటీరియల్ పంపిణీ, రవాణా ప్రణాళికలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికల పోలింగ్ పూర్తయిన తర్వాత ఓట్ల లెక్కింపు, ఉప సర్పంచి ఎంపిక, తిరిగి బ్యాలెట్ బాక్సులు రిసెప్షన్ సెంటర్‌కు పంపిణీ చేసే దశల్లో అత్యంత జాగ్రత్తల తోపాటు భద్రతా చర్యలు పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కలెక్టర్ వెంట ఎంపీడీవో, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకం : శ్రీరామ్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : ప్రస్తుతం జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సూక్ష్మ పరిశీలకుల పాత్ర చాలా కీలకమైందని జిల్లా ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి శ్రీరామ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన గ్రామ పంచాయతీ ఎన్నికల సూక్ష్మ పరిశీలకుల (మైక్రో అబ్జర్వర్ల) శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికలను పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించడంలో సూక్ష్మ పరిశీలకులదే కీలక పాత్ర ఉంటుందన్నారు. మూడు విడతల్లో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆయన తెలిపారు. పోలింగ్‌కు ఒక రోజు ముందుగానే మైక్రో అబ్జర్వర్లు తమ తమ పోలింగ్ స్టేషన్లకు చేరుకుని ఏర్పాట్లను పరిశీలించాలని సూచించారు. పోలింగ్ ప్రారంభానికి ముందు, పోలింగ్ సమయంలో, పోలింగ్ ముగిసిన తరువాత ప్రతి దశలోనూ అన్ని అంశాలు సూక్ష్మంగా పరిశీలించి ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రంలో జరిగే ప్రతి అంశాన్ని నిశితంగా గమనించి, ఎన్నికల నియమావళి ఖచ్చితంగా అమలవుతున్నదో లేదో నిశితంగా చూడాలన్నారు. విషయాల నివేదికను సాధారణ పరిశీలకులకు సమర్పించాలని శ్రీరామ్ ఆదేశించారు. ఎలాంటి అనుచిత చర్యలు, నిబంధనల ఉల్లంఘనలు గమనించిన వెంటనే సాధారణ పరిశీలకుల దృష్టికి తీసుకురావాలన్నారు. జిల్లాలో స్వేచ్ఛా, నిష్పాక్షిక, పారదర్శక ఎన్నికలు జరిగినప్పుడే అధికారులు తమ బాధ్యత సక్రమంగా నిర్వహించినట్లు భావించాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి సాయి కృష?, లీడ్ బ్యాంకు మేనేజర్ రామిరెడ్డి, మైక్రో అబ్జర్వర్లు పాల్గొన్నారు.

కంసాన్‌పల్లిలో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం

విశాలాంధ్ర,షాద్ నగర్, రూరల్: రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం కంసాన్ పల్లి గ్రామంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన రాకతో గ్రామంలో ఎన్నికల సందడి తారస్థాయికి చేరుకుంది. ఎమ్మెల్యే శంకర్ నిర్వహించిన రోడ్‌షో, బహిరంగ సభకు పెద్ద ఎత్తున జనం తరలిరావడంతో కంసాన్ పల్లిలో పండగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి అత్యంత కీలకమైన పలు వరాలను ఎమ్మెల్యే ప్రకటించారు. ముఖ్యంగా గ్రామంలో ఇల్లు లేని నిరుపేదలకు సుమారు 50 ఇళ్లు మంజూరు అయ్యేటట్లు చూస్తానని, ప్రతి ఒక్కరు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించిన ఆయన సమస్య పరిష్కారం కోసం తక్షణమే నిధులు మంజూరు చేస్తామని, ప్రతి గడపకూ ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా చూస్తామని, గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దే బాధ్యత తనదేనని భరోసా ఇచ్చారు. కంసాన్ పల్లి అభివృద్ధికి నిరంతరం కృషి చేసే అభ్యర్థిని శశికళ మహేందర్ ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. ప్రజాసేవకు, పారదర్శక పాలనకు చిహ్నమైన తమ అభ్యర్థి గుర్తు కత్తెర గుర్తుకు ఓటు వేసి, శశికళను గెలిపించి గ్రామంలో పెండింగ్‌లో ఉన్న ప్రతి పని పూర్తి చేసుకోవాలని ఆయన అన్నారు. గతంలో గ్రామానికి సర్పంచ్‌గా సేవలందించిన నరేందర్ రెడ్డి చేసిన విశేష కృషిని ఎమ్మెల్యే శంకర్ ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రస్తావించి అభినందించారు. గతంలో మాజీ సర్పంచ్ నరేందర్ రెడ్డి ఎంతో చిత్తశుద్ధితో పనిచేసి కంసాన్ పల్లికి మంచి గుర్తింపు తీసుకువచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి శేఖర్, వడ్డె కృష్ణ యాదగిరి, చెన్నయ్య, నర్సింలు, సత్యం గౌడ్, కృష్ణయ్య నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సమస్యలు పరిష్కరిస్తా : గొడుగు

విశాలాంధ్ర,- మొయినాబాద్: కేతిరెడ్డిపల్లి గ్రామ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి గ్రామ సమస్యలను పరిష్కరిస్తానని ఉంగరం గుర్తుకు ఓట్లువేసి అత్యధిక మెజారిటితో గెలిపించాలని కేతిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి గొడుగు యాదయ్య కోరారు. సోమవారం గ్రామంలో తన అనుచరులతో కలిసి ఇంటింటికి తిరుగుతూ ఉంగరం గుర్తుకు ఓట్లు వేయాలని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ అభ్యర్థి గొడుగు యాదయ్య మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్నా అభివృద్ధి లక్ష్యంతో ముందుకు వెళ్తానని గ్రామ ప్రజలు ఆశీ ర్వదించాలని ఆయన కోరారు. గ్రామాన్ని అభివృద్ధిపథంలోకి తీసుకెళ్తూ మండలంలో ఆదర్శగ్రామంలో తీర్చిదిద్దుతానన్నారు. గ్రామంలో ప్రజలందరు ఆలోచించి, గ్రామానికి అందుబాటులో ఉంటానని ఆపదవస్తే మీ ఇంటి ముందు నిలబడతా నని సమస్య పరిష్కరిస్తానని, ఓట్లువేసి అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సేవకుడిలా పనిచేస్తా: ఎల్గని

విశాలాంధ్ర - మొయినాబాద్: మండల పరిధిలోని బాకారం గ్రామంలో సర్పంచ్ అభ్యర్థి ఎల్గని వెంకటేష్ గౌడ్ సోమవారం ఇంటింటి ప్రచారం ముమ్మరంగా నిర్వహించారు. ఉంగరం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను ఆయన అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బాకారం గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని అభివృద్ధికి సంక్షేమానికి కృషి చేస్తానని అన్నారు. మీరు నాకు ఒక అవకాశం ఇవ్వండి అని ప్రచారం చేశారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా వారి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. నన్ను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని అనే దృఢ సంకల్పంతో గ్రామ ప్రజలకు సేవ అందించే ఉద్దేశంతో రాజకీయాల్లోకి వచ్చానన్నారు. బాకారం అభివృద్ధి పథంలో ఉంచుతానని గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ ప్రచారంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి : శ్రీనివాస్

విశాలాంధ్ర - మొయినాబాద్: మన తోల్కట్ట గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని సర్పంచ్‌గా ఒక అవకాశం ఇవ్వండని మమత శ్రీనివాస్ ప్రజలను కోరారు. గ్రామంలో అర్హులందరికీ స్కీమ్ లు అందేలా చూస్తాను.. ముఖ్యంగా ప్రజలందరికీ అందుబాటులో ఉంటాను.. 14న జరిగే సర్పంచ్ ఎన్నికల్లో బాల్ గుర్తుకు ఓటు వేసి సర్పంచ్‌గా అవకాశం కల్పించాలని తోల్కట్ట గ్రామ ఓటర్లను కోరారు. సోమవారం మండలంలోని తోల్కట్ట గ్రామంలో ఆమె ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌గా గెలిపించి ప్రజాసేవ చేసే భాగ్యం కల్పించాలని ఓటర్లను వేడుకున్నారు. స్వచ్ఛ గ్రామమే లక్ష్యంగా పనిచేస్తానని మమత శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఈ ప్రచారంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన

విశాలాంధ్ర, మేడిపల్లి: బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అంబేద్కర్ నగర్ క్వార్టర్స్ కాలనీ 12వ డివిజన్‌లో సోమవారం ఉదయం నిర్వహించిన పలు ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ కార్యక్రమాలకు మాజీ స్థానిక కార్పొరేటర్ బొమ్మక్ కల్యాణ్ కుమార్, మేడ్చల్ జిల్లా బి-బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ హాజరయ్యారు. స్థానిక ప్రజల గృహావసరాల పురోగతికి ఈ పథకం మరింతగా సహాయం చేయాలని ఆకాంక్షిస్తూ, భూమిపూజ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ నగర్ క్వార్టర్స్ కాలనీ కమిటి సభ్యులు మరియు వార్డు అధికారులు, ఇందిరా కమిటీ సభ్యులు, కాలనీ నివాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక ప్రజల గృహావసరాల పురోగతికి ఈ పథకం మరింతగా సహాయం చేయాలని ఆకాంక్షిస్తూ, భూమిపూజ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించారు.

పోరాటాల తీవ్రతను పెంచాలి

విశాలాంధ్ర బ్యూరో, మెదక్: మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాల తీవ్రతను పెంచాలని సీఐటీయూ అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ మహాసభ ప్రతినిధులకు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. సోమవారం మెదక్ పట్టణంలో జరుగుతున్న సీఐటీయూ 5వ రాష్ట్ర మహాసభలకు చుక్క రాములు, ఎస్వీ రమ, భూపాల్, జె. మల్లికార్జున్ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా తపన్‌సేన్ ప్రారంభ ఉపాన్యాసం చేశారు. మహాసభలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చేసిన తీర్మానాల సందేశాన్ని కార్మికుడికి చేరేలా తగిన ప్లాన్ చేయాలని సూచించారు. కార్మికులు సృష్టించిన సంపద, ఖనిజాలను కారు చౌకగా కార్పొరేట్లు ప్రభుత్వంలోని వారి ఏజెంట్ల ద్వారా దోచుకుంటున్నారని తెలిపారు. వారికి వ్యతిరేకంగా దేశ కార్మిక వర్గాన్ని ఐక్యం చేయటమే లక్ష్యంగా దిక్కరణ, ప్రతిఘటన అనే నినాదంతో సమరశీల పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం పెరిగిందని చెప్పారు. దేశాన్ని రక్షించుకుందాం-ప్రజలని రక్షించుకుందాం అనే స్ఫూర్తితో తమ మహాసభల్లో తీర్మానాలు చేయాలని సూచించారు. డిసెంబర్ 31 నుండి జనవరి 4 వరకు జాతీయ మహసభలు విశాఖపట్టణంలో జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా పలు తీర్మాణాలు అమోదించారు. జాతీయ కోశాధికారి సాయిబాబా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్జి, వెంకట్లు, కార్యదర్శి ఏ. మల్లేశం పాల్గొన్నారు.

విమాన చార్జీల దోపిడీ ఆపండి

పౌర విమానయాన మంత్రి వెంటనే జోక్యం చేసుకోవాలి

సీపీఐ ఎంపీ సంతోశ్ కుమార్ డిమాండ్

న్యూదిల్లీ: విమాన చార్జీల దోపిడీని ఆపడానికి పౌర విమానయాన శాఖ మంత్రి వెంటనే జోక్యం చేసుకోవాలని రాజ్యసభలో సీపీఐ నాయకుడు పి.సంతోశ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం మంత్రి కె.రామ్మోహన్ నాయుడుకు ఒక లేఖ రాశారు. విమాన చార్జీల నియంత్రణపై మంత్రిత్వ శాఖ వైఖరిలో తీవ్రమైన వైరుధ్యాలను బహిర్గతం చేస్తూ, దోపిడీ ధరల నుంచి ప్రయాణీకులను రక్షించడానికి తక్షణ ప్రభుత్వ చర్యకు ఆయన పిలుపునిచ్చారు. విమాన చార్జీలు పూర్తిగా మార్కెట్ ఆధారితమైనవని, ప్రభుత్వం సుంకాలను నియంత్రించదు లేదా నిర్ణయించదని మంత్రిత్వ శాఖ 24-7-2023న పార్లమెంటుకు తెలియజేసినప్పటికీ, దేశీయ విమానాలకు గరిష్ట చార్జీలను స్పష్టంగా పరిమితం చేస్తూ మంత్రిత్వ శాఖ ఈ నెల 6న ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో 500 కి.మీ వరకు రూట్లకు రూ.7,500 సీలింగ్ ఉంటుందని, చార్జీలు స్థిరీకరించబడే వరకు ఈ పరిమితులు వర్తిస్తాయని ఆ ఉత్తర్వు పేర్కొంది. అయినప్పటికీ ప్రభుత్వం స్థిరమైన ధరలను దేనిగా పరిగణిస్తుందో నిర్వచనాన్ని అందించలేదు. ఇది జోక్యం చేసుకోవడానికి పూర్తి చట్టపరమైన అధికారాన్ని కలిగి ఉండగా కీలకమైన నియంత్రణ స్పష్టతను నిలిపివేయడమేనని ఆయన పేర్కొన్నారు. విమానయాన సంస్థలు గరిష్ట పరిమితులను నిర్ణయించే అధికారాన్ని మంత్రిత్వ శాఖలు ఏర్పాటు చేసినప్పటికీ, ఇటీవల కొనసాగుతున్న సర్వీసుల రద్దు సంక్షోభ సమయంలో విమానయాన సంస్థలు రూ.60,000 వరకు వసూలు చేశాయని తెలిపారు. 6-12.25 ఉత్తర్వుల ప్రకారం, 1,000-1,500 కి.మీ కేటగిరీకి మంత్రిత్వ శాఖలు చార్జీలను రూ.1,5000 కి పరిమితం చేసినప్పటికీ, డీజీసీఏ టారిఫ్ పర్యవేక్షణ విభాగం విమానయాన సంస్థలు తమ స్థిరపడిన టారిఫ్‌లను ఏకపక్షంగా సవరించకుండా నిరోధించడంలో విఫలమైందని, దీని వలన ధరల పెరుగుదల తీవ్రంగా ఉందని సంతోశ్ కుమార్ ఎత్తి చూపారు. పండుగల సమయాల్లో కూడా ఇదేవిధంగా విమాన చార్జీల దోపిడీ సాగుతుండటాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. ఇటీవల విమానయాన రంగంలో కొత్త విశ్రాంతి నిబంధనల అమలు ఫలితంగా వందలాది విమానాలు రద్దు కావడం, తీవ్ర జాప్యం జరగడంతో వేల మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొంటూ, అయితే దీనిపై విమానయాన మంత్రిత్వ శాఖ మౌనంగా ఉండటాన్ని ఆయన విమర్శించారు. దేశ వ్యాప్తంగా అనేక విమానాశ్రయాలలో ప్రయాణికులు నిలిచిపోవడంతో తీవ్ర గందరగోళం చోటుచేసుకుందని సీపీఐ ఎంపీ తెలిపారు. విమానాశ్రయాల టెర్మినళ్లలో ఆహార పదార్థాలు, పానీయాల ధరలను విపరీతంగా పెంచేసి అమ్మడంతో ప్రయాణికులు ఆర్థికంగా నష్టపోయారని అన్నారు. ప్రయాణికుల ఈ ఖర్చులను కూడా వారికి తిరిగి ఇవ్వాలని పేర్కొన్నారు. పౌర విమానయాన మంత్రిత్వ శాఖ స్థిరమైన ఛార్జీలు అంటే ఏమిటో స్పష్టంగా నిర్వహించాలని, ఇప్పటికే వివరించిన చార్జీల పరిమితులను అమలు చేయాలని కోరారు. డీజీసీఏ పరిస్థితిని గమనించడంకంటే నిర్ణయాత్మకంగా వ్యవహరించాలని అన్నారు. మంత్రిత్వ శాఖ ఎటువంటి జాప్యం లేకుండా పారదర్శకతను పునరుద్ధరించాలని, విమానయాన రంగంలో జవాబుదారీతనం తీసుకురావాలని కోరారు. ప్రయాణికులను, విమానయాన సిబ్బంది ఇద్దరినీ రక్షించే ప్రమాణాలకు అనుగుణంగా ప్రైవేటు విమానయాన సంస్థలు ఉండేలా చూడాలని పేర్కొన్నారు.

గంజాయి నిర్మూలించాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య

విశాలాంధ్ర-తిరుపతి: యువతను పెడదోవ పట్టిస్తూ నేర సంస్కృతిని ప్రేరేపిస్తున్న గంజాయి ఇతర మత్తు పదార్థాలను ప్రభుత్వం పూర్తిగా నిర్మూలించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర సమితి అధ్వర్యంలో ప్రచురించిన 'హలో యువత మేలుకో - చెడు వ్యసనాల నుండి నిన్ను నువ్వు కాపాడుకో' వాల్ పోస్టర్ ను బైరాగి పట్టెడ లోని గంధమనేని శివయ్య భవన్‌లో ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన వెంటనే గంజాయి రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దుతామని... గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దే బాధ్యత మాది అంటూ ప్రగల్భాలు పలికిన ప్రస్తుత ప్రభుత్వ పెద్దలు, అధికార పార్టీ నాయకులు నేడు రాష్ట్రంలో వరుస ఘటనలు జరుగుతున్నా ఏమైపోయారనే ప్రశ్న అందరిలోనూ తలెత్తుతున్నదన్నారు. ప్రతిరోజు గంజాయి రవాణా చేస్తూ పట్టుబడుతున్న వార్తలు చదువుతూనే ఉన్నామన్నారు. విశ్వవిద్యాలయాలు మొదలుకొని పాఠశాలల వరకు, మారుమూల గ్రామాలు మొదలుకొని రాష్ట్ర రాజధాని ప్రాంతాలైన విజయవాడ గుంటూరులో సైతం గంజాయి బహిరంగంగా విచ్చలవిడిగా దొరుకుతోందన్నది బహిరంగ రహస్యం అన్నారు. గత ఆరు నెలల్లో గంజాయి, మత్తు పదార్థాల సంబంధిత కేసుల్లో అరెస్ట్ అయిన యువకుల సంఖ్య పెరిగిపోయిందన్నారు. రాజకీయ పక్షాలు వారి స్వార్థ ప్రయోజనాల కోసం యువతని వారి చుట్టూ తిప్పుకోవడానికి మత్తు పదార్థాలకు బానిసలుగా చేస్తున్న పరిస్థితులు నెలకొన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు విద్యార్థులు, యువత గంజాయి వంటి మత్తు పదార్థాల బారిన పడకుండా కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం పోరాడదాం అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మొజ్జాడ యుగంధర్, ప్రధాన కార్యదర్శి పరుచూరి రాజేంద్ర బాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శి గండాల సంతోష్ పాల్గొన్నారు.

ఫిబ్రవరిలో విజయవాడలో ఐజేయూ ప్లీనరీ

బ్రోచర్ ఆవిష్కరించిన మంత్రి పార్థసారథి, ఎంపీ చిన్ని, ఆలపాటి సురేశ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) 11 వ జాతీయ ప్లీనరీ బ్రోచర్ ను సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, లోక్‌సభ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని), సి.ఆర్. మీడియా అకాడమీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ ఆవిష్కరించారు. ఫిబ్రవరిలో ఐజేయూ 11 వ జాతీయ ప్లీనరీ విజయవాడలో జరగనున్నది. దేశం నలుమూలల నుంచి ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్‌కు అనుబంధంగా ఉన్న 27 రాష్ట్రాల వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్లకు చెందిన 350 మంది ఎన్నికయిన ప్రతినిధులు ప్లీనరీకి హాజరుకానున్నారు. ప్లీనరీని విజయవంతం చేయడానికి విజయవాడ పౌర సమాజ ప్రముఖులతో ఇటీవల ఆహ్వాన సంఘం ఏర్పాటయింది. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) చీఫ్ పాట్రన్‌గా, సి.ఆర్. మీడియా అకాడమీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ చైర్మన్‌గా, ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడు ఐ.వి.సుబ్బారావు ప్రధాన కార్యదర్శిగా, యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.జయరాజ్ కోశాధికారిగా ఈ ఆహ్వాన సంఘం ఏర్పాటయింది. ప్లీనరీని పురస్కరించుకుని ప్రచురించ తలపెట్టిన సావనీర్ బ్రోచర్‌ను సోమవారం మంత్రి కార్యాలయంలో ఆవిష్కరించారు. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత విజయవాడలో మరలా ఐజేయూ ప్లీనరీ నిర్వహించడం సంతోషకరమని, ఈ సమావేశాలు విజయవంతం కావాలని మంత్రి పార్థసారథి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐజేయూ సెక్రటరీ జనరల్ డి.సోమసుందర్, ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడు ఐ.వి.సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి కె.జయరాజ్, ఉపాధ్యక్షుడు చావా రవి, విజయవాడ ప్రెస్ క్లబ్ కార్యదర్శి డి.నాగరాజు, ఏపీ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.విజయభాస్కర్, ఉపాధ్యక్షుడు సాంబశివరావు పాల్గొన్నారు.

మళ్లీ అధికారం మనదే

కార్యకర్తలకు స్టాలిన్ భరోసా

చెన్నై: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే విజయం సాధించి తీరుతుందని, మరోసారి అధికారంలోకి వస్తామని ఆ పార్టీ అధ్యక్షులు, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ స్పష్టంచేశారు. ఎన్నికల్లో తమ పార్టీ గుర్తు ఉదయించే సూర్యుడు. ఈ ఉదయించే సూర్యుడు మళ్లీ తమిళనాడును పాలిస్తాడు. 2026 ఎన్నికల రంగంలో చాలామంది ప్రత్యర్థులు, కూటములు ఉన్నప్పటికీ డీఎంకేనే గెలుస్తుందని స్టాలిన్ సోమవారం ధీమా వ్యక్తం చేశారు. డీఎంకే పార్టీ జిల్లా కార్యదర్శుల సమావేశంలో స్టాలిన్ సోమవారం మాట్లాడుతూ 'నేను మిమ్మల్ని ప్రోత్సహించడానికి ఇలా చెప్పడం లేదు. డీఎంకే ద్రవిడ మోడల్ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా మొత్తం 1.86 కోట్ల మంది ప్రయోజనం పొందారు. మన పార్టీ కార్యకర్తలు, లబ్ధిదారుల ఓట్లను పరిగణనలోకి తీసుకోవాలి. మనం సులభంగా వచ్చే ఎన్నికల్లో 2.5 కోట్ల ఓట్లను దాటగలం. 2021లో మన కూటమి 2.9 కోట్ల ఓట్లు సాధించింది. మేము కచ్చితంగా మరిన్ని ఓట్లు పోల్ చేస్తాము. మీ క్షేత్రస్థాయి పనిపై నమ్మకంతో ఉన్నాను. మనం మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాము' అని ఆయన పార్టీ కార్యకర్తల పనిపై నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో సహాయ సామగ్రి, ఆహారం ప్రజలకు ఆలస్యం కాకుండా ఎలా చేరాయో పార్టీ సభ్యులు ప్రజలకు చెప్పాలని స్టాలిన్ అన్నారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియలో డీఎంకే ఎంత కష్టపడి పనిచేసినప్పటికీ 50 శాతమే పూర్తి చేసిందని చెప్పారు. బీజేపీనుద్దేశించి... వారు మనకు వ్యతిరేకంగా ఈడీ, ఆదాయపు పన్ను శాఖ, ఎన్నికల సంఘాన్ని ఉపయోగిస్తారు. వారు అబద్ధాలు వ్యాప్తి చేస్తారు. తప్పుడు చిత్రాలు సృష్టిస్తారు. వాటిని ఎదుర్కోవడానికి మనం మన బలాన్ని సరైన రీతిలో ఉపయోగించాలి. యూనిట్ కార్యదర్శి నుండి రాష్ట్ర ఆఫీస్ బేరర్ల వరకు అందరినీ మనం మై బూత్- మై విక్టరీ బూత్ సమావేశానికి ఆహ్వానించాలి. యూనిట్ కార్యదర్శి నిర్వహించే తేనాంపేట బూత్‌లో జరిగే సమావేశంలో నేను పాల్గొంటాను. పార్టీ మహిళల భాగస్వామ్యాన్ని నిర్ధారించాలి. ఓటర్ల వివరాలను ధృవీకరించడానికి ఇంటింటినీ సందర్శించాలి. మన ప్రభుత్వ విజయాలను ప్రచురించిన కరపత్రాలు పంపిణీ చేయాలి. నేను రాత్రింబవళ్లు పనిచేస్తున్నానని మీకు తెలుసు. మీ నుండి కూడా అదే ఆశిస్తున్నాను. ఒక బూత్ గెలిస్తే.. ఒక నియోజకవర్గాన్ని గెలవగలరు. మీ బూత్ గెలవడం మీకే వదిలేస్తున్నానని కార్యకర్తలకు మార్గనిర్దేశనం చేశారు.

దిల్లీ హైకోర్టులో ఎన్టీఆర్ పిటిషన్

న్యూదిల్లీ: తన వ్యక్తిగత హక్కులకు భంగం కలిగించేలా సోషల్‌మీడియాలో కొందరు వ్యవహరిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతో ప్రముఖ సినీనటుడు ఎన్టీఆర్ దిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ మన్మీత్ ప్రీతమ్ సింగ్ అరోరా సోమవారం విచారణ జరిపారు. ఎన్టీఆర్ వ్యక్తిగత ప్రతిష్ట, హక్కులకు భంగం కలిగించేలా సోషల్‌మీడియా, ఇ-కామర్స్ వేదికలుగా అనేక పోస్టులు వైరల్ అవుతున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ తరపు న్యాయవాది జె.సాయిదీపక్ న్యాయస్థానాన్ని కోరారు. పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన న్యాయస్థానం... 2021 ఐటీ చట్టం ప్రకారం ఆ ఖాతాలపై విచారణ జరిపి మూడు రోజుల్లోగా చర్యలు తీసుకోవాలని సోషల్‌మీడియా సంస్థలను ఆదేశించింది. తదుపరి విచారణను డిసెంబరు 22కు వాయిదా వేసింది. గతంలో బాలీవుడ్ నటుడు అజయ్ దేవగన్‌కు ఇలాంటి పరిస్థితే ఎదురవగా అప్పట్లో కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను న్యాయవాది న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. తెలుగు నటుడు నాగార్జున, బాలీవుడ్ నటులు ఐశ్వర్యరాయ్, అభిషేక్ బచ్చన్, అమితాబ్ బచ్చన్, కరణ్ జోహార్, అనిల్ కపూర్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు శ్రీశ్రీ రవిశంకర్ కూడా గతంలో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

వ్యూహకర్తల వ్యూహాలు ఏమయ్యాయి?

ఇండిగో బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల తీరుపై విమర్శలు

న్యూదిల్లీ: 'ఇండిగో' విమాన కార్యకలాపాల్లో అంతరాయం కొనసాగుతోంది. సోమవారం సైతం 350 విమాన సర్వీసులు రద్దయ్యాయి. ఈ పరిణామాలతో సంస్థ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్‌పై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆ డైరెక్టర్లు మొదటిరోజు నుంచే పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని 'ఇండిగో' ఓ ప్రకటనలో తెలిపింది. సమస్యకు కారణమైన అంశాలపై చర్చలు జరిపినట్లు వెల్లడించింది. ఇండిగో బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ విషయాన్ని పరిశీలిస్తే...

ఇండిగోను 'ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ లిమిటెడ్' అనే మాతృసంస్థ నిర్వహిస్తోంది. బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌లో మొత్తం తొమ్మిది మంది సభ్యులు ఉన్నారు. విమానయానం, ఆర్థిక రంగం, పబ్లిక్ పాలసీ తదితర రంగాల్లో వీరికి అనుభవం ఉంది. సంస్థ రోజువారీ కార్యకలాపాల్లో బోర్డు ప్రత్యక్షంగా జోక్యం చేసుకోనప్పటికీ... వ్యూహాత్మక నిర్ణయాలను పర్యవేక్షిస్తుంది. ప్రస్తుత సంక్షోభం నేపథ్యంలో క్రైసిస్ మేనేజ్‌మెంట్ గ్రూప్‌ని ఏర్పాటు చేసింది. ఈ బోర్డులో విక్రమ్ సింగ్ మెహతా చైర్మన్. ఆయన నాన్ ఎగ్జిక్యూటివ్ ఇండిపెండెంట్ డైరెక్టర్. 1978లో ఐఏఎస్ అధికారిగా తన కెరీర్ ప్రారంభించినప్పటికీ... 1980లో రాజీనామా చేశారు. బ్రూకింగ్స్ ఇన్‌స్టిట్యూషన్ ఇండియా సెంటర్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, షెల్ ఇండియా చైర్మన్‌గా పనిచేశారు. ఎల్ అండ్ టీ, అపోలో టైర్స్ తదితర సంస్థల బోర్డు సభ్యుల్లో ఒకరిగా ఉన్నారు. రాహుల్ భాటియా ప్రమోటర్, మేనేజింగ్ డైరెక్టర్. ఇండిగో సహ వ్యవస్థాపకుడు. ఇంటర్‌గ్లోబ్ ఎంటర్‌ప్రైజెస్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్. కెనడాలోని వాటర్‌లూ విశ్వవిద్యాలయంలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ చేశారు. సంస్థ వ్యూహాలను పర్యవేక్షిస్తారు. 2016లో ఫోర్బ్స్ 'గ్లోబల్ గేమ్ ఛేంజర్స్' జాబితాలో చోటు సంపాదించారు. ఇక పల్లవి శార్దుల్ ష్రాఫ్ సీనియర్ న్యాయవాది. కార్పొరేట్ న్యాయ వ్యవహారాల్లో నిష్ణాతురాలు. 'శార్దుల్ అమర్‌చంద్ మంగళ్‌దాస్ అండ్ కో' అనే న్యాయసేవల సంస్థ మేనేజింగ్ పార్టనర్‌గా ఉన్నారు. కేంద్రం ఏర్పాటు చేసిన కాంపిటిషన్ లా రివ్యూ కమిటీలో ఓ సభ్యురాలిగా సేవలందిస్తున్నారు. అమితాబ్ కాంత్ ఓ మాజీ ఐఏఎస్ అధికారి. ఈ ఏడాది సెప్టెంబరులోనే బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌లో చేరారు. నీతి ఆయోగ్ మాజీ సీఈఓగా విధులు నిర్వహించారు. జీ20 షెర్పాగా వ్యవహరించారు. బీరేందర్ సింగ్ ధనోవా భారత వాయుసేన విశ్రాంత అధికారి. వైమానిక దళంలో వివిధ హోదాల్లో సేవలందించారు. 2019లో బాలాకోట్ వైమానిక దాడుల సమయంలో వాయుసేన అధిపతిగా ఉన్నారు. విమానయానం, రక్షణ రంగాల్లో విస్తృత అనుభవం ఉంది. మైకేల్ జి. విటేకర్‌కు వైమానికరంగంలో 30 ఏళ్లకుపైగా అనుభవం ఉంది. ప్రైవేటు పైలట్‌గా పనిచేశారు. అమెరికా ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్ఏఏ) అడ్మినిస్ట్రేటర్‌గా పనిచేశారు. యునైటెడ్ ఎయిర్‌లైన్స్‌లో సేవలందించారు. అనిల్ పరాశర్ దిల్లీ యూనివర్సిటీ నుంచి ఎకనామిక్స్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ఫెలో మెంబర్‌గా ఉన్నారు. స్విస్‌ఎయిర్‌లో పనిచేశారు. నిధుల సేకరణ, పెట్టుబడిదారుల సంబంధాలు, దీర్ఘకాలిక ప్రణాళికల వంటి కంపెనీ వ్యవహారాల్లో అనుభవం ఉంది. గ్రెగ్ ఆల్బర్ట్ సారెట్స్కీకి విమానయాన రంగంలో 36 ఏళ్లకుపైగా అనుభవం ఉంది. కెనడాకు చెందిన వెస్ట్‌జెట్ ఎయిర్‌లైన్స్‌కు అధ్యక్షుడు, సీఈవోగా పనిచేశారు. అంతకుముందు అలాస్కా ఎయిర్‌లైన్స్‌లో ఉన్నారు. ఆర్థిక వ్యవహారాలు, ప్రజాసంబంధాలు తదితర అంశాలపై పట్టు ఉంది. చివరిగా ఎం.దామోదరన్ ఓ విశ్రాంత ఐఏఎస్ అధికారి. తమిళనాడు తిరుచిరాపల్లిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ వ్యవస్థాపక చైర్మన్. సెబీ చైర్మన్‌గా పనిచేశారు. బ్యాంకింగ్ రంగంలో అనుభవం ఉంది. బయోకాన్ లిమిటెడ్, ఎల్ అండ్ టీ తదితర సంస్థల బోర్డుల్లో ఉన్నారు. ఇంత అనుభవం ఉన్నప్పటికీ ఇండిగో సంక్షోభాన్ని వారు నివారించలేకపోయారు.

చైనా వీసా విధానంలో కీలక మార్పులు

న్యూదిల్లీ: వీసా విధానంలో చైనా కీలక మార్పులను తీసుకొచ్చింది. వీసా దరఖాస్తు విధానాన్ని సరళీకృతం చేసింది. ఇందుకోసం ఈనెల 22న ఆన్‌లైన్ వీసా దరఖాస్తు వ్యవస్థను అధికారికంగా ప్రారంభించనున్నట్లు భారత్‌లోని చైనా రాయబారి క్సూ ఫైహాంగ్ సోమవారం ప్రకటించారు. ఈ కొత్త వ్యవస్థ ద్వారా చైనా వీసా కోసం దరఖాస్తు చేసుకునేవారు ఇకపై ఆన్‌లైన్ సదుపాయాన్ని వినియోగించవచ్చు. అవసరమైన దరఖాస్తు పత్రాలను అప్‌లోడ్ చేయవచ్చు. ఈ మేరకు భారత్‌లోని చైనా రాయబారి ఫైహాంగ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. దరఖాస్తు దారులు పూర్తి వివరాల కోసం సంబంధిత వెబ్‌సైట్‌ను సంప్రదించ వచ్చునని తెలిపారు. ఇందులో వీసా దరఖా స్తుకు సంబంధించిన వివరాలు, ఫారమ్‌లు ఆన్‌లైన్‌లో పొందుపరు చువచ్చునని పేర్కొన్నారు. అంతకుముందు 2025 నవంబరు 26న, చైనా జాతీయులకు పర్యటక, వ్యాపార ప్రయోజనాల కోసం వీసా ప్రక్రియను పునఃప్రారంభిస్తున్నట్లు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఇకపై చైనా జాతీయులకు పర్యాటక వీసా ప్రక్రియ కొనసాగుతుందని విదేశాంగ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మీడియా సమావేశంలో పేర్కొన్నారు.

వైద్యారోగ్య శాఖలో ఖాళీలు భర్తీ చేయాలి

ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : వైద్యారోగ్య శాఖలో ఖాళీలను భర్తీ చేయాలని ఏఐటీయూసీ అనుబంధ ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.గిరిబాబు, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నాయకులు ఒక ప్రకటన విడుదల చేశారు. అదనంగా స్టాఫ్ నర్సులు పోస్టు మంజూరు చేయవలసిన అవసరం ఉందన్నారు. సెకండరీ హెల్త్ విభాగంలో ల్యాబ్, రేడియాలజీ సర్వీస్‌లలో షిఫ్ట్ డ్యూటీలు అమలు చేయాలని, వైద్య విభాగంలో ఖాళీగా ఉన్న ల్యాబ్ టెక్నిషియన్, ఫార్మసిస్ట్ పోస్టులు, ఇతర కేటగిరీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఈ శాఖలోని కింది స్థాయి నుంచి వచ్చే సమస్యలను పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆస్పత్రులలో, వైద్య కళాశాలల్లో టీచింగ్ ఆస్పత్రులు గణనీయంగా పెరిగాయని, తద్వారా ప్రొఫెసర్లు, వైద్యులు, పారా మెడికల్, నర్సింగ్ సిబ్బంది అవసరం పెరిగినట్లు వారు వివరించారు. హెచ్ఓడీ కార్యాలయంలో ఉద్యోగులకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి అర్జీలను ఈ-ఫైల్ విధానంలోకి తీసుకొచ్చి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

జపాన్‌లో భారీ భూకంపం

టోక్యో: ఉత్తర జపాన్ తీరంలో సోమవారం శక్తివంతమైన భూకంపం సంభవించింది. దాంతో సునామీ హెచ్చరికలు జారీ చేసినట్లు జపాన్ వాతావరణ సంస్థ పేర్కొంది. తీర ప్రాంత నగరమైన అమోరికి సమీపంలోని హక్కైడో తీరంలో రిక్టర్ స్కేల్‌పై 7.6 తీవ్రతతో భూకంపం సంభవించినట్లు తెలిపింది. సముద్ర ఉపరితలం నుంచి 50 కిలోమీటర్ల దిగువన భూకంప కేంద్రాన్ని గుర్తించినట్లు తెలిపింది. దాంతో జపాన్ పసిఫిక్ తీర ప్రాంతంలో సునామీ హెచ్చరికలు జారీ అయ్యాయి. ఈశాన్య తీరాన్ని 10 అడుగుల ఎత్తు వరకు అలలు ఎగిసిపడే అవకాశం ఉందని పేర్కొంది. ఉత్తర జపాన్ అంతటా హక్కైడో, అమోరి, ఇవాటేతో సహా అనేక ప్రాంతాలు సునామీ హెచ్చరికలు జారీ అయ్యాయి. ఈ ప్రాంతంలో అణు విద్యుత్ కేంద్రాలు ఉండడంతో హెచ్చరికలు జారీ అయ్యాయి. ఈ ప్రాంతంలో అణు విద్యుత్ ప్లాంట్ల భద్రతా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పబ్లిక్ బ్రాడ్‌కాస్టర్ ఎన్‌హెచ్‌కే పేర్కొంది. భూకంపం కారణంగా ఇప్పటి వరకు ఏమైనా నష్టం జరిగిందా? అన్న వివరాలు మాత్రం తెలియరాలేదు.

ఎస్ఆర్ఎంలో కెమికల్ బయాలజీపై అంతర్జాతీయ సదస్సు

విశాలాంధ్ర-మంగళగిరి: ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ కెమిస్ట్రీ విభాగం అధ్వర్యంలో సోమవారం ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ కెమికల్ బయాలజీ అంశంపై అంతర్జాతీయ సదస్సు జరిగింది. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సుకు దేశ విదేశాల నుంచి పేరున్న శాస్త్రవేత్తలు, పరిశోధనా రంగ నిపుణులు, యంగ్ స్కాలర్స్ హాజరయ్యారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య సీహెచ్ సతీష్ కుమార్ సదస్సును ప్రారంభించి శాస్త్రవేత్తలను ఉద్దేశించి ప్రసంగించారు. జీవ రసాయన శాస్త్రంలో నూతన ఆవిష్కరణల కోసం కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ రసాయన శాస్త్రం విభాగం ఏర్పాటు చేసిన సదస్సు ప్రాధాన్యతను వివరించారు. ఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ స్కూల్ డీన్ డాక్టర్ సీవీ టామి యూనివర్సిటీలోని ఇంటర్ డిసిప్లినరీ ఎంగేజ్‌మెంట్ విలువను వివరించారు. ఈటీసీబీ వంటి సదస్సులు శాస్త్రవేత్తల పరిశోధనా సామర్థ్యాలను పెంచేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. యూనివర్సిటీ రీసెర్చ్ డీన్ డాక్టర్ రంజిత్ థాపా జన రసాయన శాస్త్రంలో పెరుగుతున్న పరిశోధనలు, వాటి ప్రాధాన్యతలను వివరించారు. ఈ సందర్భంగా కాన్ఫరెన్స్ అబ్స్ట్రాక్ట్ బుక్‌ను ఆవిష్కరించారు. ఈ సదస్సులో కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ సభ్యసాచి చక్రవర్తి, కార్యక్రమం కన్వీనర్ డాక్టర్ ఎల్లి పెల్లి సతీష్, డాక్టర్ రాజసాండ్యన్, బెంగళూరు ఐఐఎస్సీ నుంచి విచ్చేసిన ప్రొఫెసర్ రాఘవన్ వరదరాజన్, ప్రొఫెసర్ హరినాథ్, ప్రొఫెసర్ సోను వేణుగోపాలరావు, డాక్టర్ వెంకట శ్రీకాంత్ పాల్గొన్నారు.

పరకామణి నేరస్తుడికి అండగా జగన్

మంత్రి మండిపల్లి ఆరోపణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పరకామణిలో దొంగతనం చేసిన వ్యక్తి పశ్చాత్తాపంలో ఉంటే... జగన్ మాత్రం ఆ దొంగతనాన్ని చిన్న తప్పుగా వాదించడం విడ్డూరంగా ఉందని రాష్ట్ర రవాణా, యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి విమర్శించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. పరకామణి కేసులో ఎవర్ని రక్షించడానికి జగన్ ప్రయత్నిస్తున్నాడని రాం ప్రసాద్‌రెడ్డి ప్రశ్నించారు. పరకామణి చిన్న చోరీ అంటున్న జగన్... ఆ కేసు గురించి అంతలా ఎందుకు స్పందిస్తున్నారో చెప్పాలన్నారు. జగన్ చేసిన పాపాలు ఆ పార్టీని వెంటాడుతున్నాయని, వాటి నుంచి బయటపడడానికి జగన్ ఆపసోపాలు పడుతున్నారన్నారు. పరకామణి కేసులో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధిగా ఉందని, తప్పు చేసిన ఎవరినీ విడిచిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ఎవరిని కాపాడడానికి జగన్ ప్రయత్నిస్తున్నారని మంత్రి ధ్వజమెత్తారు. ఈ కేసులో ఫిర్యాదుదారుడు సీఐ సతీశ్ కుమార్ ఎలా చనిపోయారనే దానిపై విచారణ కొనసాగుతోందని, దీనిపై అన్ని విషయాలు బయటకు వస్తాయన్నారు. జీవితాంతం సీఎంగా ఉంటానని గొప్పలు చెప్పుకున్న జగన్‌కు కనీసం ప్రతిపక్ష హోదా సైతం దక్కలేదని ఎద్దేవా చేశారు. గంజాయి సరఫరాదారులను జగన్ వెనుకేసుకు రావడం బాధాకరమన్నారు. విశాఖకు చెందిన గంజాయి సరఫరాదారుడు కొండారెడ్డికి జగన్ అండగా ఉన్నారని ఆరోపించారు.

ఎలైట్ క్రికెట్ లీగ్ జెర్సీ, పోస్టర్ ఆవిష్కరణ

చామల ఫౌండేషన్ అధ్వర్యంలో ఎలైట్ క్రికెట్ లీగ్ నిర్వహణలో భాగంగా జెర్సీ పోస్టర్‌ను మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆవిష్కరించారు. విశాఖపట్నంలోని ఏసీఏ, వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో జరగనున్న ఈ లీగ్‌ను రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి మైలురాయిగా మంత్రి అభివర్ణించారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించేందుకు వినూత్న కార్యక్రమాలు చేపడుతోందని, యువతకు క్రికెట్ సహా అన్ని క్రీడలలో అవకాశాలు పెంచేందుకు కట్టుబడి ఉందన్నారు. ఎలైట్ క్రికెట్ లీగ్ యువ క్రీడాకారులకు మంచి వేదికగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈసీఎల్ చైర్మన్, ఫౌండర్ చామల ఉదయ్ చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ చామల భానుచంద్రారెడ్డి, సహ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ ఎం.రవీంద్రారెడ్డి, ఎం.సుధీర్, ఈ.విజయ్‌రెడ్డి, శివారెడ్డి, నరేశ్‌రెడ్డి, సాయి పాల్గొన్నారు.

రష్యా, భారత్‌తో కలిసి పని చేస్తాం: చైనా

బీజింగ్: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత్ పర్యటనపై చైనా సానుకూలంగా స్పందించింది. భారత్, రష్యా, చైనాలు గ్లోబల్ సౌత్‌లో ముఖ్యమైన భాగమని చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి గువో జియాకున్ పేర్కొన్నారు. బీజింగ్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. చైనా, రష్యా, భారత్ మధ్య ఉన్న సంబంధాలు ప్రాంతీయ, ప్రపంచ శాంతి, సుస్థిరత కోసం దోహదపడతాయన్నారు. గ్లోబల్ సౌత్‌లో ఈ మూడు అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలని స్పష్టం చేశారు. బీజింగ్- మాస్కో మధ్య సన్నిహితమైన, బలమైన సంబంధాలు ఉన్నాయి. వీటిని పరిగణనలోకి తీసుకుని పుతిన్ భారత్ పర్యటనను నిశితంగా పరిశీలించామని గువో జియాకున్ తెలిపారు. అంతేకాదు రష్యా, భారత్‌లతో కలిసి పనిచేయడానికి చైనా సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. కాగా, పుతిన్ భారత్ పర్యటనకు ముందు ఇచ్చిన ఇంటర్వ్యూలో కీలక వ్యాఖ్యలు చేశారు. 'భారత్, చైనాలు తమకు అత్యంత సన్నిహిత మిత్రదేశాలు. మేము ఆ బంధాన్ని ఎంతో విలువైనదిగా భావిస్తాం' అని అన్నారు. అంతేకాదు ఓ భారతీయ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో భారత్, చైనా నాయకులు తమ సమస్యలకు పరిష్కారాలను కనుగొనడానికి కట్టుబడి ఉన్నాయని అన్నారు. అయితే ఈ ఇరుదేశాల ద్వైపాక్షిక వ్యవహారాల్లో జోక్యం చేసుకునే హక్కు రష్యాకు లేదని పేర్కొన్నారు. కాగా, భారత్‌తో స్థిరమైన, బలమైన సంబంధాన్ని ఏర్పరుచుకునేందుకు చైనా సిద్ధంగా ఉందని గువో జియాకున్ తెలిపారు. "భారత్, చైనా మధ్య ద్వైపాక్షిక సంబంధాలను వ్యూహాత్మకంగా, దీర్ఘకాలిక దృక్పథంతో నిర్వహించడానికి చైనా సిద్ధంగా ఉంది. అలాగే ఇరుదేశాలకు, వారి ప్రజలకు ప్రయోజనం చేకూర్చే స్థిరమైన, బలమైన అభివృద్ధిని ప్రోత్సహించడానికి కూడా మేము సిద్ధంగా ఉన్నాం. ఆసియాకు, అంతకు మించి ప్రపంచ శాంతి, శ్రేయస్సు కోసం తగిన సహకారం అందించడానికి, భారత్‌తో కలిసి పనిచేయడానికి చైనా సిద్ధంగా ఉంది" అని గువో జియాకున్ అన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.

యువతకు రాజకీయంలో అవకాశం కల్పించాలి : పూనెం కృష్ణ

విశాలాంధ్ర - భద్రాచలం : రాజకీయాల్లో యువతరం ప్రవేశించినప్పుడే ఆయా పార్టీల భవిష్యత్తు ఉంటుందని భద్రాచలం పంచాయితీలో కాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్న సర్పంచ్ అభ్యర్థి పూనెం కృష్ణ అంటున్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసి విజయం కోసం అందరి ఆట దండలు కోరుతున్నానని ప్రజలు కూడా యువతరాన్ని ప్రోత్సహించాలని అభ్యర్థిస్తున్నారు. తనతోపాటు పదో 13వ వార్డు అభ్యర్థి గా యువకుడైనా తాటి ఉదయ్ కుమార్ పోటీలో ఉన్నాడని సోమవారం జరిగిన సమావేశంలో తెలిపారు. ఈనెల 11న జరగబోయే స్థానిక గ్రామ పంచాయతీ ఎన్నికల్లో యువకులైన తమను స్థానిక ప్రజలు గెలిపించాలని అభ్యర్థించారు. కాంగ్రెస్ పార్టీ పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలతో పాటు గ్రామాల్లో పట్టణాల్లో సమగ్ర అభివృద్ధి చూసి తమను గెలిపించాలని కోరుతున్నారు. రాజకీయాల్లో కేవలం స్వార్థం కోసం కాకుండా నిజాయితీగా ప్రజలకు జవాబుదారితనంతో కూడిన సేవలను అందించేందుకు ముందుకు వచ్చా మన్నారు. తనకు కేటాయించిన గుర్తు కత్తెర గుర్తు కు ఓటేయాలని కృష్ణ కోరారు. అదేవిధంగా గౌను గుర్తు కేటాయించిన పదవ 13 వ అభ్యర్థి ఉదయ్ కుమార్ ను మెజారిటీ కోట్లతో గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. భద్రాచలం పట్టణ అభివృద్ధి కోసం ఏమాత్రం అవినీతికి తావు లేకుండా రాత్రి ప్రగరు శ్రమిస్తామని భరోసా ఇస్తున్నారు. ముఖ్యంగా పట్టణ యువతరం తమకు అండగా నిలిచి రాజకీయాల్లో కొత్తతరానికి నాంది పలకాలని కోరుతున్నారు.

ముచ్చటగా మూడోసారి బరిలో చందు నాయక్

విశాలాంధ్ర - బూర్గంపాడు : గతంలో సారపాక గ్రామంలో తాను చేసిన అభివృద్ధే తన విజయానికి దోహదం చేస్తుందని సర్పంచ్ అభ్యర్థిగా బరిలో ఉన్నదారావత్ చందు నాయక్ అన్నారు. ఆదివారం ఆయన ప్రచారంలో భాగంగా మాట్లాడారు. తలపై ఎవరిని దుష్ప్రచారాలు చేసిన ప్రజలకు తానేంటో తెలుసన్నారు. స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగుతున్నానని చెప్పారు. ప్రజల ఆశీస్సులతో మూడోసారి కూడా తానే గెలుస్తానన్నారు. సారపాక పారిశ్రామిక ప్రాంతానికి 'మినీ ఇండియా'గా పేరువుందన్నారు. దింతో ఈ ప్రాంతంలోని సర్పంచ్ పదవి కీలకంగా మారింది. గతంలో చందు నాయక్ రెండు తపాలు సర్పంచ్గా చేశారు. ముచ్చటగా మూడోసారి కూడా బరిలో వున్నారు. ప్రభుత్వం రిజర్వేషన్ను పూర్తి చేసిన వెంటనే చందు నాయక్ తన అజెండాను ఖరారు చేస్తూ ఎన్నికల రంగంలో చురుకుదనం పెంచారు. ఈసారి కూడా స్వతంత్ర అభ్యర్థిగా ప్రజాదరణతో విజయం సాధిస్తానని ధీమాలో ఉన్నారు.

గుండాల సర్పంచ్ అభ్యర్థి బికోజికి సిపిఐ మద్దత్తు

సమిష్టి కృషితో గెలిపించుకుందాం : సిపిఐ నేత రమేష్

విశాలాంధ్ర - గుండాల : మండల కేంద్రం గుండాల మేజర్ పంచాయితిలో సర్పంచ్ అభ్యర్థి వాంకుడోతి బికోజి అలియాస్ అజయ్ ని సమిష్టి కృషితో గెలిపించుకుందామని సిపిఐ మండల కార్యదర్శి వాగబొజన రమేష్ అన్నారు. బికోజి ని కాంగ్రెస్ పార్టీ బలపరుస్తూ ఎన్నికల బరిలో దింపింది. బికోజీ కి తమ సిపిఐ పార్టీ పూర్తిస్థాయిలో మద్దతు ఇస్తున్నట్లు సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రమేష్ ప్రకటించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు షేక్ ఖదీర్ తో కలిసి ఆయన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ బికోజి గెలుపు కోసం మా పార్టీ తరపున శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పొత్తు ధర్మాన్ని త్రికరణ శుద్ధితో అమలు చేస్తామన్నారు. సిపిఐ నాయకులు, కార్యకర్తలు సానుభూతి పరులు బికోజి గెలుపు కోసం శ్రమించాలని కోరారు. కాంగ్రెస్ నేత ఖదీర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతొ ప్రజలు సంతృప్తిగా ఉన్నారని తెలిపారు. మండలంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చేసిన అభివృద్ధి పనులు కూడా తమ అభ్యర్థి గెలుపుకు దోహదం చేస్తాయ న్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేపట్టిన వెంటనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, పేదలు, దిగువ మధ్యతరగతి ప్రజల ఇళ్లకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ లాంటి పథకాలు అమలు చేసిందన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆర్థిక వెసులుబాటు కలిగించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. సిపిఐ పార్టీ తమ అభ్యర్థికి మద్దతు తెలప దంతో గెలుపు ఖాయంగా మారిందన్నారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఎలాంటి ఆపాహాలకు గురికాకుండా అధిష్టానం సూచనలు, పార్టీ జిల్లా నాయకత్వం ఆదేశాల మేరకు సైనికుల్లా పని చేసి తమ అభ్యర్థితో పాటు వార్డు సభ్యులను గెలిపించుకోవాలని కోరారు. ఈ సమావేశంలొ బచ్చుల రామయ్య, దారా అశోక్,షేక్ఖదీర్,షేక్అబ్దుల్నబి, కాశీం,పొంబోయిన ముత్తయ్య పాల్గొన్నారు.

కొమ్ముగూడెంలో క్షుద్ర పూజల హల్చల్..!?

ఒక పార్టీ నాయకుడు పూజలు చేస్తున్నట్లు ప్రచారం.. పోలీసులు అనుమానాలు తెల్చాలి

విశాలాంధ్ర, దమ్మపేట : దమ్మపేట మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో ఒక పార్టీకి చెందిన నాయకుడు క్షుద్ర పూజలు చేస్తున్నట్లు ప్రచారం జరిగి సర్వత్ర కలకలం చెలరేగింది. గ్రామంలో ఎవరికీ తెలియకుండా రహస్యంగా పూజలు చేస్తున్నాడని ప్రతిపక్ష నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ ప్రచారం స్థానిక ప్రజల్లో తీవ్ర భయాందోళనలు రేకెత్తిస్తుంది. పక్కాగా ఏజెన్సీ ప్రాంతాలైన ఇక్కడి పల్లెటూరి జనాల్లో క్షుద్ర శక్తులు, మూఢ నమ్మకాలపై చాలా బలమైన ప్రభావం ఉంటుంది. పైగా స్థానిక సంస్థల ఎన్నికల జోరు ఊపందుకుంటున్న నేపథ్యంలో క్షుద్ర పూజల వదంతులు పల్లె జనాల్లో భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. సదరు వ్యక్తి ప్రతిపక్ష పార్టీలకు చెందిన సర్పంచ్, వార్డు సభ్యులు ఓటమి కోసం క్షుద్ర పూజలు చేస్తున్నట్లు మరో ప్రచారం జరుగుతుంది. లేదు.. లేదు.. ప్రతిపక్ష నేతలను హతమార్చడానికి మంత్రాలతో క్షుద్ర పూజలు చేస్తున్నట్లు కొందరు వదంతులు రేపుతున్నారు. ఇలాంటి వదంతులపై వాస్తవాలు నిగ్గుదేల్చేందుకు పోలీసులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. మంత్రాల ఆరోపణలు ఎదు ర్కొంటున్న సదరు నాయకుడు గతంలోనూ వివాదాస్పద వ్యక్తిగా చరిత్ర ఉందంటున్నారు. తన లాభం కోసం ఏదైనా చేస్తాడనే పేరు ఉందనీ అంటున్నారు. గతంలో నకిలీ భూ పాస్ పుస్తకాలు సృష్టించి బ్యాంకుల్లో డబ్బులు కాజేసిన కేసులో ఆయన జైలుకు వెళ్లి వచ్చాడని స్థానిక ప్రజలు కొందరు చెప్తున్నారు. అలాంటి వ్యక్తిపై ఇప్పుడు క్షుద్ర పూజలు ఆరోపణలు వస్తున్నాయి. జనాల్లో ఉన్న మూఢ అంత విశ్వా సాలను అడ్డు పెట్టుకుని ఇలాంటి నాటకాలు ఆడుతుంటారని విజ్ఞులు విమర్శిస్తున్నారు. ఈ ప్రచార క్రమంలో పొరపాటున ఏ అరిష్టం జరిగినా, యాదృఛికంగా ఈ గ్రామంలో ఏ విషాద ఘటన జరిగినా... అతని క్షుద్ర పూజల వల్లే" అని అనుమానించే ప్రమాదం ఉంది. దీంతో ఏ పరిణామమైన చోటు చేసుకునే అవకాశం ఉంది. అందుకే పోలీసులు కలగజేసుకొని ఈ ప్రచారం ఎవరు, ఎందుకు చేస్తున్నారో.. లేదా సదరు వ్యక్తి కావాలని జనాలను భయపడుతున్నాడా విచారించాల్సిన అవసరం ఉంది.

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

బ్యాట్ గుర్తుపై ఓటు వేసి గెలిపించండి

బోనకల్ కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి భూక్యా మంగమ్మ

బోనకల్, విశాలాంధ్ర: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని, అఖిలపక్ష పార్టీల మద్దతుతో బోనకల్ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా బరిలో నిలిచిన మంగమ్మ అన్నారు. కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి భూక్యా మంగమ్మ గెలుపే లక్ష్యంగా ఆ పార్టీ శ్రేణులు బోనకల్ లో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు.

కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి దంపతులు శ్రీమతి భూక్యా మంగన్న, బీపీ నాయక్ లు మాట్లాడుతూ అభివృద్ధిలో పోటీపడి గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందామని, సంక్షేమ పథకాలు అందరికీ అందేలా చూస్తామని ఒక్కసారి సర్పంచిగా అవకాశం కల్పిస్తే అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ప్రచారంలో భాగంగా బ్యాట్ గుర్తుకు తమ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. గ్రామంలో సిసి రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ పునరుద్ధరణ, నిరంతర విద్యుత్ సరఫరా పై ప్రత్యేక దృష్టి, వీధి దీపాలు, ప్రజా ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి, ఉచిత ఆరోగ్య శిబిరాలు, ప్రభుత్వ విద్యపై ప్రత్యేక దృష్టి, పాఠశాలల అభివృద్ధి చేయడం, పాఠశాలలో చదివి విద్యార్థులకు నగదు పారితోషకాలు, అంగన్వాడీల అభివృద్ధి, మహిళల శ్రేయస్సు కోసం ప్రత్యేక చర్యలు, శాంతి భద్రతల కమిటీలు ఏర్పాటు, ప్రతి కుటుం బానికి ప్రభుత్వ పథకాలు అందేలా కృషి, మధిర ఎమ్మెల్యే, రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్ర మార్క సహకారంతో గ్రామానికి అవసరమైన నిధులు తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు. తమ బిడ్డగా, విద్యావంతురాలిగా, ఒక సేవకు రాలిగా అవకాశం కల్పించాలని అందరికీ అందు బాటులో ఉంటూ నిస్వార్థ సేవ చేస్తామన్నారు. గ్రామ ప్రజల ఆశీస్సులు యువత సహకారాన్ని అందించి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమం లో మండల కాంగ్రెస్ అధ్యక్షులు గాలి దుర్గారావు. చాప వెంకటేశ్వరరావు. పోటు వెంకటేశ్వర్లు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ముఖ్య నాయకులు పాల్గొన్నారు

సిపిఐ బలపరిచిన అభ్యర్థులను గెలిపించండి : ఎల్లయ్య

విశాలాంధ్ర, ఆళ్లపల్లి : నిరంతరం ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజాక్షేత్రంలో ఉంటూ పోరాడే సిపిఐ పార్టీ బలపరిచిన అభ్యర్థులను స్థానిక ఎన్నికల్లో గెలిపించాలని ఆళ్లపల్లి మండల మాజీ వైస్ ఎంపీపీ రేసు ఎల్లయ్య ప్రజలను కోరారు. ఏజెన్సీ ప్రాంతమైన ఆళ్లపల్లిలో ఆయన సిపిఐ నాయకులు కార్యకర్తలు తోడు తీసుకొని విస్తృతంగా ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. సిపిఐ సర్పంచ్ అభ్యర్థి మెస్ మమత ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. అదేవిధంగా పోటీలో ఉన్న వార్డు సభ్యుల విజయమే లక్ష్యంగా ఆయన కాలికి బలపం కట్టుకుని తిరుగుతున్నారు. ఆయనకు స్థానికంగా ప్రతి ఇల్లు, ప్రజలతొ సుదీర్ఘకాలంగా సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. దీంతో ఇళ్లకు వెళ్లి ప్రజలతో మమేకమై సాధారణ వ్యక్తిగా ఆయన శ్రమిస్తున్న తీరు స్థానికంగా ప్రజలను ఆకట్టుకుంటుంది. ఎల్లయ్య తన జీవితకాలం ప్రజల కోసమే పనిచేస్తూ వచ్చారు. ఈ రాజకీయ నేపథ్యంలో ఎన్నో ఆటుపోట్లు తట్టుకొని నిలబడ్డారు. అభ్యర్థుల మాట అంటుంచి ఎల్లయ్య వ్యక్తిత్వం, సమస్యలపై పట్టుదల, త్యాగాలు స్థానిక ప్రజలకు బాగా తెలుసు. ఈ నేపథ్యంలో ఆయన ప్రచారంలో దిగడంతో అభ్యర్థుల గెలుపుకు ఎంతో దోహదం చేయనుంది. అందులోను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సిపిఐ పార్టీ కార్యదర్శి ఎస్ కె. సాబీర్ పాషా గ్రామం కూడా రాళ్లపల్లి కావడంతో ఇక్కడ ఎన్నికపై చాలా ప్రతిష్ట నెలకొంది. ఈ గ్రామానికి చెందిన సాబీర్ పాషాకు గ్రామంలోని ప్రతి గడపతో రాజకీయంగానే కాక ఆత్మీయ సంబంధాలు ఉన్నాయి. ఈ గ్రామంలో అధిక శాతం మంది ఏ కష్టం వచ్చినా రాజకీయాలకతీతంగా సాబిర్ పాషా దృష్టికి తెలియజేస్తుంటారు. ఆయన వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరిస్తాడని మంచి మనిషిగా ఆ గ్రామంలో పేరు ఉంది. ఈ పరిణామాలు కూడా అభ్యర్థుల గెలుపుకు అవకాశాలు కల్పిస్తున్నాయి. నిరంతరం ప్రజల్లో ఉండే ప్రజల కోసం పనిచేసే తమ సిపిఐ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని సాబిర్ పాషా స్థానికులను కోరుతున్నారు. ఇంటింటి ప్రచార కార్యక్రమాల్లో వార్డు అభ్యర్థులు చింత సునీత, గౌరబోయిన సీత, గలిగ ప్రశాంతి, తాటి సంధ్యారాణి, కుంట సహదేవ్, మండల మాజీ ఉపసర్పంచ్ గుంతోజు సదానంద చారి, మద్దెల వెంకటేశ్వర్లు, కుంట సహదేవ్, ఇమ్మాని యేల్, శివ, శ్రీరామ్, హరీష్, బిక్షం, రాంబాబు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొంటున్నారు.

పంచాయతీ ఎన్నికల నిబంధనలు అందరూ పాటించాలి

భట్టుపల్లిలో అవగాహన కార్యక్రమం
సీఐ, ఎస్ఐ వెంకటేశ్వరరావు, పీవిఎన్ రావు

విశాలాంధ్ర - కరకగూడెం : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఎటువంటి ఘర్షణలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు సహకరించాలని ఏడుల్ల బయ్యారం సిఐ వెంకటేశ్వరరావు, కరకగూడెం ఎస్ఐ పీవీఎన్ రావు కోరారు. సోమవారం కరకగూడెం మండలంలోని భట్టుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఎన్నికల నేపథ్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎలాంటి ఘర్షణలు తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామ ప్రజల తో మమేకమై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునే విదంగా పోలీస్ శాఖ అండగా ఉంటుందన్నారు. ఎన్నికల సందర్భంగా ఎంతటి వారైనా సరే నియమావళిని అనుసరించాలని కోరారు. లేకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలలో వద్ద, ప్రధాన సెంటర్లలో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాదం కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ ఎస్, 144 సెక్షన్ లు అమలులో ఉన్నాయని ఎవరు కూడా గుంపులుగా ఉండరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మంచి సేవలు అందించడానికే బస్తీ దవాఖానాఏర్పాటు

జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారి డా. డి. రామారావు

విశాలాంధ్ర- ఖమ్మం: పట్టణంలోని పాండు రంగాపురం బస్తీ దవాఖానను జిల్లా జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారి డా.డి.రామారావు ఆకస్మికంగా సందర్శించి డా.ఎం.అనిరుధ్, నర్సింగ్ ఆఫీసర్ శ్రీలత, సపోర్టింగ్ స్టాఫ్ శ్రీహరిల అటెండెన్స్ ను పరిశీలించారు. సిబ్బంది సక్రమంగా విధులు నిర్వర్తించాలని, సమయపాలన పాటించాలని, ప్రతిరోజు వచ్చే పేషంట్ల సంఖ్యను క్రమంగా పెంచాలని తెలిపారు. సికిల్ సెల్ పేషంట్లను గుర్తించి వారిని పోర్టల్ లో నమోదు చేయాలనీ, ప్రతినెలా వారికి తప్పనిసరి మందులను అందించాలని తెలిపారు. ఓ.పి, ల్యాబ్, ఏ.ఎన్.సి, డ్రగ్ స్టాక్, మెడిసిన్ ఇండెంట్, ఐ.పి, రెఫరల్ రిజిస్టర్లను డా.డి.రామారావు పరిశీలించారు. అనంతరం యూ.పి.హెచ్.సి. మామిళ్లగూడెంను సందర్శించి వైద్య సేవలు, లాబోరేటరీ సేవలు, ఓ.పి. సేవలను పరిశీలించి డా.కృష్ణ చైతన్య కు తగు సలహాలు అందించారు. ల్యాబ్ టెక్నీషియన్ శ్రీఫణి విధుల్ని పరిశీలించారు. ప్రజలకు మెరుగైన, సమయానుకూలమైన ఆరోగ్య సేవలు అందేలా ప్రతి విభాగం సమర్ధవంతంగా పనిచేయాలని ఆయన సూచించారు.

సమిష్టి కృషితో టార్గెట్స్ సాధిద్దాం

రక్షణతో కూడిన ఉత్పత్తికి పాటుపడాలి

ఏరియా జీఎం రామచందర్

విశాలాంధ్ర - మణుగూరు : సింగరేణిలో అధికారులు, కార్మికులు సమిష్టి కృషితో ఈ ఆర్థిక సంవత్సరంలో తమ ఏరియాకు కేటాయించిన టార్గెట్ ను సాధిద్దామని ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ సూచించారు. సోమవారం మణుగూరు ఓపెన్ కాస్ట్ (ఓసి) లో నిర్వహించిన 56వ రక్షణ పక్షోత్సవాల సందర్భంగా తనిఖీ కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమాలకు రామచందర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రక్షణ ప్రమాణాలను పాటిస్తూ ఉత్పత్తి లక్ష్యాలు అందుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సేఫ్టీ మేనేజ్ మెంట్ ప్లాన్, స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ను కచ్చితంగా అనుసరిస్తూ ప్రతి కార్మికుడు వ్యక్తిగత రక్షణ పరికరాలను విధిగా ధరించే అలవాటు చేసుకోవాలన్నారు. అడ్డదారులు, నిర్లక్ష్యం ప్రమాదాలకు ప్రధాన కారణమన్నారు. పనిస్థలంలో ఎల్లప్పుడూ అప్రమత్తత అవసరమని ఆయన సూచించారు. విశిష్ట అతిథి, రక్షణ తనిఖీ బృందం కన్వీనర్ జె.వి. రమణ (జిఎం, క్వాలిటీ మేనేజ్మెంట్) మాట్లాడుతూ పరికరాలపై నైపుణ్యత, శిక్షణ, క్రమశిక్షణ ప్రాణ రక్షణకు అత్యంత అవసరమన్నారు. రక్షణపై ఆలోచన నుంచి అమలు వరకు సమయం పడుతుందన్నారు. కానీ ప్రమాదం మాత్రం ఒక్క క్షణంలో సంభవిస్తుందని గుర్తుచేశారు. అందుకే ప్రతి ఒక్కరు పని సమయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కళాకారులు ప్రదర్శించిన రక్షణ చైతన్య నాటిక అందరినీ ఆలోచింపజేసింది. అనంతరం పలు పోటీల విజేతలు, నాటిక కళాకారులు, గాయకులు, ఆర్కెస్ట్రా సభ్యులను వేదికపై సన్మానించి బహుమతులు అందజేశారు. మహిళా ఉద్యోగినులతో సామూహిక రక్షణ ప్రతిజ్ఞ కూడా ఈ సందర్భంగా నిర్వహించారు. ఓసీ సందర్శనకు వచ్చిన అతిథులకు కార్మికులు, అధికారులు, సూపర్వైజర్లు కలిసి మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుపరి రక్షణ తనిఖీ బృందం పని ప్రదేశాలు, హాల్ రోడ్లు, డంప్ యార్డులు, బంకర్లు వర్క్ షాపులు, రాత్రి లైటింగ్ వ్యవస్థను, ఓబీ కంపెనీ పని ప్రాంతాలను, వ్యక్తిగత రక్షణ పరికరాల వినియోగాన్ని క్షుణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇన్ స్పెక్షన్ టీమ్ సభ్యులు ఎండి. జాకీర్ హుస్సైన్, ఇల్లందు జేకే5 ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ కే.వి.ఆర్ ప్రకాష్, కొత్తగూడెం నుంచి డిజిఎం కార్పొరేట్ డి. వెంకటేశ్వర్లు, ఎస్ఎస్ఓ సత్యనాయరణ, మణుగూరు ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ టి. సురేష్, గుర్తింపు సంఘం నాయకులు వై. రాంగోపాల్, ప్రాతినిధ్య సంఘ నాయకులు వత్సవాయి క ృష?ం రాజు, అధికారుల సంఘం అధ్యక్షులు వి. మదన్ నాయక్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ డి. వెంకట రామారావు, ఏజీఎం ఐఈడి రాంబాబు, ఏరియా ఎస్ఓటు జీఎం బి. శ్రీనివాసాచారి, ప్రాజెక్ట్ అధికారి ఎంఎన్ జీఓసి శ్రీనివాస్, డిజిఎం (పర్సనల్) అధికార ప్రతినిధి ఎస్. రమేష్, సర్వే అధికారి ఎల్. దయాకర్, ఇన్చార్జ్ ఇంజనీర్ జె. వీరభద్రుడు, మేనేజర్ టైరెడ్డి వెంకటేశ్వర్లు, రక్షణ అధికారి ఆర్. భాస్కర్ రావు, సంక్షేమ అధికారి డి. నరేష్, తదితరులు పాల్గొన్నారు.

సెంటినరీ కాలనీ డిస్పెన్సరి తనిఖీ

విశాలాంధ్ర, మంథని: 56వ వార్షిక రక్షణ పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం సెంటినరీ కాలనీ డిస్పెన్సరిని తనిఖీ బృందం కన్వీనర్ డాక్టర్ పి. రమేష్ బాబు, ఇతర సభ్యులు సందర్శించారు. ఇట్టి కార్యక్రమానికి రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకర రావు, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వర రావు లు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఉద్యోగి ఆరోగ్యంగా ఉంటేనే సంస్థ అభివృద్ధి చెందుతుందని, అందుకు వైద్య బృందం చేస్తున్న సేవలు ఎంతో బాగున్నాయని అన్నారు. తదుపరి ఉత్తమప్రతిభ కనబరచిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అనంతరం డిస్పెన్సరీ నందు గల రికార్డులను తనిఖీ బృందం పరిశీలించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కార్పొరేట్ ఐటీ విభాగం డీజీఎం పి.హరిశంకర్ రావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శేషగిరిరావు, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ జి. శంకర్, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల నేపథ్యంలో బిఆర్ఎస్ పార్టీకి షాక్...

కాంగ్రెస్లో జంప్ చేసిన ముగ్గురు వార్డు సభ్యులు

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : గ్రామాల్లో చాలా ప్రతిష్ట గా జరుగుతున్న స్థానిక ఎన్నికల నేపథ్యంలో బిఆర్ ఎస్ పార్టీ బలపరుస్తున్న ముగ్గురు వార్డ్ అభ్యర్థులు గోడ దుకారు. చుంచుపల్లి మండలం రామాంజనేయ కాలనీలొ ఈ పరిణామం చోటు చేసుకుంది. దింతో బిఆర్ ఎస్ పార్టీకి షాక్ తగిలినట్లు భావిస్తున్నారు. వార్డు సభ్యులుగా పోటీచేస్తున్న పోకల శ్రీలత, దారావత్ మంజు, దారావత్ నాగ ప్రతాప్ ఈ ముగ్గురు అధికార కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. ఓటింగ్ సమీపిస్తున్న తరుణంలో ఈ పరిణామం బిఆర్ఎస్ పార్టీ స్థానిక నాయకులకు మింగుడు పడటం లేదు. డీసీసీ అధ్యక్షురాలు తోట దేవిప్రసన్న, కాంగ్రెస్ నాయకులు జెవిఎస్ చౌదరి, ఆళ్ల మురళి, ఊకంటి గోపాల్ రావు, జేబి శౌరి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చీకటి కార్తీక్ లు పార్టీలొ చేరిన వార్డు సభ్యులకు కాంగ్రెస్ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ప్రభుత్వం పేద ప్రజలకోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అన్నివర్గాల జనం కోసం చేపడుతున్న అభివృద్ధిని చూసి బిఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు దేవి ప్రసన్న వెల్లడించారు. బిఆర్ఎస్ పార్టీకి చెందిన కేటీఆర్ లాంటి రాష్ట్ర నేతలు కాంగ్రెస్ ప్రభుత్వం పై ఎంత దుష్ప్రచారం చేసినప్పటికీ వాస్తవాలు స్థానిక ప్రజలకు తెలుసన్నారు. అబద్దాలతో ఎంతో కాలం రాజకీయ నాయకులు మలుగడ సాగించలేరని స్పష్టం చేశారు. ప్రజలకు జవాబు దారీ తనంగా ఉన్నంతవరకు ఏ నాయకులకు గాని ఏ ప్రభుత్వానికి తిరుగు ఉండదని వెల్లడించారు. కాంగ్రెస్ నేత రైల్వే బోర్డు సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, సుజాతనగర్ మండల అధ్యక్షులు చింతల పూడి రాజశేఖర్, నాయకులు గౌస్ మొయినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యల ఎజెండానే... తన ఎజెండాగా పనిచేస్తా : సర్పంచ్ అభ్యర్థి కిషోర్

విశాలాంధ్ర - బూర్గంపాడు : స్థానిక ఎన్నికల్లో మండలంలోనే పారిశ్రామిక ప్రాంతమైన సారపాక మేజర్ గ్రామపంచాయతీ తీవ్ర ఉత్కంఠకు కారణం అవుతుంది. పోటీలో ఉన్న అభ్యర్థుల తోపాటు ప్రధాన రాజకీయ పార్టీల నాయకులకు ఇక్కడి సర్పంచ్ ఎన్నిక చాలా ప్రతిష్టాత్మకంగా మారింది. పోలింగ్ సమయం దగ్గర పడుతుండటంతో పోటీలో ఉన్న అభ్యర్థులు గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఎవరికి వారు తామే గెలుస్తున్నామని ధీమాగా చెప్తున్నప్పటికీ... ఎక్కడో గుండెల్లో శంక వెంటాడుతూనే ఉంది. ఈ క్రమంలో సర్పంచ్ అభ్యర్థులతోపాటు వార్డుల్లో నిలబడ్డ అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా వస్త్రాలన్నీ ఉపయోగిస్తున్నారు. కానీ కాంగ్రెస్ తోపాటు మిత్రపక్షలు బలపరిచిన అభ్యర్థిగా రంగంలో దిగిన యువనాయకుడు కిషోర్ కు విజయ అవకాశాలపై బాగా నమ్మకం పెరిగింది. అయినప్పటికీ ఎలాంటి గర్వం, భేషజాలు లేకుండా చాలా సాదాసీదాగా గ్రామ ప్రజల్లో కలిసిపోయి వారిలో ఒకడిగా సాగిస్తున్న ప్రచారం అందరిని ఆకట్టుకుంటుంది. గత ప్రభుత్వ హాయంలో ఇక్కడ అధికారం చేపట్టిన నాయకులు ప్రజల సమస్యలు గాలికి వదిలేసి సొంత లాభానికే ఎక్కువ పని చేశారని స్థానిక ప్రజల్లో విమర్శలున్నాయి. అందుకే కొత్త ముఖాలను సర్పంచ్ గా తేవాలనుకుంటున్నారు. ఈ అంశం కిషోర్ కు బాగా కలిసి వచ్చే అవకాశం కనిపిస్తుంది. నిజాయితీగా ప్రధాన సమస్యల సాధనే ఎజెండాగా పనిచేస్తానని ఒక్కసారి సర్పంచ్ గా అవకాశం ఇవ్వాలని కిషోర్ చాలా సహజంగా కోరుతున్నారు. గ్రామంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం, డ్రైనేజీల నిరంతర ప్రక్షాళన, అంతర్గత రహదారుల దుస్థితినీ బాగుచేయడం, అర్హులైన ప్రజలందరికీ అందాల్సిన ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలను అందిస్తానని కిషోర్ చాలా ఆత్మవిశ్వాసంతో స్థానికులకు భరోసా ఇస్తున్నారు. అధికార పార్టీ నాయకుల అండతోపాటు కాంగ్రెస్ ప్రభుత్వంలో అంది వచ్చిన సంక్షేమ పథకాలు ఇందిరమ్మ ఇల్లు కిషోర్ గెలుపుకు బాటలు వేస్తాయని మిత్రపక్షాల నాయకులు భావిస్తున్నారు.

అనారోగ్యంతో సీనియర్ రిపోర్టర్ మృతి

విశాలాంధ్ర-సత్తుపల్లి: గత 30 సంవత్సరాలుగా వివిధ పత్రికల్లో పని చేస్తూ ప్రస్తుతం నమస్తే తెలంగాణ పత్రిక సత్తుపల్లి ఆర్సి ఇన్చార్జిగా పనిచేస్తున్న దమ్మాలపాటి సత్యనారాయణ ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. గత కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతూ ఉన్న సత్యనారాయణ పత్రికా రంగంలోకి వచ్చిన నాటి నుంచి గడచిన కొద్దిరోజుల వరకు కూడా ప్రజా సమస్యలను పత్రికల ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఎన్నో సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ఇప్పటివరకు పలు పత్రికల్లో పనిచేసి చేసిన సత్యనారాయణ ప్రజా సంక్షేమం కోసమే కథనాలు రాస్తూ తనకంటూ సత్తుపల్లి నియోజకవర్గంలో ప్రత్యేక గుర్తింపును ఏర్పరచుకున్నాడు. ప్రజల సమస్యలపై ప్రత్యేక కథనాలు రాస్తూ తోటి విలేకరుల ప్రశంసలతోపాటు ప్రజల అభిమానాన్ని పొందిన వ్యక్తి సత్యనారాయణ. కొన్ని కొన్ని సందర్భాల్లో అవినీతి కి సంబంధించిన కథనాలు రాసేటప్పుడు ఎటువంటి భయం బెరుకు లేకుండా వార్తలు రాసి ధైర్యంగా ముందుకెళ్లేవాడు. సత్తుపల్లి పట్టణంలోని తోటి విలేకరులందరితో సత్సంబంధాలు కొనసాగించిన సత్య నారాయణ మరణం విలేకరులందరినీ తీవ్రంగా కలచి వేసింది.

మోదీ 'వక్రీకరణ గురువు'

వందేమాతరంపై ప్రధాని వ్యాఖ్యలు ఖండించిన కాంగ్రెస్

న్యూదిల్లీ: జాతీయ గీతం వందేమాతరంను కాంగ్రెస్ పార్టీ ముక్కలుగా విరిచిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ సోమవారం తీవ్రంగా తప్పుబట్టింది. మోదీని 'వక్రీకరణ గురువు' అని అభివర్ణించింది. రవీంద్రనాథ్ ఠాగూర్‌తో సహా దేశ వ్యవస్థాపక పితామహులను అవమానించినందుకు ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. జవహర్ లాల్ నెహ్రూ బుజ్జగింపు రాజకీయాలను అనుసరించారని ప్రధాని మోదీ చేసిన ఆరోపణలపై మండిపడింది. 'గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్‌ను ఈ రోజు పార్లమెంటులో 'వక్రీకరణ మాస్టర్' అవమానించారు. ఆయన కచ్చితంగా క్షమాపణ చెప్పాలి. ఆయన దేశ వ్యవస్థాపక పితామహులను... ముఖ్యంగా ఠాగూర్‌ను అవమానించాడు' అని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్ వ్యవహారాలు) జైరాం రమేశ్ 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. ఠాగూర్ జీవిత చరిత్ర పేజీలను పంచుకుంటూ, '1994లో విశ్వభారతి ప్రచురించిన ప్రభాత్ కుమార్ ముఖోపాధ్యాయ్ రాసిన రవీంద్రనాథ్ ఠాగూర్ జీవిత చరిత్రకు చెందిన పుస్తక సంపుటి 4 నుంచి 110-112 పేజీలు ఇక్కడ ఉన్నాయి' అని అన్నారు. 'నెహ్రూను బుజ్జగింపులకు పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నారు. కానీ ప్రధాన మంత్రి-మాస్టర్ డిస్టోరియన్ (వక్రీకరణ గురువు) సమాధానం ఇస్తారా : 1. 1940 మార్చిలో లాహోర్‌లో పాకిస్తాన్ తీర్మానాన్ని ప్రతిపాదించిన వ్యక్తితో 1940ల ప్రారంభంలో బెంగాల్‌లో ఏ భారత నాయకుడు సంకీర్ణాన్ని ఏర్పాటు చేశాడు? అది శ్యామా ప్రసాద్ ముఖర్జీ. 2. జూన్ 2005లో కరాచీలో జిన్నాను ప్రశంసించిన భారతీయ నాయకుడు ఎవరు? అది ఎల్.కె.అద్వానీ. 3. తన పుస్తకం 2009లో జిన్నాను ప్రశంసించిన భారతీయ నాయకుడు ఎవరు? అది జస్వంత్ సింగ్' అని జైరాం రమేశ్ మరొక పోస్ట్‌లో పేర్కొన్నారు. జాతీయ గీతం వందేమాతరం 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రాజ్యాంగం 'అణచివేయబడింది', అత్యవసర పరిస్థితి ద్వారా దేశం బంధించబడిందంటూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. వందేమాతరం 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా లోక్‌సభలో ఒక రోజంతా చర్చను ప్రారంభించిన మోదీ... బ్రిటీషు అణచివేత ఉన్నప్పటికీ, వందేమాతరం ఒక శిలలా నిలిచి ఐక్యతను ప్రేరేపించిందని అన్నారు. వందేమాతరం నేపథ్యం ముస్లింలను వ్యతిరేకించే అవకాశం ఉందని నెహ్రూ... సుభాష్ చంద్రబోస్‌కు రాసిన లేఖను మోదీ ఉదహరించారు.

వందేమాతరం విలువలు చెప్పేది మీరా?

బీజేపీపై ధ్వజమెత్తిన అఖిలేశ్

న్యూదిల్లీ: సమాజ్‌వాది పార్టీ నాయకుడు అఖిలేశ్ యాదవ్ సోమవారం బీజేపీపై విమర్శలు గుప్పించారు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనని వారు ఇప్పుడు 'వందేమాతరం' విలువల గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. జాతీయ గీతాన్ని ఇతరులపై తమ నమ్మకాలను రుద్దడానికి ఒక సాధనంగా ఉపయోగించరాదని ఆయన నొక్కి చెప్పారు. సోమవారం లోక్‌సభలో వందేమాతరం 150వ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన చర్చలో అఖిలేశ్ పాల్గొని మాట్లాడుతూ వందేమాతరంను స్ఫూర్తితో అనుసరించాలని, ఎందుకంటే ఇది స్వాతంత్ర్య పోరాటంలో ప్రజలను బంధించిన పాట అని అన్నారు. 'వందేమాతరం అనేది ప్రదర్శన కాదు. రాజకీయ సాధనం కూడా కాదు. మనం వాళ్ల మాటలు విన్నప్పుడు, వాళ్లే ఆ గీతాన్ని సృష్టించినట్లుగా ధ్వనించేలా చేస్తారు' అని అఖిలేశ్ అధికారపక్షాన్ని ఉద్దేశించి అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనని వ్యక్తులు 'వందేమాతరం అర్థాన్ని నిజంగా ఎలా అర్థం చేసుకోగలరని కూడా ఆయన ప్రశ్నించారు. 'నేడు, విభజన శక్తులు వందేమాతరం గీతాన్ని ఉపయోగించి విభజనలను సృష్టిస్తున్నారు. ఈ వ్యక్తులు ఇప్పటికీ బ్రిటీషు వారు ఉపయోగించిన 'విభజించి పాలించు' విధానాన్ని అనుసరిస్తున్నారు' అని సమాజ్‌వాది పార్టీ ఎంపీ అన్నారు. అధికారపక్షం బెంచీలలో ఉన్న వారు ప్రతిదీ సొంతం చేసుకోవాలని కోరుకుంటున్నారని ఆయన ఆరోపించారు. 'పాలకపక్షంలో ఉన్న వారు తమకు చెందని దిగ్గజ నాయకులను తమ సొంతం చేసుకోవడానికి ప్రయత్నించడం తరచూ కనిపిస్తోంది' అని అన్నారు. 'ప్రజలు మొత్తం వందేమాతరం గీతాన్ని గుర్తించుకోకపోవచ్చు లేదా దాని ప్రాముఖ్యతను పూర్తిగా అర్థం చేసుకోకపోవచ్చు. ఆ రెండు పదాలను ఉచ్చరించడం గర్వాన్ని రేకెత్తిస్తోంది. ఎందుకంటే అవి ప్రజల హృదయాల్లో నాటుకుపోయాయి' అని అఖిలేశ్ తెలిపారు. బ్రిటీషు పాలన నుంచి విముక్తి కోసం భారతదేశాన్ని ఏకం చేయడంలో 'వందేమాతరం' కీలక పాత్ర పోషించిందని అన్నారు. ఆ గీతం 150 వ సంవత్సరంలో ఈ గీతాన్ని ఒకరి నమ్మకాలను రుద్దడానికి లేదా ఇతరులపై ఒత్తిడి తీసుకురావడానికి ఒక మార్గంగా ఉపయోగించకూడదు' అని అన్నారు.

బెంగాల్ ఎన్నికల కోసమే 'వందేమాతరం' స్టంట్: ప్రియాంక

న్యూదిల్లీ: పార్లమెంట్‌లో వందేమాతరంపై చర్చ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ మాట్లాడారు. దేశంలోని ఎన్నికల సంస్కరణలపై చర్చ పెట్టకుండా... దాని నుంచి దృష్టి మరల్చడానికే కేంద్ర ప్రభుత్వం వందేమాతరంపై చర్చ పేరుతో కొత్త కార్యక్రమం ప్రారంభించిందని ఆరోపించారు. వందేమాతరం అంటేనే ఓ చరిత్ర అని, దేశంలోని కణం కణంలో అది జీవించే ఉంటుందని ఆమె అన్నారు. బెంగాల్‌లో త్వరలో జరగనున్న ఎన్నికల కోసమే కేంద్రం ఈ కొత్త ఎత్తుగడ మొదలు పెట్టిందన్నారు. వందేమాతరంపై చర్చ పేరుతో దేశం కోసం పోరాటం చేసిన స్వాతంత్ర్య సమర యోధులపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. బీజేపీ ఎప్పుడు ప్రజలకు గతమే చూపిస్తుందని, భవిష్యత్తు ఆ పార్టీ చూడదని, ప్రజలను కూడా చూడనివ్వదని దుయ్యబట్టారు. మోదీకి మాటలు ఎక్కువ... చేతలు తక్కువని, ప్రజల దృష్టి మళ్లించే రాజకీయం చేయడం బీజేపీకి వెన్నెతో పెట్టిన విద్య అన్నారు. వందేమాతరం 150 ఏళ్ల వేడుక సందర్భంగా ప్రధాని మోదీ మా ట్లాడుతూ ముస్లింలకు నచ్చదనే కారణంగా వందేమాతరాన్ని వ్యతిరేకించడంలో జిన్నాను జవహర్ లాల్ నెహ్రూ అనుసరించాడన్నారు. 1937లో ముస్లిం లీగ్ వందేమాతర గీతానికి వ్యతిరేకంగా ప్రచారం చేపట్టిందని తెలిపారు. అయితే దానిని వ్యతిరేకించడా నికి బదులు...వారి నిరసనలకు తలొగ్గి వందేమాతరం గీతం నుంచి కొన్ని పంక్తులను జవహర్‌లాల్ నెహ్రూ తొలగించారని మోదీ అన్నారు. దీంతో ప్రధానిపై ప్రియాంక గాంధీ విమర్శలు చేశారు.

చెల్లుబాటులోనే 50 పైసల నాణెం: ఆర్‌బీఐ

న్యూదిల్లీ: నకిలీ నోట్ల గుర్తింపు, కరెన్సీకి సంబంధించి వ్యాప్తిలో ఉండే వదంతుల గురించి పౌరులకు ఎప్పటికప్పుడు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) అవగాహన కల్పిస్తూ ఉంటుంది. తాజాగా నాణేలపై ప్రజలకు ఉన్న అపోహలను తొలగించేందుకు నడుం బిగించింది. ఇందులో భాగంగా వాట్సప్ ద్వారా వ్యక్తిగతంగా సందేశాలు పంపిస్తోంది. నాణేలపై అవగాహన కల్పిస్తూ ఓ వీడియో రూపొందించింది. వాట్సప్ సందేశం ప్రకారం... నాణేలు వేర్వేరు డిజైన్లతో ఉన్నప్పటికీ అవన్నీ చలామణిలోనే ఉన్నాయని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. అంతేకాకుండా 50 పైసలు మొదలుకొని, రూ.1, రూ.2, రూ.5, రూ.10, రూ.20 నాణేలన్నీ చట్టబద్ధమేనని స్పష్టంచేసింది. మున్ముందు కూడా చలామణిలో ఉంటాయని పేర్కొంది. నాణేల గురించి తప్పుదారి పట్టించే సమాచారం లేదా వదంతులను విశ్వసించొద్దని సూచించింది. సంకోచం లేకుండా పౌరుల నుంచి నాణేలు స్వీకరించాలని వ్యాపారులకు ఆర్‌బీఐ విజ్ఞప్తి చేసింది. ముఖ్యంగా రూ.10 నాణేల గురించి గతంలోనూ ఆర్‌బీఐ అవగాహన కల్పించినా... ఇప్పటికీ వీటిని తీసుకొనేందుకు కొందరు సంకోచిస్తున్నారు. 50 పైసల నాణెం ఇంకా చెల్లబాటవుతుందని ఆర్‌బీఐ పేర్కొన్నది.

'బంకిం దా కాదు... బంకిం బాబు'

ప్రధాని ప్రసంగానికి అడ్డుపడిన తృణమూల్ ఎంపీ

న్యూదిల్లీ: వందేమాతరంపై చర్చ సందర్భంగా పార్లమెంట్‌లో ప్రధాని నరేంద్రమోదీ ప్రసంగిస్తుండగా ఆసక్తికర ఘటన చోటుచేసుకొంది. వందేమాతరం గేయ రచయిత బంకించంద్ర ఛటర్జీని ప్రధాని బంకిం దా (దాదా) అని పలుమార్లు సంబోధించారు. అదే సమయంలో తృణమూల్ ఎంపీ సౌగత్ రాయ్ ప్రధాని 'దా' అని సంబోధించడంపై అభ్యంతరం చెప్పారు. సోదరుడు అని సంబోధించేందుకు బెంగాలీ భాషలో 'దా' అని వాడతారని, సాంస్కృతిక దిగ్గజానికి అటువంటి పదం వాడటం సరికాదని సూచించారు. 'బంకిం బాబు' అని ప్రధాని సంబోధించాలని సూచించారు. దీనికి సానుకూలంగా ప్రధాని స్పందించారు. ఇకనుంచి బంకిం బాబు అనే సంబోధిస్తానని వెల్లడించారు. తన పొరబాటును సరిచేసినందుకు సౌగత్‌రాయ్‌కు ధన్యవాదాలు చెబుతూ... 'నేను మిమ్మల్ని దాదా అని సంబోధించవచ్చా? లేదా దానిపై కూడా ఏమైనా అభ్యంతరాలున్నాయా' అని సరదాగా ప్రశ్నించారు.

బెంగాలీ నటుడు కళ్యాణ్ చటర్జీ కన్నుమూత



కోల్‌కతా: ప్రముఖ బెంగాలీ నటుడు కళ్యాణ్ చటర్జీ (81) కన్నుమూశారు. 400కి పైగా చిత్రాల్లో నటించిన ఆయన ప్రభుత్వాసుపత్రిలో మృతి చెందారు. ఆయన కొంతకాలంగా వయసు సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. ఇటీవలే టైఫాయిడ్ బారిన పడి ఎంఆర్ బంగూర్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆరోగ్యం క్షీణించి ఆదివారం రాత్రి మృతి చెందారు. ఈ విషయాన్ని సోమవారం పశ్చిమ బెంగాల్ మోషన్ పిక్చర్ ఆర్టిస్ట్స్ ఫోరం ఒక ప్రకటనలో తెలిపింది. తమ అత్యంత విలువైన సభ్యుల్లో కళ్యాణ్ ఛటర్జీ తమను విడిచిపెట్టారు. ఆయన మరణవార్తతో తాము దిగ్భ్రాంతికి గురయ్యాము. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఈ ప్రకటన పేర్కొంది. కాగా, 1968లో అపోంజన్ చిత్రంతో ఆయన తెరంగేట్రం చేశారు. ఆయన ఎక్కువగా సహాయక పాత్రల్లో నటించారు. ఆయన ధన్యేమేయే, దుయి పృథిబి, సబుజ్ ద్వీపర్ రాజా, బైషే స్రాబోన్ వంటి చిత్రాల్లో తన నటనతో ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నారు. బెంగాలీ చిత్రాలతోపాటు హిందీ సినిమాల్లోనూ నటించారు.

దిల్లీలో భారీగా గంజాయి పట్టివేత

న్యూదిల్లీ: దిల్లీ విమానాశ్రయంలో భారీగా విదేశీ గంజాయి పట్టుబడింది. మత్తుపదార్థాలు తరలిస్తున్న ఇద్దరిని అధికారులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి గంజాయి పట్టుకున్నారు. ఈ విదేశీ గంజాయి విలువ దాదాపు రూ.15 కోట్లు ఉంటుందని తెలిపారు. గంజాయి నిర్మూలనకు ప్రభుత్వం ఎన్ని కఠిన చర్యలు తీసుకుంటున్నా ఫలితం కనిపించడం లేదు. అధికారులు ఎంతగా కట్టడి చేసినప్పటికీ నిందితులు ఏదో రకంగా మత్తు పదార్థాల స్మగ్లింగ్ చేస్తున్నారు. తాజాగా దిల్లీలో మరోసారి భారీగా విదేశీ గంజాయి పట్టుబడింది. ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు విదేశీ గంజాయి తరలిస్తుండగా కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. గతంలోనూ దిల్లీ విమానాశ్రయంలో పెద్దమొత్తంలో గంజాయి పట్టుబడింది. బ్యాంకాక్ నుంచి వచ్చిన స్మగ్లర్ల నుంచి కస్టమ్స్ అధికారులు దాదాపు రూ.47 కోట్ల విలువైన గంజాయి సీజ్ చేశారు.

ఏడు లక్షల కోట్లు ఆవిరి

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. విదేశీ మదుపర్ల అమ్మకాలు, రూపాయి బలహీనత కారణంగా ప్రధాన షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. స్మాల్, మిడ్‌క్యాప్ సూచీలూ భారీగా (దాదాపు 2 శాతం) పతనమయ్యాయి. దీనికితోడు యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్ల ప్రకటన నేపథ్యంలో మదుపర్లలో అప్రమత్తత కనిపించింది. దీంతో ఓ దశలో సెన్సెక్స్ 800 పాయింట్లకు పైగా నష్టపోగా... నిఫ్టీ మళ్లీ 26 వేల మార్కు దిగువకు చేరింది. బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.7 లక్షల కోట్లపైనే ఆవిరై... రూ.463 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 85,624.84 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 85,712.37) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 84,875.59 వద్ద కనిష్టాన్ని తాకింది. చివరికి 609.68 పాయింట్ల నష్టంతో 85,102.69 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 225.90 పాయింట్ల నష్టంతో 25,960.55 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 90.09గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టెక్ మహీంద్రా, రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ మినహా మిగిలిన షేర్లూ నష్టాల్లో ముగిశాయి. బీఈఎల్, ఎటెర్నెల్, ట్రెంట్, టాటా స్టీల్, బజాజ్ ఫైనాన్స్ ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 63 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా... బంగారం ఔన్సు 4208 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

డంప్ యార్డుల్లా విమానాశ్రయాలు

ఎక్కడ చూసినా కుప్పలు తెప్పలుగా లగేజీ బ్యాగులు

న్యూదిల్లీ: భారతదేశంలో ఇండిగో ఎయిర్‌లైన్స్ సృష్టించిన సంక్షోభం అంతా ఇంతా కాదు. తమ దగ్గర ఆటలు చెల్లవన్నట్టుగా అటు విమానయాన శాఖకు... ఇటు ప్రయాణికులకు ఇండిగో ఎయిర్‌లైన్స్ సంస్థ ఓ పాఠం నేర్పించింది. వారం రోజులుగా ప్రయాణికులు విమానాశ్రయాల్లో నరకయాతన అనుభవిస్తున్నారు. తిండి తిప్పలు లేకుండా పడిగాపులు కాస్తున్నారు. మీడియా ఛానల్స్‌లో, సోషల్ మీడియాలో ఎన్నో వీడియోలు, ఎన్నో ఫొటోలు చక్కర్లు కొడుతున్నాయి. ప్రయాణికులు ఆక్రోశం, ఆక్రందనలు చేస్తున్నా... ఇండిగోకు చీమ కుట్టినట్లైనా కనిపించడం లేదు. నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తోంది. ఇంత సంక్షోభం కళ్ల ముందు కనిపిస్తున్నా కేంద్ర ప్రభుత్వం కూడా కంటితుడుపు చర్యలు మాత్రమే తీసుకుంటుంది. ప్రస్తుత సంక్షోభాన్ని గాడిన పెట్టే పరిస్థితులు కనిపించడం లేదు. గతవారం మొదలైన సంక్షోభం... ఈ వారం కూడా కొనసాగుతూనే ఉంది. సోమవారం కూడా వందలాది విమానాలను రద్దు చేసింది. దీంతో ప్రయాణికుల ఇక్కట్లు కొనసాగుతూనే ఉన్నాయి. ఇదిలా ఉంటే దేశవ్యాప్తంగా ఏ విమానాశ్రయంలో చూసినా ప్రయాణికులు, లగేజీ బ్యాగులతో కిటకిటలాడుతున్నాయి. అన్ని విమానాశ్రయాలు డంప్ యార్డులను తలపిస్తున్నాయి. ఎటు చూసినా బ్యాగులు కనిపిస్తున్నాయి. కుప్పలు తిప్పలుగా పడి ఉన్నాయి. ఇందుకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు వైరల్ అవుతున్నాయి. ఇంకోవైపు చోరీలు జరుగుతున్నాయి. తమ వస్తువులు పోయాయంటూ ప్రయాణికులు ఫిర్యాదులు చేస్తున్నారు.

350 ఇండిగో సర్వీసులు రద్దు

న్యూదిల్లీ: దేశీయ విమానయాన సంస్థ ఇండిగో సర్వీసుల్లో అంతరాయం కొనసాగుతోంది. సోమవారం దేశవ్యాప్తంగా పలు విమానాశ్రయాల నుంచి రాకపోకలు సాగించాల్సిన 350కి పైగా ఇండిగో సర్వీసులు రద్దయ్యాయి. ఒకపక్క ఈ పరిస్థితులను చక్కదిద్దేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ... ఏడో రోజూ సంక్షోభం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో దిల్లీ ఎయిర్‌పోర్ట్ ప్రయాణికులకు సూచనలు చేసింది. ఈరోజు ఉదయానికి దిల్లీ ఎయిర్‌పోర్టు నుంచి 134, బెంగళూరు నుంచి 127, చెన్నై నుంచి 71, అహ్మదాబాద్ నుంచి 20, ఇతర విమానాశ్రయాల నుంచి మరికొన్ని ఇండిగో సర్వీసులు రద్దయ్యాయి. ముంబై, కోల్‌కతా విమానాశ్రయాల్లో అంతరాయం కొనసాగుతోంది. ఈ పరిణామాల వేళ దిల్లీ ఎయిర్‌పోర్ట్ నుంచి ప్రకటన వచ్చింది. అంతరాయాలు కొనసాగుతాయని, ఎయిర్‌పోర్ట్‌కు వచ్చేముందు ఎప్పటికప్పుడు ఫ్లైట్ స్టేటస్ తనిఖీ చేసుకోవాలని ప్రయాణికులకు సూచించింది. అంతరాయాల సంఖ్యను తగ్గించేందుకు తమ ప్రయత్నాలు కొనసాగుతున్నాయని వెల్లడించింది.

గొప్ప విజయంతో ఎక్కువ బాధ్యత

బీహార్ ఎన్డీయే ఎంపీలకు మోదీ శుభాకాంక్షలు

న్యూదిల్లీ: ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో పాలక కూటమి భారీ విజయం సాధించిన తర్వాత ప్రజల సంక్షేమం కోసం మరింత ఉత్సాహంగా పని చేయాలని బీహార్‌కు చెందిన ఎన్డీయే ఎంపీలకు సోమవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. 'గొప్ప విజయంతో గొప్ప బాధ్యత వస్తుంది' అని అన్నారు. బీహార్ ఎన్నికలలో ఎన్డీయే భారీ విజయం సాధించినందుకు అభినందనలు తెలిపేందుకు ఎన్డీయే ఎంపీల బృందం తనను ఇక్కడ కలిసినప్పుడు ప్రధాన మంత్రి ఈ సందేశాన్ని అందించారని లోక్ జనశక్తి పార్టీ (రామ్‌విలాస్) ఎంపీ శాంభవి చౌదరి అన్నారు. 'బీహార్‌లో ప్రధాన మంత్రి నాయకత్వం, ప్రచార మద్దతుకు మేము అభినందనలు, కృతజ్ఞతలు తెలిపాము. ఇది మా ఎన్నికలకు బలమైన ఊపునిచ్చింది. గొప్ప విజయవంతో గొప్ప బాధ్యత వస్తుందని ప్రధాన మంత్రి మాకు గుర్తు చేశారు' అని ఆమె సమావేశం తర్వాత విలేకరులతో అన్నారు. వర్గ బేధాలతో సంబంధం లేకుండా అందరికీ సమగ్ర అభివృద్ధి, ప్రతికూలత, ద్వేషం, అబద్ధం కంటే పురోగతిపై దృష్టి పెట్టడం వంటి ఎన్డీయే స్పష్టమైన ప్రాధాన్యతతో బీహార్ ప్రజల సంక్షేమం కోసం మరింత ఉత్సాహంగా పని చేయాలని ఎంపీలను మోదీ కోరారని చౌదరి అన్నారు. ఎన్నికల తర్వాతే తమ నిజమైన పని ప్రారంభమవుతుందని మోదీ బీహార్ ఎంపీలకు గుర్తు చేశారని ఆ వర్గాలు తెలిపాయి.

కాంగ్రెస్‌లో సీఎం సీటుకు రూ.500 కోట్లు

సిద్ధూ సతీమణి కౌర్

చండీగఢ్: పంజాబ్ కాంగ్రెస్ నాయకురాలు నవజ్యోత్ సిద్ధూ సతీమణి కౌర్ సిద్ధూ సంచలన వ్యాఖ్యలు చేశారు. తన భర్త రాజకీయాల్లోకి రావడానికి సిద్ధమేనని, అయితే పంజాబ్ ముఖ్యమంత్రి కావడానికి 'రూ.500 కోట్ల సూట్‌కేస్' అవసరమని, అంత డబ్బు తమ దగ్గర లేదని కౌర్ అన్నారు. శాంతిభద్రతలపై గవర్నర్ గులాబ్ చంద్ కటారియాతో సమావేశం తర్వాత నవజ్యోత్ కౌర్ ఈ వ్యాఖ్యలు చేశారు. తన భర్త క్రియాశీల రాజకీయాల్లోకి రావాలంటే 2027 అసెంబ్లీ ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించాలన్నారు. అప్పుడు మాత్రమే రాజకీయాల్లోకి వచ్చే అంశంపై పరిశీలిస్తామని వెల్లడించారు. 'మేము ఎల్లప్పుడూ పంజాబ్, పంజాబీయత్ కోసం మాట్లాడతాం. కానీ ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చోవడానికి మా దగ్గర రూ.500 కోట్లు లేవు' అని అన్నారు. ఎవరూ తనను వ్యక్తిగతంగా డబ్బు కోసం సంప్రదించలేదని, కానీ 'రూ.500 కోట్ల సూట్‌కేస్ ఇచ్చిన వ్యక్తి ముఖ్యమంత్రి అవుతాడు' అని స్పష్టం చేశారు. ఏదైనా బాధ్యతలు అప్పగిస్తే పంజాబ్‌ను సిద్ధూ అభివృద్ధి చేస్తారన్నారు. సిద్ధూ సతీమణి కౌర్ వ్యాఖ్యలు రాజకీయకంగా తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఆమ్ ఆద్మీ పార్టీ, బీజేపీ ఎదురుదాడికి దిగింది. ఎవరు రూ.500 కోట్లు అడిగారని, వారి పేర్లు బయటపట్టాలని డిమాండ్ చేశాయి. ఈ లెక్కన కాంగ్రెస్ తీరు ఏంటో అర్థమవుతుందని ఆప్ వ్యాఖ్యానించింది.

దేవాలయాలు కూల్చిన చరిత్ర సంఘ్ పరివార్‌దే

న్యూదిల్లీ: భారతదేశంలో 'హిందువుల రక్షకులు' అని చెప్పుకునే సంఘ్ పరివార్ అనేక దేవాలయాలను కూల్చివేసింది. కొన్ని రోజుల క్రితం దిల్లీలోని ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యాలయానికి సమీపంలో ఉన్న 1,400 సంవత్సరాల పురాతన హిందూ దేవాలయాన్ని పార్కింగ్ కోసం కూల్చివేసింది. బీజేపీ పాలిత దిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ జందేవాలాలోని గోరఖ్‌నాథ్ ఆలయాన్ని కూల్చివేసింది. ఓ స్థానికుడు సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వీడియో ద్వారా ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ఇది పెద్దఎత్తున నిరసనలకు దారితీసింది. మోదీ ప్రభుత్వ హయాంలో 2008లో గుజరాత్ రాజధాని గాంధీనగర్‌లో 80 దేవాలయాలు కూల్చివేశారు.

అవి అక్రమ నిర్మాణాలు అనే కారణంతో మోదీ ప్రభుత్వం ఈ చర్య తీసుకుంది. 2019లో ఉత్తరప్రదేశ్‌లో కూడా విస్తృతంగా దేవాలయాలు కూల్చివేయబడ్డాయి. కాశీ విశ్వనాథ్ కారిడార్ నిర్మాణంలో భాగంగా మోదీ నియోజకవర్గం వారణాసిలో కొన్ని వేల సంవత్సరాల పురాతనమైన దేవాలయాలు సహా అనేక దేవాలయాలను కూల్చివేశారు. 2019లో యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వ నాయకత్వంలో పురాతన నగరమైన వారణాసిలో 300కి పైగా భవనాలు నేలమట్టమయ్యాయి.

ఆమెను మానసిక ఆసుపత్రిలో చేర్పించండి

నవజ్యోత్ కౌర్ వ్యాఖ్యలకు డీకే కౌంటర్

బెంగళూరు: పంజాబ్ పీసీసీ మాజీ అధ్యక్షుడు నవజ్యోత్ సింగ్ సిద్ధూ భార్య నవజ్యోత్ కౌర్‌ను మంచి మానసిక ఆసుపత్రిలో చేర్పించాలని కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్నారు. ముఖ్యమంత్రి పదవి కోసం రూ.500 కోట్లు ఇవ్వాలంటూ ఆమె చేసిన సంచలన వ్యాఖ్యలపై డీకే పైవిధంగా స్పందించారు. కర్నాటక గవర్నర్ గులాబ్ చంద్ కటారియాను సోమవారం ఉప ముఖ్యమంత్రి కలిశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఎవరైనా డబ్బులు డిమాండ్ చేశారా అని ప్రశ్నించగా... అందులో ఏమాత్రం నిజం లేదన్నారు. రూ.500 కోట్ల సూట్‌కేస్ ఇచ్చినవారు మాత్రమే సీఎం అవుతారనడంలో అర్థం లేదన్నారు. 2027 ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పంజాబ్ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటిస్తే తన భర్త తిరిగి క్రియాశీల రాజకీయాల్లోకి వస్తాడని కౌర్ చేసిన వ్యాఖ్యలు సర్వత్రా చర్చనీయాంశంగా మారాయి.

విద్యుత్ బిల్లుతో ముప్పు

పంజాబ్‌లో రైతుల ఆందోళన

హోషియాపూర్/మొహాలి: కేంద్ర ప్రభుత్వం రూపొందించిన విద్యుత్ (సవరణ) బిల్లు-2025 ముసాయిదాను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) అధ్వర్యంలో రైతులు సోమవారం పంజాబ్ అంతటా నిరసనలు చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలకు ఎస్‌కేఎం పిలుపునిచ్చింది. ఈ ఆందోళనా కార్యక్రమంలో రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘాలు కూడా పాల్గొన్నాయి. ఈ సందర్భంగా నిరసనకారులు ప్రతిపాదిత బిల్లు ప్రతులను దహనం చేశారు. హోషియాపూర్‌లోని ముకేరియన్ వద్ద మహారాణా ప్రతాప్ చౌక్, దాసుయ, శ్యామ్ చౌరిసియా, మర్నేనియన్ ఖుర్ద్ ప్రాంతాల్లోని పంజాబ్ రాష్ట్ర పవర్ కార్పొరేషన్ లిమిటెడ్(పీఎస్‌పీసీఎల్) కార్యాలయాల వెలుపల నిరసన ధర్నాలు నిర్వహించారు. అలాగే ఘర్‌శంకర్‌లో గాంధీ పార్కు నుంచి పీఎస్‌పీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ కార్యాలయం వరకు నిరసనకారులు ప్రదర్శన చేపట్టారు. కీర్తి కిసాన్ యూనియన్, కిసాన్ కమిటీ దోబా, జమ్‌హురి కిసాన్ సభ, కుల్ హింద్ కిసాన్ సభ, భారతి కిసాన్ యూనియన్ (రాజెవాలే) సహా వేర్వేరు రైతు సంఘాలకు చెందిన నాయకుల నేతృత్వంలో నాయకులు ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిరసనకారులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ విద్యుత్ (సవరణ) బిల్లు ప్రజా, రైతు వ్యతిరేక చర్య అని, వినియోగదారులపై భారాన్ని పెంచడం, విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించడమే దీని ఉద్దేశమని విమర్శించారు. అలాగే విత్తన బిల్లు-2025ను కూడా వారు వ్యతిరేకించారు. ఈ బిల్లు రైతు ప్రయోజనాలకు హాని కలిగిస్తుందని తెలిపారు. అదేవిధంగా మొహాలిలో పీఎస్‌పీసీఎల్ సబ్-డివిజనల్ కార్యాలయం వెలుపల నిరసన నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాగా కొన్ని రోజుల క్రితం కిసాన్ మజ్దూర్ యూనియన్ విద్యుత్ (సవరణ) బిల్లు-2025 కు వ్యతిరేకంగా రాష్ట్రంలో 'రైల్ రోకో' కార్యక్రమాన్ని నిర్వహించింది.